


# సాయి సూర్య


తెలుగు దిన పత్రిక

www.saisuryaa.com




ప్రచురణ, హైదరాబాద్, సంపుటి : 01 సంచిక : 61 ఎడిటర్ : పొలగోని రాజేష్ పేజిలు : 8, వెల రూ. 4, /- బుధవారం - 21 - మే - 2025

## ఇండియాలో పెరుగుతున్న కరోనా జేఎన్.1 కేసులు... వ్యాధి లక్షణాలు ఇవే!



పెరుగుతున్న కరోనా కేసులతో భారత్ లో ఆందోళన

నిన్నటికి దేశ వ్యాప్తంగా 257 యాక్టివ్ కేసులు

కొత్త వేరియంట్ కు వేగంగా వ్యాపించే సామర్థ్యం ఉందంటున్న నిపుణులు

## న్యాయమూర్తులూ మనుషులే.. పొరపాట్లు జరుగుతాయన్న జస్టిస్ అభయ్ ఓకా



గృహ హింస చట్టంపై సుప్రీంకోర్టు తీర్పు హైకోర్టులకు మార్గదర్శనం

ఓ కేసులో తాను పొరపాటు చేసినట్లు అంగీకరించిన సుప్రీం జడ్జి

న్యాయమూర్తులకు అభ్యాసం అనేది నిరంతర ప్రక్రియ అని వ్యాఖ్య

## బలూచిస్థాన్‌ను పాకిస్థాన్ దోచుకుంటోంది

– అసోం సీఎం సంచలన వ్యాఖ్యలు



అపార ఖనిజ సంపద ఉన్నా అభివృద్ధి శూన్యమన్న హిమంత

దశాబ్దాలుగా ఆర్థిక, రాజకీయ దోపిడీకి గురవుతోందని వెల్లడి

మౌలిక వసతులు కూడా కరవయ్యాయని ఆవేదన

పాలకుల నిర్లక్ష్యమే కారణమని హిమంత విశ్లేషణ

## పోలీసులు విఫలమైతే నేనే రంగంలోకి దిగుతా: కేఏ పాల్



తిరుపతిలో జేమ్స్ అనే బీటెక్ విద్యార్థి కిడ్నాప్, చిత్రహింసలకు గురయ్యాడని ఆరోపణ

రాష్ట్రంలో అన్యాయం, అక్రమ రవాణా, హింస రోజురోజుకూ పెరుగుతున్నాయని ఆందోళన

పోలీసులు చర్యలు తీసుకోకుంటే తానే రంగంలోకి దిగుతానని స్పష్టం

మే 24న గ్లోబల్ పీస్ అసెంబ్లీకి హాజరుకావాలని ప్రజలకు పిలుపు

**అమరావతి,:** ఆంధ్రప్రదేశ్‌లో శాంతిభద్రతల పరిస్థితి దిగజారిందంటూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ తీవ్రఆందోళనవ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను తక్షణమే పునరుద్ధరించాలని

# 5 లక్షల మందికి 'యువవికాసం'

జూన్ 2న మంజూరు పత్రాల పంపిణీ

నెలకు రూ.2 వేల కోట్లు ఖర్చుచేయనున్న ప్రభుత్వం

3 నెలల్లో యూనిట్లు గ్రౌండింగ్ చేయాలని లక్ష్యం




హైదరాబాద్: నిరుద్యోగ యువతకు స్వయంఉపాధి కోసం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన రాజీవ్ యువవికాసం పథకం కింద తొలిఏడాది 5 లక్షల మందికి మంజూరుపత్రాలు జారీచేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వీటిని పంపిణీ చేయాలని, 3 నెలల్లో నెలకు రూ.2 వేల కోట్లు చొప్పున ఖర్చుచేసి యూనిట్లు గ్రౌండింగ్ చేయాలని భావిస్తోంది. ఈ పథకం కింద ఇప్పటికే జిల్లాల్లో క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 25 నాటికి జిల్లా మంత్రుల అనుమతితో లబ్ధిదారుల ఎంపికను పూర్తిచేసేందుకు సంక్షేమశాఖలు సిద్ధమయ్యాయి. మిగతా..2లో




**కార్పొరేషన్లవారీగా లక్ష్యాలు.. దరఖాస్తులు**

| కార్పొరేషన్ | యూనిట్ల లక్ష్యం | వచ్చిన దరఖాస్తులు |
|---|---|---|
| ఎస్సీ | 1.44 లక్షలు | 3.92 లక్షలు |
| ఎస్టీ | 91 వేలు | 1.83 లక్షలు |
| బీసీ | 1.55 లక్షలు | 8.01 లక్షలు |
| ఈబీసీ | 51 వేలు | 37 వేలు |
| మైనార్టీ | 45 వేలు | 2.04 లక్షలు |
| క్రిస్టియన్ మైనార్టీ | 5 వేలు | 4,600 |

## కేసీఆర్, హరీశ్ రావు, ఈటల రాజేందర్‌కు నోటీసులు!



- నోటీసులు జారీ చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్
- వివరణ ఇచ్చేందుకు 15 రోజుల గడువు
- నిర్దిష్ట తేదీలను కూడా కమిషన్ ఖరారు
- కేసీఆర్ జూన్ 5వ తేదీన విచారణకు హాజరు కావాలి

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంలో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు విచారణ కమిషన్ నోటీసులు జారీ చేసింది. జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలోని కమిషన్ ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకుంది. కేసీఆర్‌తో పాటు, ఆయన ప్రభుత్వంలో మంత్రులుగా పనిచేసిన హరీశ్ రావు, బీజేపీ ఎంపీగా ఉన్న ఈటల రాజేందర్‌కు కూడా కమిషన్ నోటీసులు పంపింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన పలు అంశాలపై వివరణ ఇచ్చేందుకు ఈ నోటీసులు జారీ చేసింది. నోటీసులు అందుకున్న 15 రోజుల్లోగా కమిషన్ ఎదుట హాజరై తమ వాదనలు వినిపించాలని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఆదేశించింది. ఇందుకోసం నిర్దిష్ట తేదీలను కూడా కమిషన్ ఖరారు చేసింది. కేసీఆర్ జూన్ 5వ మిగతా..2లో

# రోహింగ్యాల వలసలతో పెను ముప్పు

- రోహింగ్యాల వలసలతో నిరుద్యోగం, అంతర్గత భద్రతకు ముప్పు: పవన్
- వారికి ఆధార్, ఓటరు, రేషన్ కార్డుల జారీపై తీవ్ర ఆందోళన
- కొందరు అధికారుల సాయంతోనే రోహింగ్యాలు స్థిరపడుతున్నారని పవన్ అనుమానం
- గతంలో బెంగాల్ నుంచి ఏపీకి భారీగా వలస వచ్చిన వైనం
- ఈ అంశంపై పోలీసులకు లేఖ రాశానని వెల్లడించిన ఉప ముఖ్యమంత్రి



**అమరావతి,:** రోహింగ్యాల అక్రమ వలసలు రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను తీవ్రతరం చేయడమే కాకుండా, దేశ అంతర్గత భద్రతకు కూడా పెను ప్రమాదంగా పరిణమిస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు ప్రభుత్వ యంత్రాంగంలోని వ్యక్తుల సహకారంతోనే రోహింగ్యాలు ఇక్కడ స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారని, వారికి సులభంగా ఆధార్, ఓటరు, రేషన్ కార్డులు కూడా అందుతున్నాయని సంచలన ఆరోపణలు చేశారు. గన్నవరం ఎయిర్ పోర్టులో పవన్ కల్యాణ్ ఇవాళ జాతీయ మీడియాతో మాట్లాడారు. గతంలో, ముఖ్యంగా 2017-18 సంవత్సరాల మధ్యకాలంలో, పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతా నుంచి పెద్ద సంఖ్యలో రోహింగ్యాలు బంగారం పని నిమిత్తం ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు వలస వచ్చారని మిగతా..2లో

# పేర్లు రాసిపెట్టుకోండి... సినిమా చూపిస్తాం

మరోసారి వార్నింగ్ ఇచ్చిన జగన్

కూటమి ప్రభుత్వం, అధికారులకు జగన్ తీవ్ర హెచ్చరిక

అన్యాయాలు చేస్తే ఎవరినీ వదిలేది లేదని వార్నింగ్

రాష్ట్రంలో ప్రస్తుతం రాక్షస పాలన సాగుతోందని విమర్శ



**అమరావతి,:** వైసీపీ అధినేత జగన్ మరోసారి కూటమి ప్రభుత్వం, కొందరు అధికారుల తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అన్యాయాలకు పాల్పడే వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని, సమయం వచ్చినప్పుడు కచ్చితంగా "సినిమా చూపిస్తాం" అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. మిగతా..2లో

# ఏపీ సీఎం చంద్రబాబు కీలక ప్రకటన..

## అధికారుల గుండెల్లో గుబులు

- జూన్ 12 తర్వాత ఎప్పుడైనా ఆకస్మిక తనిఖీలు చేస్తానని పేర్కొన్న సీఎం చంద్రబాబు
- ప్రజలకు అందించే సేవల్లో పూర్తిస్థాయి సంతృప్తి రావాల్సిందేనని వెల్లడి
- ఆర్టీసీలో సౌకర్యాలు, సదుపాయాలు ఇంకా మెరుగుపడాలని సూచన



**అమరావతి,:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక ప్రకటన చేశారు. జూన్ 12 తర్వాత ఎప్పుడైనా ఆకస్మిక తనిఖీలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు అందుతున్న రేషన్, దీపం, ఏపీఎస్ఆర్టీసీ, పంచాయతీ సేవలపై వెల్లడైన ప్రజాభిప్రాయాలను పరిశీలించిన సీఎం చంద్రబాబు నిన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, సీఎంవో కార్యదర్శులతో సమీక్షించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావొస్తుందని, అన్ని శాఖల్లో ప్రభుత్వ పనితీరు, ప్రజా సేవల విషయంలో పూర్తి స్థాయి సంతృప్తి కనిపించాలని సీఎం అన్నారు. కొన్ని శాఖల్లో మార్పు వచ్చిందని, అయితే ఆర్టీసీ వంటి చోట్ల ఇంకా సేవల్లో నాణ్యత పెరగాల్సి ఉందని సీఎం అన్నారు. దీపం 2 పథకం ద్వారా లబ్ధిదారులకు ఏడాదికి ఇచ్చే 3 సిలిండర్ల సబ్సిడీ మొత్తాన్ని ఒకేసారి ముందుగానే లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తామని మిగతా..2లో

## వంశీ, నాని కర్మ అనుభవిస్తున్నారు కోటంరెడ్డి సంచలన వ్యాఖ్యలు



- భువనేశ్వరిని తిట్టడంలో జగన్ ప్రోత్సాహం ఉందన్న ఎమ్మెల్యే
- జగన్‌ను అరెస్ట్ చేసినా సానుభూతి రాదన్న కోటంరెడ్డి
- అమరావతి రైతులపై దాడి చేయాలని సజ్జల సూచించారన్న కోటంరెడ్డి
- వైసీపీలో బూతులకు ప్రోత్సాహం

## జూన్ 21న విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుక ..



సీఎస్ విజయానంద్ కీలక సూచనలు

- విశాఖలో పీఎం మోదీ సమక్షంలో జరిగే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో 5 లక్షల మంది ప్రత్యక్షంగా పాల్గొంటారన్న సీఎస్ విజయానంద్
- రాష్ట్ర వ్యాప్తంగా కనీసం 2 కోట్ల మంది ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపు
- అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ లో కీలక సూచనలు జారీ

**అమరావతి,:** జూన్ 21న విశాఖపట్నం రామకృష్ణ బీచ్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సమక్షంలో జరిగే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో మిగతా..2లో

## న్యాయమూర్తులూ మనుషులే..
## పొరపాట్లు జరుగుతాయన్న జస్టిస్ అభయ్ ఓకా

న్యూఢిల్లీ: న్యాయమూర్తులు కూడా మనుషులేనని, తీర్పులు వెలువరించే క్రమంలో వారు పొరపాట్లు చేసే అవకాశం ఉందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభయ్ ఎస్. ఓకా అభిప్రాయపడ్డారు. 2016లో తాను బొంబాయి హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్నప్పుడు గృహ హింస చట్టం (డీవీ యాక్ట్) వ్యాఖ్యానానికి సంబంధించిన ఒక కేసులో పొరపాటు చేశానని ఆయన అంగీకరించారు. న్యాయమూర్తులకు ఇది నిరంతర అభ్యాస ప్రక్రియ అని ఆయన పేర్కొన్నారు. గృహ హింస చట్టంలోని సెక్షన్ 12(1) కింద దాఖలైన దరఖాస్తుల విచారణను రద్దు చేసే అధికారం సీఆర్‌పీసీ సెక్షన్ 482 కింద హైకోర్టులకు ఉందని జస్టిస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఓ తీర్పును వెలువరించింది. ఈ సందర్భంగా జస్టిస్ ఓకా కీలక వ్యాఖ్యలు చేశారు. హైకోర్టు న్యాయమూర్తిగా గతంలో తాను దీనికి భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశానని జస్టిస్ ఓకా గుర్తు చేసుకున్నారు. "2016 అక్టోబర్ 27న బొంబాయి హైకోర్టు ఇచ్చిన తీర్పులో నేను కూడా భాగస్వామినే. డీవీ యాక్ట్, 2005లోని సెక్షన్ 12(1) కింద చేసిన దరఖాస్తును రద్దు చేయడానికి వీలులేదని ఆ తీర్పులో పేర్కొన్నాం. ఈ అభిప్రాయం తప్పని అదే హైకోర్టు ఫుల్ బెంచ్ ద్వారా తేలింది. న్యాయమూర్తులుగా మా తప్పులను సరిదిద్దుకోవాల్సిన బాధ్యత మాపైనే ఉంది. న్యాయమూర్తులకు కూడా నిరంతర అభ్యాస ప్రక్రియ అవసరం" అని జస్టిస్ ఓకా పేర్కొన్నారు. గృహ హింస చట్టం మహిళల సంక్షేమం కోసం ప్రత్యేకంగా రూపొందించిన చట్టమని జస్టిస్ ఓకా చెప్పారు. గృహ హింసకు గురైన మహిళలకు న్యాయం చేసేందుకే ఇది ఉద్దేశించబడిందని స్పష్టం చేశారు. సెక్షన్ 482 ద్వారా సంక్రమించిన అధికారంతో ఇలాంటి దరఖాస్తులను రద్దు చేసేటప్పుడు హైకోర్టులు ఆచితూచి వ్యవహరించాలని ధర్మాసనం సూచించింది. కేసులో తీవ్రమైన చట్టవిరుద్ధత లేదా న్యాయ ప్రక్రియ దుర్వినియోగం జరిగిందని స్పష్టంగా తేలినప్పుడు మాత్రమే జోక్యం చేసుకోవాలని పేర్కొంది. ఈ విషయంలో హైకోర్టులు సంయమనం పాటించకపోతే గృహ హింస చట్టం 2005 ఉద్దేశమే దెబ్బతింటుందని ధర్మాసనం హెచ్చరించింది.

## బలూచిస్థాన్‌ను పాకిస్థాన్ దోచుకుంటోంది
### – అసోం సీఎం సంచలన వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ,:** పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో నెలకొన్న పరిస్థితులపై అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ స్పందించారు. అపారమైన సహజ వనరులు, ఖనిజ సంపద ఉన్నప్పటికీ పాకిస్థాన్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఆ ప్రాంతం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని ఆయన అన్నారు. దశాబ్దాలుగా బలూచిస్థాన్ ఆర్థికంగా, రాజకీయంగా దోపిడీకి గురవుతోందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు సీఎం హిమంత తన 'ఎక్స్' ఖాతా ద్వారా పలు కీలక విషయాలను వెల్లడించారు. "బలూచిస్థాన్ ప్రావిన్స్ అపారమైన ఖనిజ సంపదకు నిలయం. అయినా తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోంది. దశాబ్దాలుగా ఆ ప్రాంతంలో ఆర్థిక, రాజకీయ దోపిడీ రాజ్యమేలుతోంది" అని హిమంత తన పోస్టులో పేర్కొన్నారు. పాకిస్థాన్ మొత్తం ఖనిజ సంపదలో 80 శాతానికి పైగా బలూచిస్థాన్‌లోనే ఉన్నప్పటికీ, అక్కడి ప్రభుత్వం ఆ ప్రాంత అభివృద్ధిని పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు. "ఆ ప్రాంతంలో భారీగా రాగి, బంగారు నిక్షేపాలు ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఇంకా వెలికితీయని సుమారు 5.9 బిలియన్ టన్నుల ఖనిజాలు, 41.5 మిలియన్ ఔన్సుల బంగారం, 35 మిలియన్ టన్నుల రాగి నిల్వలు బలూచిస్థాన్‌లో ఉన్నాయి" అని హిమంత వివరించారు. బలూచిస్థాన్‌లోని సుయ్ ప్రాంతంలో 1952లోనే గ్యాస్ నిక్షేపాలను కనుగొన్నారని, 2020 నాటికి పాకిస్థాన్ దేశానికి అవసరమైన సహజ వాయువులో దాదాపు 56 శాతం ఇక్కడి నుంచే సరఫరా అవుతోందని హిమంత బిశ్వ శర్మ గుర్తు చేశారు. గ్వాదర్ ఓడరేవు, 770 కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతం ఉన్నా, ఆ ప్రాంత ప్రజలకు కనీసం స్వచ్ఛమైన తాగునీరు, విద్యుత్, మౌలిక సదుపాయాలు కూడా అందడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ ఉద్యోగాల్లో కూడా బలూచిస్థాన్ ప్రావిన్స్ వాటా చాలా తక్కువగా ఉందని ముఖ్యమంత్రి హిమంత అన్నారు. అపారమైన వనరులున్న ప్రాంతంలో నివసిస్తున్నప్పటికీ, అక్కడి ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్నారని ఆయన తెలిపారు. "బలూచిస్థాన్‌లో వనరులకు కొరత లేదు. కానీ పాలకుల నిర్లక్ష్యం, రాజకీయ దోపిడీ విపరీతంగా ఉంది" అని హిమంత ఆరోపించారు.

### వంశీ, నాని కర్మ అనుభవిస్తున్నారు
## కోటంరెడ్డి సంచలన వ్యాఖ్యలు

అమరావతి,: మాజీ మంత్రులు వల్లభనేని వంశీ, కొడాలి నాని ప్రస్తుతం వారు చేసిన వ్యాఖ్యలకు మూల్యం చెల్లించుకుంటున్నారని, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డిని లిక్కర్ స్కామ్ లేదా ఇతర కేసుల్లో అరెస్ట్ చేస్తే ప్రజల నుంచి సానుభూతి వస్తుందనేది అవాస్తవమని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. వారిద్దరి విషయంలో తనకు ఎలాంటి సానుభూతి లేదని, దేవుడి స్క్రిప్ట్ ప్రకారం అంతా జరుగుతోందని ఆయన అన్నారు. జగన్ ప్రోత్సాహంతోనే ఆనాడు కొందరు నేతలు అనుచిత వ్యాఖ్యలు చేశారని, అలాంటి సంస్కృతి టీడీపీలో లేదని స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా పేరుపొందిన ధనుంజయ రెడ్డిని లిక్కర్ స్కామ్‌లో అరెస్ట్ చేసిన నేపథ్యంలో, తదుపరి అరెస్ట్ జగన్‌దేనని ప్రచారం జరుగుతోందని కోటంరెడ్డి ప్రస్తావించారు. ఒకవేళ జగన్‌ను అరెస్ట్ చేసినా, లేదా పాత అక్రమాస్తుల కేసులో బెయిల్ రద్దయినా ఆయనకు సానుభూతి వస్తుందని తాను అనుకోవడం లేదని తెలిపారు. "అత్యంత నిజాయితీపరుడిగా పేరుపొందిన అరవింద్ కేజ్రీవాల్‌ను మద్యం కుంభకోణం కేసులో జైల్లో పెట్టారు. జైలు నుంచి వచ్చాక ఎన్నికలు జరిగితే ఆమ్ ఆద్మీ పార్టీ అడ్రస్ లేకుండా పోయింది. 2014కు ముందు జగన్ జైల్లో ఉన్నా అధికారం రాలేదు కదా?" అని కోటంరెడ్డి గుర్తుచేశారు. కాబట్టి, కేసుల్లో జగన్ పాత్ర ఉందని విచారణ అధికారులు భావిస్తే చర్యలు తీసుకుంటారని, అరెస్టుల వల్ల వైసీపీకి సానుభూతి వస్తుందనడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. మాజీ మంత్రులు కొడాలి నాని, వల్లభనేని వంశీల ప్రస్తుత పరిస్థితిపై కోటంరెడ్డి ఘాటుగా స్పందించారు. "రెడ్ బుక్‌లో పేరుందనగానే కొడాలి నానికి గుండె నొప్పి వచ్చింది, బైపాస్ సర్జరీ చేయించుకున్నారు. ఇక, నారా భువనేశ్వరి గారిని ఉద్దేశించి వంశీ చేసిన దారుణమైన వ్యాఖ్యలకు ఇప్పుడు మూల్యం చెల్లించుకుంటున్నారు. ఆరోగ్యం పూర్తిగా దెబ్బతిని, 20 కేజీలు బరువు తగ్గి నరకం అనుభవిస్తున్నారు. అధికారం ఉందని సభ్యసమాజంలో ఎవరూ మాట్లాడలేని మాటల్ని శాసనసభలో మాట్లాడిన వారిపై నాకే కాదు, తెలుగు ప్రజలెవరికీ సానుభూతి ఉండదు. ఇది దేవుడి స్క్రిప్ట్. ధర్మాన్ని మరిచి ప్రవర్తిస్తే అది మన మెడకే చుట్టుకుంటుంది" అని కోటంరెడ్డి వ్యాఖ్యానించారు. ఇలాంటి వ్యాఖ్యల వల్ల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకే నష్టం జరిగిందని, పరోక్షంగా టీడీపీకి మంచి చేసిందని ఆయన అన్నారు. "నాలాంటి ఆవేశం ఎక్కువ ఉన్న వాడుంటే పరిస్థితి వేరేగా ఉండేది. చంద్రబాబు నాయుడు గారు పెద్ద మనిషి కాబట్టి, చట్టప్రకారం జరగాలని ఆలోచించారు కాబట్టి ఆలస్యమైంది" అని కోటంరెడ్డి తెలిపారు. వంశీ, నాని మాట్లాడిన మాటలు వాళ్లవి కావని, జగన్మోహన్ రెడ్డి మాట్లాడించిన మాటలని కోటంరెడ్డి ఆరోపించారు. "జగన్ గారు అలాంటి మాటలు మాట్లాడితేనే ప్రోత్సహిస్తారు, భుజం తడతారు. ప్రత్యర్థుల మీద, మీడియా మీద హద్దు మీరి మాట్లాడితే బాగా ప్రోత్సహిస్తారు. జోగి రమేష్ శాసనసభలో ఏబీఎన్ రాధాకృష్ణ గారి గురించి, రామోజీరావు గారి గురించి ఎలా మాట్లాడారో, చంద్రబాబు గారి ఇంటిపై దాడికి ఎలా యత్నించారో అందరికీ తెలుసు. అధినేత ఖండించకపోగా మంత్రి పదవి ఇచ్చారు. కాబట్టి ఇవన్నీ జగన్ గారి మాటలుగానే భావించాలి" అని శ్రీధర్ రెడ్డి అన్నారు. వైసీపీ కార్యాలయం నుంచి సజ్జల రామకృష్ణారెడ్డి ఇలా తిట్టమని స్క్రిప్ట్ పంపేవారని, తిట్టకపోతే పార్టీలో భవిష్యత్తు ఉండదని కొందరు నేతలు చెప్పినట్లు కోటంరెడ్డి వెల్లడించారు. "నువ్వు హుందాగా మాట్లాడితే కుదరదు, అడ్డగోలుగా మాట్లాడాలి, తిట్టాలి అని సజ్జల గారు నాతో అన్నారు. అమరావతి రైతులు వరదల్లో చిక్కుకుంటే మానవత్వంతో పరామర్శిస్తే, 'వాళ్లని పరామర్శించడం తప్పు, వాళ్ల మీద దాడి చేసి ఉంటే జగన్ గారు మెచ్చుకునేవారు' అని సజ్జల గారు స్వయంగా నాతో చెప్పారు" అని కోటంరెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. అమరావతి ప్రజలు పాదయాత్రగా వెళ్తుంటే సర్వేపల్లి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో దాడులు జరిగాయని, ఫ్లెక్సీలు చించేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం తాను టీడీపీ శాసనసభ్యుడినని, కష్టకాలంలో చంద్రబాబు, లోకేశ్ తనకు అండగా నిలిచి, టికెట్ ఇచ్చి ప్రోత్సహించారని కోటంరెడ్డి తెలిపారు. "ఈరోజు కూడా జగన్ గారి గురించి, వైసీపీ గురించి మాట్లాడాల్సిన పరిస్థితుల్లో మాట్లాడతాను. హుందా అయిన భాషతో, పద్ధతైన భాషతో, ప్రజల్ని ఒప్పించే, మెప్పించే భాషతో మాట్లాడతాను. బూతులు తిట్టడం నా వల్ల కాదు. టీడీపీలో అలా మాట్లాడమని చెప్పరు, మాట్లాడితే ఊరుకోరు. ఎవరైనా తప్పుగా మాట్లాడితే వెంటనే టీడీపీ స్టేట్ ఆఫీస్ నుంచి ఫోన్ వస్తుంది" అని కోటంరెడ్డి స్పష్టం చేశారు.

## జూన్ 21న విశాఖలో
## అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుక

మొదటి పేజి తరువాయి

5 లక్షల మంది ప్రత్యక్షంగా పాల్గొనడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో గ్రామ స్థాయి వరకూ జరిగే యోగా దినోత్సవ కార్యక్రమంలో కనీసం 2 కోట్ల మంది ప్రజలు భాగస్వాములు కావాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ పిలుపునిచ్చారు. వివిధ అంశాలపై సోమవారం రాష్ట్ర సచివాలయం నుండి ఆయన సంబంధిత శాఖల కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో గ్రామ స్థాయి వరకు నిర్వహించే యోగా దినోత్సవ వేడుకల్లో కనీసం 2 కోట్ల మంది భాగస్వాములయ్యేలా చూడాలని కలెక్టర్లను ఆయన ఆదేశించారు. దైనందిన జీవితంలో ఆరోగ్య పరిరక్షణకు యోగా ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహనను పెంపొందించేందుకు కృషి చేయాలని, ఈ విషయంలో జిల్లా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల నిర్వహణకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం సర్క్యులర్ ఆదేశాలు, జీవోలను జారీ చేయడం జరుగుతుందని సీఎస్ విజయానంద్ పేర్కొన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మరియు అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల నిర్వహణ రాష్ట్ర స్థాయి పర్యవేక్షణ నోడల్ అధికారి యం.టి కృష్ణబాబు ఏర్పాట్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని "Yoga for One Earth, One Health" అనే నినాదంతో యోగాపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ఈనెల 21 నుండి జూన్ 21 వరకూ నెల రోజులపాటు ప్రతి ఒక్కరూ యోగాను ఆచరించే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా యోగాంధ్ర పేరిట ఒక ప్రచార కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మూడు దశలుగా చేపట్టనున్నట్టు అనగా ఈనెల 21 నుండి 27 వరకూ ప్రాథమిక దశ కింద ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ శిక్షణ, 28 నుండి జూన్ 3 వరకూ మండల స్థాయిలో మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ, జూన్ 4 నుండి 16 వరకు గ్రామ, వార్డు స్థాయిల్లో శిక్షణ నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈనెల 21న అన్ని జిల్లాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సంబంధించి కనీసం 10 వేల మంది ప్రజాప్రతినిధులు, యోగా శిక్షకులు, పిఇటిలు, యోగా అభ్యాసకులు తదితరులతో కర్టెన్ రైజర్ ఈవెంట్‌ను నిర్వహించాలని సూచించారు. ఈ నెల 27న సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లతో సమావేశమై వారి భాగస్వామ్యంతో ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని చెప్పారు. జూన్ 21న రాష్ట్ర వ్యాప్తంగా 100 పర్యాటక మరియు ఆధ్యాత్మిక కేంద్రాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా, పీఆర్ అండ్ ఆర్డీ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్, ఐఅండ్ఐ శాఖ కార్యదర్శి డా.ఎన్. యువరాజ్, న్యాయ శాఖ కార్యదర్శి ప్రతిభా దేవి, ఐ అండ్ పీఆర్ డైరెక్టర్ హిమాన్షు శుక్ల పాల్గొన్నారు.

## ఇండియాలో పెరుగుతున్న కరోనా
## జేఎన్.1 కేసులు... వ్యాధి లక్షణాలు ఇవే!

ఢిల్లీ: దేశంలో కరోనా వైరస్ కేసులు మళ్లీ స్వల్పంగా పుంజుకోవడం ఆందోళన కలిగిస్తోంది. మే 19 నాటికి దేశవ్యాప్తంగా 257 యాక్టివ్ కొవిడ్ కేసులు నమోదైనట్లు అధికారిక గణాంకాలు తెలుపుతున్నాయి. ఈ పరిణామంతో అప్రమత్తమైన ఆరోగ్య శాఖ అధికారులు, వ్యాధి వ్యాప్తి తీరుతెన్నులపై నిశితంగా దృష్టి సారించారు. ఇప్పటికే హాంకాంగ్, సింగపూర్ వంటి దేశాల్లో కొవిడ్ కేసులు పెరుగుతుండటం గమనార్హం. ప్రస్తుతం మన దేశంలో కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల్లో కొవిడ్ కేసులు ఎక్కువగా వెలుగు చూస్తున్నాయి. అయితే, హాంకాంగ్, సింగపూర్‌లలో కొవిడ్ విజృంభణకు ఎల్ఎఫ్.7, ఎన్‌బీ.1.8 అనే కరోనా వేరియంట్లు కారణమని నిపుణులు తేల్చారు. ఈ రెండు వేరియంట్లు కూడా జేఎన్.1 అనే మరో కొత్త వేరియంట్ నుంచి ఉద్భవించినవే కావడం గమనార్హం.

జేఎన్.1 వేరియంట్ అంటే ఏమిటి?

ఒమిక్రాన్ బీఏ.2.86 వేరియంట్ నుంచి జేఎన్.1 వేరియంట్ పుట్టుకొచ్చింది. దీన్ని తొలిసారిగా 2023 ఆగస్టు నెలలో గుర్తించారు. గతంలో వచ్చిన వేరియంట్లతో పోలిస్తే, ఒకటి, రెండు అదనపు జన్యు ఉత్పరివర్తనాల (మ్యూటేషన్లు) కారణంగా ఈ వేరియంట్‌కు వేగంగా వ్యాపించే సామర్థ్యం ఎక్కువగా ఉందని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల, ఇది శరీరంలోని రోగనిరోధక శక్తిని సులభంగా ఛేదించి ఇన్‌ఫెక్షన్ కలుగజేస్తుంది. "బీఏ.2.86 వేరియంట్‌తో పోల్చినప్పుడు జేఎన్.1లో ఒక మ్యూటేషన్ అదనంగా ఉంది. ఈ మార్పు, వేరియంట్‌లోని స్పైక్ ప్రొటీన్‌లలో స్వల్ప మార్పులకు కారణమవుతుంది. ఫలితంగా ఇది రోగనిరోధక శక్తి కంచెను దాటుకుని ఇన్ఫెక్ట్ చేయగలుగుతోంది" అని యేల్ యూనివర్సిటీ పరిశోధకులు వివరించారు.

### జేఎన్.1 వేరియంట్ సోకిన వారికి ఉండే లక్షణాలు:

జేఎన్.1 వేరియంట్ సోకిన వారిలో సాధారణంగా పొడి దగ్గు, రుచి కోల్పోవడం, తలనొప్పి, ముక్కు దిబ్బడ, తీవ్రమైన అలసట, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అంతేకాకుండా, ఈ వేరియంట్ బారిన పడిన కొందరిలో డయేరియా (విరేచనాలు) కూడా ఎక్కువగా కనిపిస్తోందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. అయితే, ప్రస్తుతం భారత్‌లో పరిస్థితి నిలకడగానే ఉందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. నిన్న డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్ఎస్) నేతృత్వంలో కొవిడ్ పరిస్థితిని సమీక్షించేందుకు ఉన్నతస్థాయి అత్యవసర సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వెల్లడైన వివరాల ప్రకారం, నమోదవుతున్న కేసుల్లో వ్యాధి లక్షణాలు చాలా వరకు ఓ మోస్తరుగానే ఉన్నాయని, బాధితులు ఆసుపత్రిలో చేరాల్సినంత తీవ్రత లేదని విశ్వసనీయ వర్గాలు తెలియజేశాయి. అయినప్పటికీ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కొవిడ్ నిబంధనలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

## కేసీఆర్, హరీశ్ రావు, ఈటల రాజేందర్‌కు నోటీసులు!

మొదటి పేజి తరువాయి

కేసీఆర్ జూన్ 5వ తేదీన విచారణకు హాజరు కావాలని కమిషన్ తన నోటీసులో స్పష్టం చేసింది. అలాగే, కేసీఆర్ ప్రభుత్వంలో నీటిపారుదల శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన హరీశ్ రావు జూన్ 6వ తేదీన, ఆర్థిక మంత్రిగా పనిచేసిన ఈటల రాజేందర్ జూన్ 9వ తేదీన విచారణకు హాజరు కావాలని కమిషన్ పేర్కొంది. మేడిగడ్డ బ్యారేజీ కుంగిన నేపథ్యంలో, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై కూడా విచారణ జరిపేందుకు తెలంగాణ ప్రభుత్వం న్యాయ విచారణ కమిషన్‌ను నియమించిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో 2024 మార్చిలో ఏర్పాటైన ఈ కమిషన్ నిర్మాణం, నిర్వహణ, డిజైన్, క్వాలిటీ కంట్రోల్, పే అండ్ ఎకౌంట్స్, నీటి పారుదల, ఆర్థిక శాఖల ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులను విచారిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు అవసరానికి తగిన విధంగా కమిషన్ గడువును ఏడుమార్లు పొడిగించింది.

## పేర్లు రాసిపెట్టుకోండి... సినిమా చూపిస్తాం

మొదటి పేజి తరువాయి

వైసీపీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ హెచ్చరికలు జారీ చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం రాక్షస ప్రభుత్వం నడుస్తోందని జగన్ ఆరోపించారు. "కలియుగంలో రాజకీయాలు చేయాలంటే భయం ఉండకూడదు. కేసులకు, జైళ్లకు బెదిరిపోకూడదు. అలా అయితేనే రాజకీయాలు చేయగలం. చంద్రబాబు చేస్తున్న రాజకీయాలు ఆ విధంగానే ఉన్నాయి" అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యాన్ని పట్టపగలే ఖూనీ చేస్తున్నారని, ముఖ్యంగా స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో ఇది స్పష్టంగా కనిపిస్తోందని దుయ్యబట్టారు. తిరువూరు వంటి ప్రాంతాల్లో వైసీపీకి సంఖ్యాబలం ఉన్నప్పటికీ, టీడీపీ పోటీకి దిగడం, వైసీపీ ఆధిక్యం ఉంటే ఎన్నికలను నిలిపివేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పోలీసులు కూడా ఏకపక్షంగా వ్యవహరిస్తూ వైసీపీ వారిని అరెస్టులు చేస్తూ, టీడీపీ వారిని వదిలేస్తున్నారని విమర్శించారు. "మీరు ఏ పుస్తకంలోనైనా పేర్లు రాసుకోండి. అన్యాయం చేయాలనుకుంటే చేయమనండి, కొడతానంటే కొట్టమనండి. కానీ, మాకూ సమయం వస్తుంది. అప్పుడు అన్యాయాలు చేసిన ప్రతి ఒక్కరికీ సినిమా చూపిస్తాం. రిటైర్ అయిన వారిని కూడా లాక్కొచ్చి తీరుతాం. దేశం విడిచి పారిపోయినా రప్పిస్తాం" అని జగన్ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. చంద్రబాబు నాటిన విత్తనాలే ప్రస్తుత పరిస్థితులకు కారణమని, మహిళలని కూడా చూడకుండా నెలల తరబడి జైళ్లలో పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక కేసులో బెయిల్ వస్తే, వెంటనే మరో కేసు నమోదు చేస్తున్నారని, వల్లభనేని వంశీ విషయంలోనూ ఇలాగే వ్యవహరించారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. దళితుడైన నందిగం సురేష్‌ను కూడా అన్యాయంగా నెలన్నరకు పైగా జైల్లో ఉంచి, బయటకు వచ్చిన తర్వాత మళ్లీ కేసు పెట్టి జైలుకు పంపారని మండిపడ్డారు. రేపు కచ్చితంగా వైసీపీ కార్యకర్తే నంబర్ వన్ అవుతాడని, కార్యకర్తలకు అండగా నిలబడతామని ఆయన భరోసా ఇచ్చారు. అన్యాయాలకు పాల్పడిన వారికి తగిన శాస్తి తప్పదని పునరుద్ఘాటించారు.

## పోలీసులు విఫలమైతే నేనే రంగంలోకి దిగుతా: కేఏ పాల్



**అమరావతి,:** ఆంధ్రప్రదేశ్‌లో శాంతిభద్రతల పరిస్థితి దిగజారిందంటూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ తీవ్రఆందోళనవ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను తక్షణమే పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును హెచ్చరిస్తున్నానని తెలిపారు. ఈ మేరకు ఆయన తాజాగా ఓ వీడియో విడుదల చేశారు. తిరుపతిలో జేమ్స్ అనే బీటెక్ విద్యార్థిని కిడ్నాప్ చేసి, చిత్రహింసలకు గురిచేసి, చనిపోయాడనుకుని వదిలేశారని కేఏ పాల్ తన ప్రకటనలో ఆరోపించారు. రాష్ట్రంలో అన్యాయం, అక్రమ రవాణా, హింసాత్మక ఘటనలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని అన్నారు. "చంద్రబాబు గారూ... ధ్రప్రదేశ్‌లో ఏం జరుగుతోంది? మీ 50 సంవత్సరాల అనుభవం ఏమైంది?" అని ప్రశ్నించారు. పోలీసులు తమ విధులను సరిగా నిర్వర్తించడంలో విఫలమైతే, తానే స్వయంగా రంగంలోకి దిగుతానని కేఏ పాల్ స్పష్టం చేశారు. "పాస్టర్ ప్రవీణ్ ది హత్య అని చెబితే, యాక్సిడెంట్ అని పనికిమాలిన పోలీసులు సృష్టించారని కోట్లమంది కోడై కూశారు. మీరు అందులో ఫెయిలైపోయారు. పవన్ కల్యాణ్ నియోజకవర్గంలో దళితుడ్ని బహిష్కరిస్తే మీరు అందులో చర్యలు తీసుకోలేదు. ఇప్పుడు జేమ్స్ వ్యవహారం! అంటే రోజుకొక అన్యాయం, అత్యాచారం జరుగుతున్నాయి" అంటూ కేఏ పాల్ ధ్వజమెత్తారు. ప్రజలందరూ మే 24న సికింద్రాబాద్ లో జరగనున్న గ్లోబల్ పీస్ అసెంబ్లీలో పాల్గొనాలని కూడా ఆయన పిలుపునిచ్చారు. "జేమ్స్‌కు న్యాయం జరగాలి" అనే హ్యాష్‌ట్యాగ్‌తో ఆయన తన ఆవేదనను వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై తక్షణమే దృష్టి సారించి, ప్రజలకు భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఏపీ సీఎం చంద్రబాబు కీలక ప్రకటన ..

మొదటి పేజి తరువాయి



ఒకేసారి ముందుగానే లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తామని సీఎం అన్నారు. లబ్ధిదారులు తమకు కావలసినప్పుడు దీపం పథకం కింద సిలిండర్ పొందవచ్చు, అయితే వారికి మూడు సిలిండర్లకు ఇచ్చే మొత్తాన్ని ప్రభుత్వం ముందుగానే చెల్లిస్తుందన్నారు. రేషన్ సరుకుల పంపిణీపై అభిప్రాయాలు పరిశీలిస్తే, "మీరు ఈ నెల రేషన్ సరుకులు తీసుకున్నారా?" అని ప్రశ్నించగా 74 శాతం మంది అవునని, వాటి నాణ్యత ఎలా ఉంది అంటే బాగుందని 76 శాతం మంది చెప్పారన్నారు. రేషన్ పంపిణీలో, నాణ్యతపై ప్రజల సంతృప్తిలో పశ్చిమ గోదావరి జిల్లా ప్రథమ స్థానంలో ఉందని చెప్పారు. అదే విధంగా గ్యాస్ డెలివరీ సమయంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారా అనే అంశంలో 62 శాతం మంది లేదని, పలు చోట్ల ఈ విషయంలో సమస్య ఉందని చెప్పారన్నారు. ఆర్టీసీ సేవల విషయంలో ప్రయాణికుల నుంచి ఆశించిన స్థాయిలో సంతృప్తి వ్యక్తం కాలేదని, ఈ విషయంలో అధికారులు మరింత ప్రభావవంతంగా పనిచేయాలని సీఎం ఆదేశించారు. బస్టాండ్‌లో తాగునీటి సౌకర్యం, టాయిలెట్ల నిర్వహణ విషయంలో ప్రయాణికుల నుంచి అసంతృప్తి వస్తోందని దీన్ని సరిచేసుకోవాలని సీఎం సూచించారు. తాగునీటిపై 44 శాతం, టాయిలెట్లపై 55 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేశారన్నారు . ఇక పంచాయతీ సేవల విషయానికి వచ్చేసరికి, ఇంటి నుంచి చెత్త సేకరణ జరుగుతుందా అనే ప్రశ్నకు 60 శాతం మంది అవుననే చెప్పారని, గతంతో పోల్చుకుంటే గ్రామీణ ప్రాంతాల్లో చెత్త సేకరణ మెరుగైందని సీఎం అన్నారు. రానున్న రోజుల్లో డ్వాక్రా మహిళలకు తడిచెత్త నిర్వహణ బాధ్యత అప్పగించి, కంపోస్ట్ తయారీ చేపడతామని సీఎం తెలిపారు. ప్రభుత్వ సేవల్లో డాటా అనలిటిక్స్ కీలకమని సీఎం అన్నారు. డాటా ఆధారంగా ఆయా ప్రభుత్వ శాఖలు తమ పనితీరును క్షేత్ర స్థాయి నుంచి పరిశీలించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫీడ్‌బ్యాక్‌ను సమర్థవంతంగా విశ్లేషిస్తే ప్రభుత్వ సేవల్లో అనూహ్య మార్పులు తేవచ్చన్నారు. ఒక ప్రభుత్వ పథకం లేదా కార్యక్రమంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తం అవుతున్న సందర్భంలో వాటికి కారణాలను తెలుసుకుని దానికి అనుగుణంగా అధికారులు, ఉద్యోగులు పనిచేయాలన్నారు. ప్రతి శాఖలో ఉన్నతాధికారులు ఆయా శాఖలపై వచ్చే డాటాపై అనలిటిక్స్ ద్వారా సేవలను మెరుగుపరచాలని సీఎం సూచించారు. ఇదంతా బాగానే ఉన్నా జూన్ 12 నుంచి ఆకస్మిక తనిఖీలు చేయనున్నట్లు సీఎం ప్రకటించడంతో అధికారుల గుండెల్లో ఇప్పటి నుంచే గుబులు రేగుతోందని అంటున్నారు. ముఖ్యమంత్రి ఆకస్మిక పర్యటనలకు వచ్చిన సమయంలో ప్రజలు నేరుగా అధికారులపై ఫిర్యాదు చేసే అవకాశాలు ఉండటంతో వారిలో భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి.

# 5 లక్షల మందికి 'యువవికాసం'

మొదటి పేజి తరువాయి

క్షేత్రస్థాయి పరిశీలన.. ఈ పథకానికి రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 16.20 లక్షల దరఖాస్తులొచ్చాయి. లక్ష్యం మేరకు ఇందులో దాదాపు 5 లక్షల మంది యువతకు గరిష్ఠంగా రూ.4 లక్షల విలువైన యూనిట్లు మంజూరు చేయనున్నారు. యూనిట్ కేటగిరీలవారీగా వచ్చిన దరఖాస్తులను ప్రభుత్వం అంచనా వేసింది. రూ.లక్ష లోపు రుణాల కోసం నిర్దేశించిన లక్ష్యం కన్నా దరఖాస్తులు తక్కువగా, రూ.1-2 లక్షలు, రూ.2-4 లక్షల యూనిట్ల కేటగిరీ రుణాలకు భారీగా దరఖాస్తులు వచ్చినట్లు గుర్తించింది. ఉదాహరణకు ఎస్సీ కార్పొరేషన్ కింద రూ.2-4 లక్షల విలువైన యూనిట్లు 20 వేలు మంజూరు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంటే.. దాదాపు 3.24 లక్షల మంది పోటీపడుతున్నారు. అలాగే బీసీ కార్పొరేషన్ కింద 22 వేల యూనిట్ల కోసం 6.66 లక్షల మంది, ఈబీసీల్లో 8 వేల యూనిట్ల కోసం 32 వేల మంది దరఖాస్తు చేశారు. ఈ నేపథ్యంలో దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు క్షేత్రస్థాయి కమిటీలు పనిచేస్తున్నాయి.




అనర్హులకు అడ్డుకట్ట..

దరఖాస్తుదారుల్లో అనర్హులను తొలగించడానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నారు. ఒకసారి సంక్షేమ కార్పొరేషన్ పరిధిలో లబ్ధి పొందినవారు ఐదేళ్లపాటు మరోసారి రుణం పొందేందుకు అనర్హులవుతారు. సంక్షేమ కార్పొరేషన్ల వద్ద ఉన్న డేటాబేస్‌తో దరఖాస్తులను పరిశీలించి అనర్హులను తొలగిస్తున్నారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతా వివరాలను ఆధార్ డేటాబేస్‌తో పరిశీలించి, సరైన ఖాతాలు ఇచ్చారా.. లేదా.. పరిశీలిస్తున్నారు. మండలాలు, జిల్లాలు, మున్సిపాలిటీలు, నగరపాలికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీల జనాభా ఆధారంగా యూనిట్ల ఖరారుకు ప్రణాళిక సిద్ధం చేశారు. కుటుంబానికి ఒక్కరికే స్వయంఉపాధి పథకం మంజూరు చేయాలని ఇప్పటికే ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.

# రోహింగ్యాల వలసలతో పెను ముప్పు

మొదటి పేజి తరువాయి

పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. మయన్మార్‌కు చెందిన ఈ రోహింగ్యాల వలసల వల్ల స్థానిక యువత తీవ్రంగా నష్టపోతోందని, వారికి దక్కాల్సిన ఉద్యోగావకాశాలు చేజారిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. "తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో స్థానికులకే ఉద్యోగాలు దక్కాలన్నది ఎప్పటినుంచో ఉన్న ప్రధాన డిమాండ్. తెలంగాణ ఉద్యమంలోనూ ఇది కీలక నినాదం. కానీ, దేశ సరిహద్దులు దాటి వచ్చిన రోహింగ్యాలు ఇక్కడే తిష్టవేసి, మన యువత ఉపాధిని దెబ్బతీస్తున్నారు" అని పవన్ పేర్కొన్నారు. వారికి మన దేశంలో స్థిరపడేందుకు అవసరమైన గుర్తింపు కార్డులు ఎలా లభిస్తున్నాయన్న దానిపై ఆయన తీవ్ర సందేహాలు వ్యక్తం చేశారు. "మన వ్యవస్థలోని కొందరు వ్యక్తులు వారికి సహకరించడం వల్లే ఇది సాధ్యమవుతోంది. దీనిపై లోతైన విచారణ జరగాలి. రోహింగ్యాలు మన పౌరులుగా మారి, మన అవకాశాలను ఎలా కొల్లగొడుతున్నారనే దానిపై ప్రజల్లో చైతన్యం రావాలి," అని ఆయన అన్నారు. ఈ వలసల వల్ల కేవలం నిరుద్యోగమే కాకుండా, అంతర్గత భద్రతకు కూడా ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రోహింగ్యాలు స్థానికులుగా మారడానికి సహకరిస్తున్న యంత్రాంగంపై కఠిన నిఘా ఉంచాలని, అంతర్గత భద్రత విషయంలో మరిన్ని పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ, ఒక రాజకీయ పార్టీ అధ్యక్షుడిగా తాను పోలీసు ఉన్నతాధికారులకు లేఖ కూడా రాసినట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. ఈ సమస్య తీవ్రతను గుర్తించి, తక్షణమే చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.

### వాళ్ల కంటే మిన్నగా పోలీసులు
### అప్రమత్తంగా ఉండాలి: పవన్ కల్యాణ్




దేశ సరిహద్దుల్లో సైనికులు ఎంతటి అప్రమత్తతతో విధులు నిర్వర్తిస్తారో, రాష్ట్రంలో అంతర్గత భద్రత విషయంలో పోలీసులు కూడా అంతే జాగరూకతతో వ్యవహరించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. దక్షిణాది రాష్ట్రాలు ఉగ్రవాదులకు సున్నితమైన లక్ష్యంగా మారాయని, ఈ నేపథ్యంలో రాష్ట్ర పోలీసు యంత్రాంగాన్ని, పరిపాలన సిబ్బందిని అప్రమత్తం చేస్తూ తాను లేఖ రాసినట్లు ఆయన తెలిపారు. గన్నవరం విమానాశ్రయంలో జాతీయ మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గతంలో కోయంబత్తూరు, హైదరాబాద్‌లలో జరిగిన ఉగ్రవాద దాడులను ప్రస్తావిస్తూ, ఆ సంఘటనలు తలచుకుంటే ఇప్పటికీ గుండె తరుక్కుపోతుందని పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. "రాష్ట్రంలో ఉగ్రవాదుల జాడలు కనిపించిన నేపథ్యంలో రాష్ట్ర పోలీసు యంత్రాంగం మరింత అప్రమత్తంగా ఉండాలని డీజీపీ గారిని లేఖ ద్వారా కోరాను. పాలనా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని ఉగ్రవాద జాడలున్న వారి విషయంలో కఠినంగా వ్యవహరించాలని సూచించాను" అని పవన్ వివరించారు. ముఖ్యంగా వలస వచ్చే వారి విషయంలో సరైన నిఘా ఉంచడం ద్వారా సంభవించబోయే ప్రమాదాలను నివారించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. అదేవిధంగా, తీర ప్రాంతంలో కూడా నిరంతర పర్యవేక్షణ, నిఘాను పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని ఉప ముఖ్యమంత్రి నొక్కిచెప్పారు. "గతంలో కాకినాడలో బయట వ్యక్తులు బోట్లలో వచ్చినట్లు కొన్ని వార్తలు వచ్చాయి. తీరంలో కొత్త వ్యక్తుల కదలికలు, వారి కార్యకలాపాలను నిశితంగా గమనించాలి. పోలీసులు అజాగ్రత్తగా ఉండకుండా అంతర్గత భద్రత విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి" అని ఆయన హితవు పలికారు. ఇటీవల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో రాష్ట్రంలో కొన్ని ఉగ్రవాద జాడలు కనిపించినట్లు తెలిసిందని, ఈ పరిణామాల దృష్ట్యా నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని పవన్ కల్యాణ్ సూచించారు. అంతర్గత భద్రత విషయంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించవద్దని పోలీసులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

సాయి సూర్య
తెలుగు దిన పత్రిక www.saisuryaa.com


## వ్యవసాయ పంటలపై రైతులకు అవగాహన సదస్సు




యాచారం సూర్య న్యూస్( మే 20): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు రంగారెడ్డి జిల్లా, యాచారం మండలం, మాల్, రైతు వేదికలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం ఈ కార్యక్రమంలో భాగంగా... వైస్ ఛాన్సర్ డాక్టర్ అల్దాస్, జానయ్య, ఏ ఆర్ ఐ డైరెక్టర్ శ్రీనివాస్, జీవ నియంత్రణ శాస్త్రవేత్త, సునీత, వ్యవసాయ సంచాలకులు సుజాత, చైర్మన్ రాజేందర్ రెడ్డి, ఏవో రవినాథ్ మాట్లాడుతూ.. యూరియా ఎరువులు వాడకం, వాటి ప్రయోజనాలు గురించి చర్చించారు. అలాగే పురుగు మందులపై వినియోగంపై అవగాహన కల్పించారు. విత్తనాలు, పురుగుమందుల కొనుగోలు విషయంలో తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని రైతులకు వివరించారు. నీటి ప్రాముఖ్యత, నీటి వినియోగ సామర్థ్యత వరి పంటలలో పంట వైవిద్ధీకరణ అవసరమని తెలియజేశారు. రైతులందరూ కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఫోన్ తో మీ సేవలో గాని దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రైతులు పంటను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ గులాం అక్బర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## 1993-1994 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


### నందిగామలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నందిగామ సూర్య న్యూస్ మే 20: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గ పరిధిలోని నందిగామ మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ హై స్కూల్ లో విద్యను అభ్యసించిన 1993-1994 సంవత్సర విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆనాడు విద్యార్థులకు బోధించిన ఉపాధ్యాయులు నరసింహారెడ్డి గుర్రం రవీందర్ రెడ్డి ప్రహ్లాద రావు తో పాటు పూర్వ విద్యార్థులు వారిని కలుసుకొని సన్మానించారు. ఆనందమానందమాయే మది ఆశలనందమాయే అంటూ పూర్వ విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో వచ్చి ఉపాధ్యాయులను సన్మానించి సత్కరించారు. తమ ఉన్నతికి గురువులు కారణమని వారికి పాద పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మఫ్సుందర్ అలియాస్ చందు రిపోర్టర్ తదితరులు కుటుంబ సమేతంగా పాల్గొని పూర్వ విద్యార్థులతో ఆటపాటలతో అలరించారు..

## అక్రమంగా తరలిస్తున్న కోడెదూడలను పట్టుకుని గోశాలకు తరలింపు

### చింతపల్లి ఎస్సై ముత్యాల రామ్మూర్తి.



చింతపల్లి, సూర్య టుడే న్యూస్ ప్రతినిధి మే 20: 20 వ తేదీ మంగళవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో చింతపల్లి మండలం మాల్ చెక్ పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా నాగర్ కర్నూలు జిల్లా అమ్రాబాదు నుంచి వస్తున్న ఏపీ10 డబ్ల్యు 7261, టీఎస్31 టి ఏ3197 నంబర్లు గల రెండు అశోక్ లేలాండ్ గూడ్స్ క్యారియర్ వాహనాలలో 9 కోడెదూడలను అక్రమంగా హైదరాబాద్ తరలిస్తుండగా పక్కా సమాచారంతో మాల్ రిజర్వాయర్ చెక్ పోస్ట్ వద్ద చింతపల్లి ఎస్సై రామ్మూర్తి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, పశు వైద్యాధికారి డాక్టర్ భాను నాయక్ పట్టుబడి చేశారు. రహదారి కొనుగోలు అనుమతులు లేకుండా కిక్కిరిసి కట్టేసి ఆహారం, తాగునీరు సౌకర్యం లేకుండా నిబంధనలకు విరుద్ధంగా పశువులను తరలిస్తుండడంతో పట్టుకున్నారు. కోడెదూడలను నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ గురునానక్ గోశాలకు తరలించి, డ్రైవర్లు, పశువుల యజమానులపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని సబ్ ఇన్స్పెక్టర్ ముత్యాల రామ్మూర్తి తెలిపారు.

## ప్రతి నిరుపేద కుటుంబానికి రాజీవ్ యువ వికాస్ పథకం



ఇబ్రహీంపట్నం, సూర్య టుడే న్యూస్ ప్రతినిధి మే 20: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిసహకారంతో ప్రతి నిరుపేద కుటుంబానికి రాజీవ్ యువ వికాస్ పథకం అందే విధంగా కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంకాల శేఖర్ రెడ్డి అన్నారు. అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 2న రాజీవ్ యువ వికాస్ పథకం లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందించాలని ప్రభుత్వం భావిస్తుందని అన్నారు. లబ్ధిదారులను అవతరణ ఉత్సవాలకు పిలిచి మంజూరు పత్రాలు అందజేస్తారు. ఆ లోపు దరఖాస్తు పరిశీలన చేసి, వచ్చిన దరఖాస్తులు మండల, జిల్లా స్థాయిలో ఎంపిక చేసి కలెక్టర్, డి ఆర్ డి ఏ పి.డి, బిసి కార్పొరేషన్ ఈడీ, మైనార్టీ కార్పొరేషన్, ఎస్సీ కార్పొరేషన్, గిరిజన సంక్షేమ శాఖ, శిశు సంక్షేమ శాఖ, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఉంటారని అన్నారు. జిల్లా ఇన్చార్జి మంత్రి అనుమతితో జిల్లా స్థాయి కమిటీ ఖరారు చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

## చింతపల్లి ఎంపీడీవో కార్యాలయంలో జడ్పీ డిప్యూటీ ఇంచార్జ్ సీఈవో ఆకస్మిక తనిఖీ



చింతపల్లి, సూర్య టుడే న్యూస్ ప్రతినిధి మే 20: చింతపల్లి ఎంపీడీవో కార్యాలయాన్ని మంగళవారం జడ్పీ ఇంచార్జ్ సీఈవో బాల్దూరి శ్రీనివాసరావు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. కార్యాలయంలో స్టిబంది హాజరుపట్టిక, విధుల్లో ఉన్న ఉద్యోగుల వివరాలపై ఆరాతీసి రికార్డులు తనిఖీచేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీడీవో తోపాటు సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటున్నారా, ప్రభుత్వ సంక్షేమ ఫలాలు సక్రమంగా ప్రజలకు చేరడంపై ఎంపీడీవో తనిఖీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చౌలపల్లి లోఇందిరమ్మ ఇండ్లు కు అధికారుల పలు సూచనలు.

### ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో ముఖాముఖి..



షాద్ నగర్ సూర్య టుడే ప్రతినిధి (మే 20): కేశంపేట్ మండలం పరిధిలోని చౌలపల్లి గ్రామంలో మంగళవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కిష్టయ్య చౌలపల్లి గ్రామపంచాయతీ సందర్శించి, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో ముఖాముఖి సమావేశం ఏర్పాటు చేసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం మరియు స్థలము విస్తీర్ణం మరియు (గ్రౌండింగ్) వారికి వచ్చే డబ్బులు విషయాలపై సూచనలు చేసి నాణ్యత మైన నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు శ్రీ వెంకటేష్ పంచాయతీ కార్యదర్శి మరియు గ్రామమాజీ సర్పం చ్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గూడ వీరేశం, గ్రామస్తులు పాల్గొనడం జరిగింది.



# 16 వ సామాజిక తనిఖీ రసభస

-పబ్లిక్ ఇయర్ రింగ్ ఓపెన్ గా పెట్టాలి

-ఐకెపి కార్యాలయంలో సమావేశం పెట్టడం ఏంటి?

-పిడి శ్రీలతను నిలదీత

-సమావేశం ముందర వ్యాకాస నిరసన




-పెండింగులో ఉపాధి బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్

యాచారం సూర్య న్యూస్( మే 20):. మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం 16వ విడత సామాజిక తనిఖీ సమావేశాన్ని ఐకెపి కార్యాలయంలో ఏర్పాటు చేశారు. మంగళవారం అనంతరం సమావేశానంతరం.. సోషల్ ఆడిట్ గ్రామాల వారిగా రిపోర్ట్ చేస్తుండగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పెరుమండ్ల అంజయ్య, జంగయ్య, సత్తనారి, ఇందిరమ్మ సమావేశ ముందర నిరసన వ్యక్తం చేశారు. సామాజిక తనిఖీ పబ్లిక్ రిపోర్ట్ ఓపెన్ గా పెట్టాలని వారు డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు డబ్బులు ఇవ్వకుండా సోషల్ ఆడిట్ ఎలా చేస్తారని, ఈజీఎస్ అధికారులు ఏపీవో లింగయ్య, ఈసీ శివశంకర్, ను నిలదీశారు. పిడి శ్రీలతతో కొంతసేపు వ్యవసాయ కార్మిక సంఘం నాయకుల మధ్య వాగ్వాదం



చోటుచేసుకుంది. అంతలోని యాచారం ఎస్సైలు ఉయ్యాల మధు, సత్యనారాయణ, జోక్యం చేసుకొని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులతో మాట్లాడి, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరగా, సమావేశం కొనసాగింది.

తూ తూ మంత్రంగా సోషల్ ఆడిట్

ఉపాధి హామీ కూలీలకు గత రెండు నెలలుగా పని చేసిన బిల్లులు చెల్లించకపోవడం తప్పు పట్టారు.పీడీ శ్రీలత మాట్లాడుతూ... రంగారెడ్డి జిల్లాలో ఉపాధి హామీ కూలీలకు పదిహేను రోజులు మాత్రమే బిల్లులు.. పెండింగ్ లో ఉన్నాయని సమావేశంలో తెలిపారు. అవి ఏవైనా ఉంటే ఆధార్ కార్డు, మాస్టర్ ప్రాబ్లం సమస్యలు ఉన్నాయని తెలియజేశారు. కూలీలకు స్లిప్పులు ఇవ్వాలని, మెడికల్ కిట్టు అందుబాటులో ఉంచాలని, నీళ్ల ఇవ్వకపోవడం ఈజీఎస్ అధికారులను ఆమె హెచ్చరించారు. పని ప్రదేశంలో సూచించారు. 2025 సంవత్సరం ఉపాదాని కూలీలకు, సరిగ్గా పని కల్పించలేదని చర్చ కొనసాగింది. అధికారుల నిర్లక్ష్యం వల్లే కూలీలు నష్టపోయారని గుర్తు చేశారు. ఒక గ్రూపుకు, ఇంకో వారం ఇంకో గ్రూపుకు పనిని కల్పించడం కరువులో కూలీలు తీవ్రంగా ఆర్థికంగా ఇబ్బందులు పడ్డారని గుర్తించారు. ఇప్పటికైనా సక్రమంగా పనిని కల్పించాలని ఈజీఎస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శైలజ, ఎంపీఓ శ్రీలత, ఏపీవో లింగయ్య, స్పెషలాఫీసర్, అధికారులు, సెక్రటరీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ హనుమాన్ జయంతి, బక్రీద్,పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి

### షాద్ నగర్ ఎసిపి రంగస్వామి

### శాంతి సమావేశం నిర్వహించిన పోలీసులు




షాద్ నగర్ సూర్య టుడే ప్రతినిధి (మే 20): శ్రీ హనుమాన్ జయంతి బక్రీద్ పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలని షాద్ నగర్ పోలీస్ ఏసిపి రంగస్వామి సూచించారు. మంగళవారం షాద్ నగర్ ఏసీపి కార్యాలయంలో హిందూ,ముస్లిం నాయకుల శాంతి సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపి రంగస్వామి మాట్లాడుతూ రానున్న , శ్రీ హనుమాన్ జయంతి, బక్రీద్ పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచించారు. వివిధ పార్టీల నాయకులు మత పెద్దలు పోలీసు అధికారులకు సహకరించాలని వారు కోరారు. బక్రీద్ హనుమాన్ జయంతి వేడుకలు ఒకేసారి రావడంతో వివిధ మతాల పెద్దలకు నాయకులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో షాద్ నగర్ సీఐ విజయ్ కుమార్, కేశంపేట సీఐ నరహరి,షాద్ నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్ , సయ్యద్ ఇబ్రహీం, చెట్ల వెంకటేష్, జమ్రుత్ ఖాన్, ఇబ్రహీం, రామక్రిష్ణ, గౌస్, అమేర్ , అసద్, అశ్రాఫ్ హుస్సేన్ , అజార్, ఫైజాన్, రహీం, ఎబివిపి భాను, వివిధ పార్టీల నాయకులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.




## నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యల తప్పవు

### చింతపల్లి వ్యవసాయ అధికారి పోలిశెట్టి శ్రావణ కుమారి.



చింతపల్లి, సూర్య టుడే న్యూస్ ప్రతినిధి మే 20: నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించి రైతులను మోసం చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, ఎరువుల విత్తనాల వ్యాపారులు రాష్ట్ర వ్యవసాయ శాఖ నిబంధనలకు లోబడి విక్రయాలు చేపట్టాలని చింతపల్లి మండల వ్యవసాయ అధికారి పోలిశెట్టి శ్రావణ కుమారి అన్నారు. కృత్రిమ కొరత సృష్టించొద్దని, నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించి రైతులను మోసం చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, ఎరువుల విత్తనాల వ్యాపారులు రాష్ట్ర వ్యవసాయ శాఖ నిబంధనలకు లోబడి విక్రయాలు చేపట్టాలని విత్తనాలు అధిక ధరలకు విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గ్రామాలలో అధికారులు ఎరువులు, విత్తనాల దుకాణాలను విస్తృతంగా తనిఖీ చేసి, రైతులకు పంటలపై అవగాహన కల్పించాలన్నారు.ఈ సందర్భంగా దుకాణదారులు రైతులకు ఎరువులు, విత్తనాలు విక్రయించిన వెంటనే బిల్లులు,రసీదులు ఇస్తున్నారా? లేదా? స్టాక్ రిజిస్టర్‌లు మొయింటెన్ చేస్తున్నారా? విత్తనాలు, ఎరువులు ఎక్కడి నుంచి దిగుమతి చేసుకుంటున్నారనే విషయాలపై ఆరా తీశారు. ఎరువుల కోసం రైతులు ఇబ్బంది పడకుండా ప్రతీరోజు స్టాక్ చూసి ఎరువులు తెప్పించుకోవాలని వ్యవసాయ అధికారి సూచించారు.

## ఘనంగా బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గోపి శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకలు..




అనంతపురం: భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు రంగుల గోపి శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ జన్మదిన వేడుకలను రజక కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజినేయులు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గోపి శ్రీనివాస్ అన్న బిజెపి కార్యకర్తలకు అండగా నిలుస్తూ బీసీ సమాజం కొరకు అనేక బలమైన కార్యక్రమాలు క్రియాశీలకంగా విజయవంతమైన నాయకత్వంలో గోపి శ్రీనివాస్ ఉండడం చాలా సంతోషమన్నారు. ఇలాంటి పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటూ భారతీయ జనతా పార్టీలో ఉన్నతమైన శిఖరాలకు ఎదగాలని కోరుకుంటూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు నాగేంద్రబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి శివ సంజీవ, జిల్లా గ్రంథాలయ కన్వీనర్ గంగాధర్ యాదవ్, జిల్లా వివర్స్ సెల్ కన్వీనర్ నారాయణస్వామి, బిజెపి పట్టణ అధ్యక్షులు కృష్ణమోహన్, బిజెపి రూరల్ అధ్యక్షులు శేష నంద రెడ్డి, జిల్లా ప్రోగ్రాం కన్వీనర్ రంగనాయకులు, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు నాగరాజు, ఎన్ టి డి ఎన్ జిల్లా కన్వీనర్ వీరభద్ర, బిజెపి నాయకులు రాధాకృష్ణ మధు, బాబు, అరుణ్ కుమార్, హనుమంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై స్పందించనిది ఆర్టీసీ అధికారులపై కలెక్టర్ కు ఫిర్యాదు..

అనంతపురం : ఆర్టీసీ అంటే నిత్యము ప్రజా సంబంధాలతో కొనసాగవలసిన సంస్థ , నేడు ప్రయాణికుల సమస్యలపై ఏమాత్రం స్పందించకుండా తమ అధికారుల చేత అవాస్తవ సమాచారాన్ని ఇప్పిస్తూ, అధికారుల జులుం చూపిస్తున్న అధికారులపై ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు కే అల్తాఫ్ "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" లో కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. అనంతపురం ఆర్టీసీ బస్సు ప్రాంగణంలోని మూత్రశాలలో మూత్ర విసర్జనకు ఉచితమని రాసిన బోర్డు అది ప్రదర్శనకు మాత్రమే పరిమితం అయింది. మూత్ర విసర్జనకు వెళ్ళిన మహిళలతో బలవంతంగా 5,10 రూపాయలు వసూలు చేస్తున్నారు. అలా ఇవ్వని వారు, డబ్బు లేక వచ్చినవారు విధి లేని పరిస్థితులలో బస్టాండ్ బయట బహిరంగంగా మూత్ర విసర్జన చేస్తున్నారు. బస్సులలో మహిళ గౌరవం కాపాడాలని నినాదాలు రాస్తూనే మరోవైపు వారి ఆత్మ గౌరవం పోతున్నా పట్టించుకోవడం లేదు. అలాగే బస్టాండ్ లో ప్రయాణికుల సౌకర్యం కోసం దుకాణాలు ఏర్పాటు చేశామని చెబుతున్నారు. మరోవైపు ఎమ్మార్పీ రేట్ల కంటే అధికంగా వ్యాపారస్తులు ప్రయాణికులను దోచుకుంటున్నా, నిమ్మకు నీరు ఎత్తినట్లు అధికారులు చూస్తున్నారు. ఇది అన్యాయం అని తెలిపిన తగు చర్యలు తీసుకోవడం లేదు. మరోవైపు ప్రయాణికులను బస్టాండ్ కు తీసుకు వస్తున్న కుటుంబ సభ్యుల వాహనాలకు తగిన పార్కింగ్ ప్లేస్ చూపకుండా అపరాధ రుసుం పేరుతో, నో పార్కింగ్ అంటూ అత్యధిక డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇది అన్యాయం అని ఎన్ని ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించడం లేదు, ఫిర్యాదు చేసిన ప్రజాసంఘాల నాయకులను చర్చలకు పిలిచి అధికారులందరూ ఒకటిగా చేరి, బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఆర్టీసీ అధికారుల జులుమును ప్రజలు అందరూ ఖండించాలని, ప్రయాణికుల హక్కులను కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక జిల్లా నాయకులు కే. సుబ్బరాయుడు, ఎం. సాంబశివుడు, టీవీ రెడ్డి, బసప్ప తదితరులు పాల్గొన్నారు.

## ధర్మవరం హస్తకళల అభివృద్ధికి మరో అడుగు ముందుకు..

### కేంద్ర జౌళి శాఖ నుండి ఒక స్పందన.

ధర్మవరం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ధర్మవరం నియోజకవర్గం అభివృద్ధికి తీసుకుంటున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. ఇటీవల ఆయన కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ కు రాసిన లేఖకు తగిన స్పందన లభించింది. సత్య కుమార్ ధర్మవరం లో ముడి పదార్థాల డిపో ఏర్పాటు కోసం ఆమోదం కోరారు. దీనికి స్పందనగా, కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ 13 మే న అధికారికంగా ఉత్తరం రాసి, ఆ లేఖను సంబంధిత విభాగానికి అవసరమైన చర్యలు తీసుకునే విధంగా ఫార్వార్డ్ చేసినట్లు తెలిపారు. ఈ చర్య ద్వారా ధర్మవరం హస్తకళల రంగానికి విశేషంగా మేలు జరగనుంది. ఈ ప్రాజెక్ట్ అమలవితే, వేలాది మంది కళాకారులకు నాణ్యమైన ముడి పదార్థాలు తక్కువ ధరకు, సమయానికి అందుబాటులోకి వచ్చి వారి జీవనోపాధికి స్థిరత కలగనుంది. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ స్పందిస్తూ, ధర్మవరం కళాకారుల సమస్యలను పరిష్కరించే దిశగా కేంద్రంతో పరస్పర సహకారంతో ముందుకు సాగుతున్నాం. ఇది వోకల్ ఫర్ లోకల్ దిశగా ఒక గొప్ప అడుగు అని తెలిపారు.

## విద్యార్థుల ప్రతిభను గుర్తించి గౌరవించడం అభినందనీయం..

### వాల్మీకి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు..

### హాజరైన ఎమ్మెల్యే కాలువ, ఎంపీ అంబికా..



అనంతపురం : అనంతపురం నగరంలోని వాల్మీకి భవన్‌లో వాల్మీకి ఉద్యోగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వాల్మీకి విద్యార్థులకు ప్రతిభా పురస్కార అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను గుర్తించి గౌరవించడం స్ఫూర్తిదాయకం అని, ఇలాంటి కార్యక్రమాలు వారి భవిష్యత్తుకు తోడ్పడే విధంగా ఉండాలన్నారు. ఈ తరహా కార్యక్రమాలు సమాజంలో విద్యాభివృద్ధికి దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం శాసన సభ్యులు కాలువ శ్రీనివాసులు, వాల్మీకి ఉద్యోగ సంక్షేమ సంఘం అధ్యక్షులు అక్కులప్ప, ప్రధాన కార్యదర్శి చైతన్య కుమార్, ఆర్థిక కార్యదర్శి పవన్ కుమార్, వాల్మీకి సంఘం నేతలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మరియు ఇతర సభ్యులకు ఎంపీ, ఎమ్మెల్యే లు హృదయపూర్వకంగా అభినందనలు తెలిపారు.

## నీటి తోటలకు ఆర్థిక సాయం అందించిన రుక్మిణి..


### సర్వప్రాణుల సేవయే సర్వేశ్వరుని సేవ..

### మూగజీవాలకు సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు..



అనంతపురం: సృష్టిలో మానవులే కాకుండా అన్ని ప్రాణులకు సేవ చేయడమే నిజమైన సర్వేశ్వరుని సేవయని అన్ని ప్రాణులను కాపాడినప్పుడే సమతుల్యం ఏర్పడుతుందని సాయి ట్రస్ట్ అధ్యక్షుడు డా. విజయ సాయికుమార్ అన్నారు. స్వతహాగా జంతు ప్రేమికురాలైన సాయి ట్రస్ట్ అధ్యక్షుడు మాతృమూర్తి వై. రుక్మిణి స్పందించి వివిధ ప్రాంతాలలో మూగ జీవుల కొరకు ఏర్పాటు చేసిన 10 మంచి నీటి తోట్టేలకు ఆమె ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూగ జీవాలు ఎండ తీవ్రతకు తట్టుకోలేక ఇబ్బంది పడుతున్నాయని వాటి నీడ వసతి కొరకు నీటి తొట్టెలను ఏర్పాటు చేసామని ఇలా ప్రతి ఒక్కరు తమకు చేత నైనంతలో జంతువుల కొరకు నీటి తొట్టెలను ఏర్పాటు చేయాలనీ ముక్యంగా ప్రతి అపార్ట్ మెంట్ పై భాగాన నీటిని ఉంచితే ఆ నీటిని పక్షులు త్రాగి సేద తీరుతాయని ఆమె చెప్పారు.

# చీకటి వెలుగులు



ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ఆలయాలు ఉన్నాయి. ఎన్నో మతాలు ఉన్నాయి. ఎన్నో ఆరాధనా పద్ధతులు ఉన్నాయి. ఆలయాల తొలి ఆనవాళ్లు క్రీస్తుపూర్వం పన్నెండువేల ఏళ్లనాటివి. దాదాపు అన్ని మతాలూ దైవభక్తిని ప్రబోధించేవే! జ్ఞానమార్గాన్ని బోధించిన మతాలు లేకపోలేదు గాని, జనాలను భక్తిపారవశ్యం ఆకట్టుకున్నంతగా జ్ఞానం ఆకట్టుకున్న దాఖలాలు తక్కువ. భాషలు పుట్టి, లిపులు ఏర్పడి, సమాచారాన్ని శిలల మీద, మట్టి పలకల మీద, లోహపు రేకుల మీద, ఆకుల మీద నిక్షిప్తం చేయడం మొదలుపెట్టిన తర్వాత గాని ప్రపంచంలో జ్ఞానవ్యాప్తి మొదలు కాలేదు. మనుషులకు అక్షరజ్ఞానం అబ్బిన తర్వాత తమకు తెలిసిన సమాచారాన్ని తమకు దొరికిన సాధనాలను ఉపయోగించుకుంటూ లిఖితపూర్వకంగా నిక్షిప్తం చేయడం మొదలుపెట్టారు. చరిత్రలో తొలినాటి రచనల ఆనవాళ్లు క్రీస్తుపూర్వం నాలుగో సహస్రాబ్ది నాటివి. మానవాళి జ్ఞానయానానికి అవి తొలి మైలురాళ్లు. భక్తిపారవశ్యం ఒకవైపు, జ్ఞానయానం మరోవైపు మానవాళి మనుగడను ఆది నుంచి నిర్దేశిస్తూనే ఉన్నాయి. సామాజిక, తాత్త్విక, శాస్త్ర, సాంకేతిక పురోగతికి ఎందరో జ్ఞానులు బాటలు వేశారు. లోకమంతటా తమ జ్ఞానకాంతులను ప్రసరించారు. వినువీధిలో ఒకవైపు సూర్యుడు సహా అసంఖ్యాక నక్షత్రాలు నిరంతరం వెలుగులను వెదజల్లుతున్నా, మరోవైపు చీకటి నిండిన కృష్ణబిలాలు కూడా ఉన్నాయి. అలాగే ఈ లోకంలో ఒకవైపు జ్ఞానులు ప్రసరించిన జ్ఞానకాంతులు ఉన్నా, మరోవైపు మౌఢ్యాంధకారం కూడా అంతే గాఢంగా ఉంది. మానవాళిలో మౌఢ్య నిర్మూలనమనేది ఇప్పటికీ నెరవేరని కలగానే మిగిలింది. 'మతములన్నియు మాసిపోవును/ జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును' అని గురజాడ ఆకాంక్షించారు. ఇప్పటి పరిస్థితులను గమనిస్తే, ఆయన ఆకాంక్ష నెరవేరడానికి ఇంకెన్ని యుగాలు పడుతుందో చెప్పడం కష్టం. ఆరాధించే వాటికి ఆలయాలను నిర్మించుకోవడం అనాది సంస్కృతి. దేవాలయాలను, ప్రార్థనాలయాలను నిర్మించుకున్న మనుషులు అక్కడితో ఆగిపోలేదు. ఆరాధ్య నటీనటులకు, నాయకులకు సైతం ఆలయాలను నిర్మించే స్థాయికి పరిణామం చెందారు. ప్రపంచంలో మౌఢ్యం శ్రుతిమించి మితిమీరిన కాలాల్లో సమాజాన్ని సంస్కరించడానికి ఎందరో సంస్కర్తలు ప్రయత్నించారు. జ్ఞానకాంతులతోనే మౌఢ్యాంధకారం పటాపంచలవుతుందని గ్రహించి, జ్ఞానవ్యాప్తికి కృషి చేశారు. ఒక తరం నుంచి మరో తరానికి జ్ఞానసంపదను అందించడానికి గ్రంథాలయాలను నెలకొల్పారు. ప్రపంచంలోని తొలి గ్రంథాలయం క్రీస్తుపూర్వం మూడో సహస్రాబ్దిలో ఏర్పడింది. ఇప్పటి సిరియాలోని టెల్ మార్డిక్ గ్రామంలో ఉందది. 'ది రాయల్ లైబ్రరీ ఆఫ్ ఎబ్లా' అనే ఈ గ్రంథాలయం తొలి జ్ఞాననిధి. ఇందులో ఇరవైవేల మట్టిపలకలపై ఉన్న రాతలు చెక్కుచెదరకుండా ఉన్నాయి. ఇది ద్విభాషా గ్రంథాలయం కావడం ఇంకో విశేషం. సుమేరియన్, ఎబ్లాయెట్ భాషలలో చిత్రలిపిలో రాసిన రాతలు ఆనాటి సామాజిక, వాణిజ్య, విద్యాపరమైన పరిస్థితులకు సాక్షీభూతంగా నిలిచి ఉన్నాయి. ఈ మట్టిపలకల్లో కొన్ని ఇప్పుడు సిరియాలోని డెమాస్కస్, అలెప్పో తదితర నగరాల్లోని మ్యూజియంలలో ఉన్నాయి. ప్రాచీనకాలంలో మన ఉపఖండ భూభాగంలోనూ నలంద, తక్షశిల విశ్వవిద్యాలయాల్లో గ్రంథాలయాలు ఉండేవి. ఇప్పుడు వాటి శిథిలావశేషాలు తప్ప ఆనాటి జ్ఞానసంపద ఏదీ మిగిలి లేదు. పురాతన గ్రంథాలయాలు ఏర్పడిన కాలంలోనే ప్రపంచవ్యాప్తంగా మూఢాచారాలు కూడా విస్తృతంగా ఉండేవి. ఆ తర్వాత కాలంలో చాలా మార్పులు జరిగాయి. జాన్ గూటెన్‌బర్గ్ రూపొందించిన ముద్రణ యంత్రం పుస్తకాల రూపురేఖలను మార్చేసింది. ఆధునిక పుస్తకాలకు అంకురారోపణ చేసింది. పారిశ్రామిక విప్లవ కాలంలో పుస్తకాల ముద్రణ పెరగడం మొదలైంది. వలస పాలనలు మొదలవడంతో ప్రజలకు బహుభాషా పరిచయం ఏర్పడి, సమాచార ఆదాన ప్రదానాలు ఊపందుకున్నాయి. బ్రిటిష్ హయాంలో మన దేశంలో నాటి కలకత్తా నగరంలో 'ఏషియాటిక్ సొసైటీ లైబ్రరీ' పేరుతో తొలి ఆధునిక గ్రంథాలయం 1781లో ఏర్పడింది. అప్పటికి సతీసహగమన దురాచారంపై ఇంకా నిషేధం విధించలేదు. మన తెలుగునేల మీద 1886లో తొలి ఆధునిక గ్రంథా లయాన్ని విశాఖపట్నంలో మంతిన సూర్యనారాయణమూర్తి నెలకొల్పారు. అప్పటికి కన్యాశుల్కం దురాచారం తీవ్రంగా ఉండేది. స్వాతంత్ర్యోద్యమ కాలంలోనే అయ్యంకి వెంకటరమణయ్య నేతృత్వంలో గ్రంథాలయోద్యమం కూడా మొదలైంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక అనేక మార్పులు జరిగాయి. ఎంతో అభివృద్ధి జరిగింది. ప్రజల్లో అక్షరాస్యత పెరిగింది. పత్రికలు, అధునాతన ప్రసార మాధ్యమాలు విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయి. అయినా, జనాల్లో మౌఢ్యం పూర్తిగా అంతరించలేదు. ఇప్పటికీ మన దేశంలో గ్రంథాలయాల కంటే దేవాలయాలు, ప్రార్థనాలయాలే ఎక్కువ. వైజ్ఞానికాభివృద్ధి ఫలితంగా అందివచ్చిన సాంకేతికత సాధనాలను కూడా వ్యర్థవినోదానికి వినియోగించుకోవడంలో మన జనాలు అపార ప్రజ్ఞాధురీణులు. మౌఢ్య ప్రాబల్యం ఎంతగా పెరుగుతున్నా, జ్ఞానారాధకులు అంతరించిపోలేదు. అందుకు నిదర్శనమే కేరళలోని కాసర్‌గోడ్ జిల్లా కంబళూరులో వెలసిన పుస్తకాలయం. పుస్తకమే ఇందులోని దేవత. పుస్తకాలే ప్రసాదం. 'జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును' అనే ఆకాంక్షను వెలిగించడానికి ఇదొక ఆశాదీపం.

## బిజెపి మంత్రి విజయ్ షాపై సుప్రీం అక్షింతలు.. సిట్ ఏర్పాటు



న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్ బీజేపీ మంత్రి విజయ్ షాకు సుప్రీంకోర్టు షాకిచ్చింది. పాకిస్తాన్‌పై ఆపరేషన్ సిందూర్ గురించి మీడియాకు వివరించిన భారత ఆర్మీ అధికారి కల్నల్ సోఫియా ఖురేషిపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది ధర్మాసనం. కల్నల్ సోఫియా ఖురేషిని "ఉగ్రవాదుల సోదరి" అని అన్నందుకు తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలని మంత్రి విజయ్ షా సుప్రీంకోర్టుకు వెళ్ళిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో విచారించిన సుప్రీంకోర్టు.. "మీరు ఒక ప్రజా వ్యక్తి. అనుభవజ్ఞుడైన రాజకీయ నాయకుడు. మీరు ప్రజాప్రతినిధిగా ఉన్నప్పుడు ఎంతో జాగ్రత్తగా మాట్లాడాలి. ఇది సాయుధ దళాలకు ముఖ్యమైన విషయం. మనం చాలా బాధ్యతాయుతంగా ఉండాలి. మీరు చేసిన వ్యాఖ్యలకు దేశ ప్రజలంతా సిగ్గుతో తలవంచుకోవాల్సి వచ్చింది" అని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. మంత్రి విజయ్ షా చేసిన వ్యాఖ్యలను విచారించడానికి ఒక మహిళా అధికారితో సహా ముగ్గురు సీనియర్ ఐపీఎస్ అధికారులతో సిట్‌ను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. మంత్రి విజయ్ షా అరెస్టును నిలిపివేయాలని.. కానీ ఆయన సిట్‌కు పూర్తిగా సహకరించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఈ నెల 28వ తేదీ లోపు విచారణకు సంబంధించిన నివేదికను అందజేయాలని సుప్రీంకోర్టు తెలిపింది.

## ప్రతిరైతుకు సోలార్ విద్యుత్ అందించి తీరుతాం




హైదరాబాద్: పాలమూరు బిడ్డల చెమటతోనే ప్రాజెక్టుల నిర్మాణం జరిగిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. పాలమూరు అంటే తనకు ఎంతో గౌరవం అని అన్నారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలబెడతానని చెప్పారు. ఈ సందర్భంగా పాలమూరులో సిఎం మాట్లాడుతూ..గిరిజనల కోసం ప్రత్యేక పథకాలు తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్ ది అని చెప్పారు. అచ్చం పేటలో ప్రతిరైతుకు సోలార్ విద్యుత్ అందించి తీరుతామని తెలియజేశారు. సోలార్ విద్యుత్ అందించడమే కాదు.. ఆదాయం వచ్చేలా చేస్తామని రుణమాఫీ చేశామని తెలియజేశారు. వడ్లకు బోనస్ ఇస్తున్నామని, వరి వేసుకుంటే ఉరేనన్న దొర మాత్రం వరి వేసి అమ్ముకున్నారని ఎద్దేవా చేశారు. రైతుల కోసం ఇప్పటి వరకు రూ. 60 వేల కోట్లు ఖర్చు చేశామని, 50 లక్షల పేద కుటుంబాలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని అన్నారు. మహిళలే ఆర్టిసి బస్సులు అద్దెకు తప్పుకునేలా చేశామని, మహిళా సంఘాలను పెట్రోలు బంకులకు యజమానులను చేశామని పేర్కొన్నారు. .2029 లోపు కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## ఇజ్రాయిల్ తాజా దాడుల్లో 22 మంది పాలస్తీనియన్లు మృతి




గాజా : పాలస్తీనా భూభాగంలో ఇజ్రాయిల్ వైమానిక దాడికి 22 మంది పాలస్తీనియన్లు మృతి చెందారని రెస్క్యూ సిబ్బంది సోమవారం తెలిపారు. ప్రధానంగా ఈరోజు గాజాలో దక్షిణ ప్రధాన నగరమైన ఖాన్ యూనిస్‌తోపాటు చుట్టుపక్కల ఇజ్రాయిల్ సైన్యం వైమానిక దాడులకు పాల్పడింది. ఈ దాడుల వల్ల 11 మంది మృతి చెందారని, అనేమంది గాయాలపాలయ్యారని పౌర రక్షణ సంస్థ ప్రతినిధి మహమూద్ బస్సాల్ తెలిపారు. అలాగే అబాసాన్‌లో మరొకరు మృతి చెందినట్లు ఆయన తెలిపారు. జబాలియా పట్టణానికి పశ్చిమాన ఉన్న మార్కెట్ సమీపంలో జరిగిన వైమానిక దాడిలో ఐదుగురు మృతి చెందారు. గాజా మధ్యలో ఉన్న నుసెయిరాట్‌లో ఉన్న గుడారంపై వైమానిక దాడికి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. ఉత్తరాన ఉన్న గాజా నగరంలో జరిగిన దాడికి ఒకరు చనిపోయారు. ఇదిలా ఉండగా గాజ స్ట్రిప్ అంతటా దాడులకు పాల్పడుతున్నట్లు ఇజ్రాయిల్ సైన్యం సోమవారం వెల్లడించింది.

## విచారణ నుండి తప్పించుకునేందుకు క్షమాపణలా

### - విజయ్ షాని చీవాట్లు పెట్టిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ : కల్నల్ సోఫియా ఖురేషిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మధ్యప్రదేశ్ మంత్రి విజయ్ షాని సుప్రీంకోర్టు సోమవారం చీవాట్లు పెట్టింది. విచారణ నుండి తప్పించుకునేందుకు క్షమాపణలు చెబుతారా అని నిలదీసింది. మంత్రిపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను దర్యాప్తు చేసేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది. మంత్రివి నిరర్థకమైన, బుద్ధిహీనమైన వ్యాఖ్యలు అని జస్టిస్ సూర్యకాంత్ మండిపడ్డారు. విచారణ నుండి తప్పించుకునేందుకు కోర్టుకు క్షమాపణ చెప్పడంలో అర్థంలేదని అన్నారు. విజయ్ షా వ్యాఖ్యలు చేసిన వీడియో క్లిప్‌లను ధర్మాసనం వీక్షించిందని, ఆ క్లిప్‌లను కోర్టుకు కూడా తీసుకువెళ్లిందని అన్నారు. ఆ వీడియోల్లో చాలా అసభ్యకరమైన, దుర్వినియోగమైన పదాలను వాడారని మండిపడ్డారు. ఒక ప్రజాప్రతినిధి, అనుభవజ్ఞులైన రాజకీయ నేత బాధ్యతగా వ్యవహరించాలని, ప్రతి పదాన్ని ఆచితూచి మాట్లాడాలని అన్నారు. మీ వ్యాఖ్యలతో ప్రజల మనోభావాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని అన్నారు. మధ్యప్రదేశ్ కేడర్, డైరెక్ట్ రిక్రూట్ చేయబడిన ఐపిఎస్ అధికారులతో సిట్‌ను ఏర్పాటు చేయాలని ధర్మాసనం రాష్ట్ర డిజిపిని ఆదేశించింది. అయితే ఈ ముగ్గురు సభ్యుల్లో రాష్ట్రానికి చెందినవారు ఉండకూడదని, వారిలో ఒక మహిళ ఉండాలని పిఎస్ సూచించింది. ఇన్‌స్పెక్టర్ జనరల్ హెూదా కలిగిన ఐఅధికారి సిట్‌కి నేతృత్వం వహించాలని, మిగిలిన ఇద్దరూ ఎస్‌పి హెూదా కలిగి ఉండాలని పేర్కొంది. మే 20 ఉదయం పది గంటలలోపు సిట్‌ను నియమించాలని సూచించింది. దర్యాప్తు వివరాలను సిట్ స్టేటస్ రిపోర్ట్‌లో సమర్పించాలని ధర్మాసనం ఆదేశించింది. అరెస్ట్ నుండి మినహాయింపు కల్పించిన కోర్టు .. విచారణకు సహకరించాలని మంత్రిని ఆదేశించింది. తదుపరి విచారణను మే 28కి వాయిదా వేసింది.

## జూన్ 21 వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని

# ఘనంగా నిర్వహించాలి

### మే 21 నుండి జూన్ 21 వరకు యోగాంధ్ర క్యాంపెయిన్ నిర్వహించాలి

### రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్







**కర్నూలు,:** జూన్ 21 వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని, ఇందులో భాగంగా జిల్లా స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు మే 21 నుండి జూన్ 21 వరకు యోగాంధ్ర క్యాంపెయిన్ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం సెక్రటేరియట్ నుండి అంతర్జాతీయ యోగా దినోత్సవం ఏర్పాట్లు,స్టేట్ ప్రాజెక్ట్ మానిటరింగ్ గ్రూప్ ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ, కోర్టు సముదాయాలలో మరుగుదొడ్ల నిర్మాణం, ప్రభుత్వ సేవలపై ప్రజాభిప్రాయం అంశాల పై చీఫ్ సెక్రటరీ జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ జూన్ 21వ తేదీన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమాన్ని విశాఖపట్టణంలో నిర్వహిస్తారని, ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి ముఖ్యమంత్రి పాల్గొంటారని తెలిపారు.. జిల్లాల్లో గ్రామ గ్రామాన ప్రజలు యోగా దినోత్సవంలో పాల్గొనేలా, విజయవంతంగా యోగా దినోత్సవ కార్యక్రమాలను నిర్వహించాలని సి.ఎస్ ఆదేశించారు. మే 21 న యోగా దినోత్సవం కర్టెన్ రైజర్ గా ప్రతి జిల్లాలో ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు.. ప్రతి మండలంలోనూ మాస్టర్ ట్రైనర్లను గుర్తించాలని సూచించారు.. మే 21 నుంచి 27 వరకు జిల్లా స్థాయిలో మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఉంటుందని, మే 28 నుంచి జూన్ 3 వరకు మండల స్థాయిలోనూ, జూన్ 4 నుంచి జూన్ 16వ తేదీ వరకు గ్రామస్థాయిలో ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు..యోగా పై అవగాహన కలిగే విధంగా ర్యాలీలు,రంగోలి, కాంపిటీషన్స్ నిర్వహించాలని సీ ఎస్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ అభివృద్ధి పనులకు సంబంధించి పెద్ద పెద్ద పనులను స్టేట్ ప్రాజెక్ట్ మానిటరింగ్ గ్రూప్ ఆధ్వర్యంలో పర్యవేక్షణ చేయడం జరుగుతుందని, ఆయా జిల్లాలకు సంబంధించి ప్రాజెక్టు పనులలో పెండింగ్ లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సీ ఎస్ ఆదేశించారు. జిల్లా కోర్టులు, సబార్డినేట్ కోర్టులలో దెబ్బతిన్న మరియు కొత్త టాయిలెట్స్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలు సేవలపై వచ్చే ప్రజా స్పందనలపై తేలికగా తీసుకోకుండా జిల్లా కలెక్టర్లు సమీక్ష చేసి నిరంతరం పర్యవేక్షణ చేయాలని సీ ఎస్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేయండి

- పారిశుద్ధ్య పర్యవేక్షక సిబ్బందితో మంత్రి టీ.జీ. భరత్
- పారిశుద్ధ్యం లోపిస్తే సంబంధిత వారిదే బాధ్యత
- గార్బేజ్ పాయింట్ రహిత నగరంగా తీర్చిదిద్దాలి
- ప్రభుత్వ ఆస్తులపై బ్యానర్లు, పోస్టర్లు అతికిస్తే చర్యలు తీసుకోండి



**కర్నూలు:** నగరంలో పారిశుద్ధ్య పనులను మరింత ముమ్మరం చేయాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ పారిశుద్ధ్య పర్యవేక్షక సిబ్బందిని ఆదేశించారు. సోమవారం స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో కమిషనర్ యస్.రవీంద్ర బాబుతో కలిసి పారిశుద్ధ్య పర్యవేక్షకులు, కార్యదర్శులు, మేస్త్రిలతో పారిశుద్ధ్యంపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నగరంలో పారిశుద్ధ్యంపై ఫిర్యాదులు ఎక్కువ అయ్యాయని, వాటిపై పర్యవేక్షక సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పునరావృతం అవుతున్న సమస్యలు ఫిర్యాదులు వచ్చేంత వరకు వేచి ఉండకుండా, ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రానున్న రోజుల్లో పారిశుద్ధ్య మెరుగుపడకపోతే, ఎక్కడైనా పారిశుద్ధ్యం లోపిస్తే సంబంధిత సిబ్బందే బాధ్యత అని, వారిపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. పారిశుద్ధ్యంలో విశాఖపట్నం తరహాలో నగరాన్ని తీర్చిదిద్దాలని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గార్బేజ్ పాయింట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని, రహదారులపై చెత్తా వేసే వారిని గుర్తించి హెచ్చరించాలని, అయినప్పటికీ వినకపోతే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రహదారులు, కూడళ్లపై బ్యానర్లు, పోస్టర్లు అతికించే వారిపై సైతం చర్యలు తీసుకునేందుకు ఉపేక్షించొద్దని ఆదేశించారు. సిసి కెమెరాలకు అడ్డంగా ఏవైనా బ్యానర్లు కడితే ఆ సమయంలో అక్కడ ఏదైనా ప్రమాదం జరిగితే బ్యానర్లు కట్టిన వారే బాధ్యత వహించాల్సి ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. కమిషనర్ మాట్లాడుతూ.. పారిశుద్ధ్యం, ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక విభాగాల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, మురుగు కాలువలపై ఆక్రమణలు, కాలువలు ఎక్కుతక్కులను సరిచేయించుకునే బాధ్యత పారిశుద్ధ్య పర్యవేక్షక సిబ్బంది తీసుకోవాలని ఆదేశించారు. ఇంటింటి చెత్తా సేకరణ వంద శాతం చేపట్టాలని, రహదారులపై, మురుగు కాలువల్లో చెత్తాచెదారం వేస్తే కలిగే అనర్థాలను ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. నగరంలో వేస్ట్ ఎనర్జీ ప్లాంట్ నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, తద్వారా కర్నూలుతో పాటు సమీప మున్సిపాలిటీల్లో వెలువడే వ్యర్థాలతో విద్యుత్ తయారు చేయవచ్చన్నారు. మురుగు కాలువల్లో ఉన్న తాగునీటి పైప్‌లైన్‌లను తొలగించేందుకు ప్రతిపాదనలను రూపొందించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, ఇంచార్జ్ యస్ఈ శేషసాయి, ఎంఈ సత్యనారాయణ, పట్టణ ప్రణాళిక సర్వేయర్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



# దేశవ్యాప్తంగా అతి భారీ వర్షాలు : ఐఎండి



అమరావతి : దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని ఐఎండి పేర్కొంది. ఈసారి నైరుతి రుతుపవనాలు మరింత వేగంగా దేశాన్ని తాకనున్నాయని వాతావరణ శాఖ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ నెల 24వ తేదీనే కేరళలోకి రుతుపవనాలు ప్రవేశించే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఇవి అండమాన్ నికోబార్ దీవులందంతట విస్తరించాయని, అనుకున్న సమయం కంటే ఐదు రోజుల ముందుగానే ఇవి అండమాన్‌ను చేరాయని తెలిపారు. ముందుగా ఈ నెల 27వ తేదీన నైరుతి రుతుపవనాలు కేరళను తాకుతాయని ఐఎండి అంచనా వేసిన విషయం తెలిసిందే. నైరుతి రుతుపవనాల ప్రభావంతో కేరళ, కర్నాటక, గోవా, మహారాష్ట్రలో భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండి తెలిపింది. తమిళనాడు, పుదుచ్చేరి, కోస్తాంధ్ర, తెలంగాణకి కూడా వర్ష సూచన ఉందని చెప్పింది. అటు అస్సాం, మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, మిజోరం, త్రిపుర, రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. ఇక ఢిల్లీ, పంజాబ్, హర్యానా, చండీగఢ్, ఉత్తర ప్రదేశ్ ప్రాంతాల్లో ధూళి తుఫాన్లు వచ్చే అవకాశం ఉందని ఐఎండి అంచనా వేసింది. ఇప్పటికే బెంగళూరులో కుండపోత వాన కురుస్తోంది. గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తున్నాయి. ఆగ్నేయ బంగాళఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగానే ఈ వర్షాలు కురుస్తున్నాయని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే స్కూల్స్, ఆఫీసులకు సెలవులు ప్రకటించారు.

# తెలంగాణలో పెరగనున్న మద్యం ధరలు



హైదరాబాద్ : తెలంగాణలో నేటి నుండి మద్యం ధరలు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. ఫుల్ బాటిల్‌కు రూ.40, హాఫ్ బాటిల్‌కు రూ.20 మరియు క్వార్టర్ బాటిల్ రూ.10 వరకు ధరల పెరుగుదల ఉండవచ్చు. అధికారికంగా ఇంకా ఉత్తర్వులు జారీ చేయనప్పటికీ, ఆదివారం డిపార్ట్‌మెంట్ వెబ్‌సైట్ అందుబాటులో లేకపోవడం, సవరించిన రేట్లతో సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేయడంలో మార్పులు జరుగుతున్నాయని సూచిస్తుంది. అధికారిక ప్రకటన లేదని, ధరల స్థిరీకరణ కమిటీ ఇప్పటికే మద్యంపై 10% నుండి 15% పెంపును సూచించిందని అధికారులు చెబుతున్నారు. అయితే సిఫార్సులను ముఖ్యమంత్రి ఆమోదం పొందాల్సి ఉందని, ఫైల్ ఆయన పరిశీలన కోసం పెండింగ్‌లో ఉందని అధికారులు పేర్కొన్నారు. ధరల పెరుగుదలతో నెలకు రూ.150 కోట్ల వరకు అదనపు ఆదాయం వస్తుందని వారు భావిస్తున్నారు. వైన్ డీలర్లకు కూడా ధరల పెరుగుదల గురించి అధికారికంగా సమాచారం ఇవ్వలేదని, ఈ పెంపు కొత్త స్టాక్‌లకు వర్తిస్తుందా లేదా ఉన్న స్టాక్‌కు వర్తిస్తుందా అనేది వారికి స్పష్టత లేదు. మద్యం ఆదాయాన్ని పెంచడం ద్వారా ఖజానా నింపడమే లక్ష్యంగా ప్రభుత్వం బీర్లు, బార్లపై మాత్రమే ఆధారపడి రాష్ట్రాన్ని పాలిస్తున్నదా అని భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి టి.హరీష్ రావు ప్రశ్నించారు.

# టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోకేష్?

## మహానాడులో ప్రకటన !




అమరావతి : టిడిపిలో నారా లోకేష్‌కు కొత్త పదవి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం పార్టీలో జాతీయ ప్రధాన కార్యదర్శి హెూదాతో పాటు కార్యకర్తల సంక్షేమ నిధి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అయితే ఇప్పుడు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోకేష్‌ను చేసే అవకాశం ఉందని పార్టీలో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే పార్టీలో, ప్రభుత్వంలో లోకేష్ కీలకంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వంలో ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖలే కాకుండా ఇతర శాఖలకు సంబంధించిన కొన్ని ప్రాజెక్టులను కూడా చూసుకుంటూ కీలకంగా వ్యవహరిస్తున్నారు. పార్టీ అధినేతగా ఉన్న చంద్రబాబు నాయుడు పూర్తిగా పాలనపైనే దృష్టి సారించారు. పార్టీ కార్యాకాలపాలపై ఆయన అంతగా దృష్టి సారించడం లేదని, ఎక్కువగా లోకేష్‌కే అప్పగించారని పార్టీ నేతలు చెబుతున్నారు. ఇప్పటికే లోకేష్ పార్టీలో యువనాయకులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేసుకున్నారని అంటున్నారు. ఇటీవల వైసిపి నేతల ఖాళీతో రాజ్యసభ స్థానాలు ఖాళీ అయిన సంగతి తెలిసిందే. అదేవిధంగా కొన్ని ఎమ్మెల్సీ స్థానాలు కూడా ఖాళీ అయ్యాయి. ఈ స్థానాల్లో కూడా లోకేష్ తన టీం సభ్యులకే అప్పగించారని పార్టీ నేతలు చెబుతున్నారు. దీంతో ఆయనకు పార్టీలో ఈసారి కీలక బాధ్యతలు అప్పగించాలని అధినేత ఆలోచిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం పార్టీలో జాతీయ ప్రధాన కార్యదర్శి హెూదా కొంతమంది నేతలకు ఉంది. ఒక పదవిలో ఒక వ్యక్తి మూడుసార్లు కంటే ఎక్కువ ఉండకూడదని లోకేష్ రెండేళ్ల నుంచి ఖరాఖండిగా చెబుతున్నారు. ఈ నిబంధన ఉండాలని ఇటీవల జరిగిన పొలిట్‌బ్యూరో సమావేశంలో తీర్మానం చేశారు. జాతీయ ప్రధాన కార్యదర్శిగా లోకేష్ మూడుసార్లు కంటే ఎక్కువగానే కొనసాగుతున్నారు. ఇప్పుడు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి అప్పగించే అవకాశం ఉందని చెబుతున్నారు. టిడిపిలో వర్కింగ్ ప్రెసిడెంట్ అనే పదవి లేదు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో కడపలో ఆ పార్టీ మహానాడు జరగనుంది. ఈ మహానాడులో లోకేష్‌కు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వాలంటూ తీర్మానం ప్రతిపాదించి ఆమోదించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు అంటున్నాయి. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పార్టీ పూర్తి బాధ్యతలు ఇక లోకేష్ చూసుకునే అవకాశాలు ఉన్నాయి.

# ఏపీని అగ్ర స్థానంలో నిలపాలన్నదే నా ఆకాంక్ష!



అమరావతి : ఆరోగ్య సంరక్షణలో దేశంలోనే ఏపీని అగ్ర స్థానంలో నిలపాలన్నదే తన ఆకాంక్ష అని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ తెలిపారు. జన్యుపరంగా, వారసత్వంగా వస్తున్న వ్యాధులను ముందుగా గుర్తించడం చాలా ముఖ్యం అని అన్నారు. వ్యాధి నిర్ణారణ అయిన వారికి ప్రభుత్వం ఉచితంగా చికిత్స అందిస్తోందన్నారు. తలసీమియా, హిమోఫీలియా, సికిల్ సెల్ ఎనీమియా విభాగాల్లో మరింత అవగాహన కల్పించేందుకు రెండు రోజుల ఓరియెంటేషన్ నిర్వహిస్తామని మంత్రి సత్యకుమార్ చెప్పారు. ఈరోజు విజయవాడలో మంత్రి సత్యకుమార్ మీడియాతో మాట్లాడారు. 'ఆరోగ్య సంరక్షణలో దేశంలోనే ఏపీని అగ్ర స్థానంలో నిలపాలన్నదే నా ఆకాంక్ష. రాష్ట్రంలో 1900 మంది హిమోఫీలియా బాధితులున్నారు. 2100 మంది తలసీమియాతో, ఇదే సంఖ్యలో సికిల్ సెల్ ఎనీమియాతో బాధపడుతున్నారు. జన్యుపరంగా, వారసత్వంగా వస్తున్న ఈ వ్యాధిని ముందుగా గుర్తించడం చాలా ముఖ్యం. బాధితులకి క్రమం తప్పకుండా ఉచిత రక్త మార్పిడి చేస్తున్నాం. రాష్ట్రంలోని 5 ఐసిహెచ్‌యస్ సెంటర్ల ద్వారా ముందస్తు వ్యాధి నిర్ధారణ పరీక్ష చేస్తున్నాం. వ్యాధి నిర్ణారణ అయిన వారికి ప్రభుత్వం ఉచితంగా చికిత్స అందిస్తోంది. గిరిజన ప్రాంతాల్లో 19 లక్షల మందికి సికిల్ సెల్ ఎనీమియా స్క్రీనింగ్ చేయాల్సి ఉండగా, 10 లక్షల 50 వేల మందికి స్క్రీనింగ్ చేశారు. ఇందులో 19,000 మంది పైగా క్యారియర్స్ ఉన్నారు, 2100 మందికి వ్యాధి నిర్ధారణ అయ్యింది. జన్యుపరమైన సికిల్‌సెల్ ఎనీమియా స్క్రీనింగ్ తర్వాత గుర్తింపు కార్డులిస్తున్నాం. నోడలాఫిసర్లకు అవగాహన కల్పించేందుకు రెండు రోజుల పాటు శిక్షణ ఉంటుంది. తలసీమియా, హిమోఫీలియా, సికిల్ సెల్ ఎనీమియా విభాగాల్లో మరింత అవగాహన కల్పించేందుకు రెండు రోజుల ఓరియెంటేషన్ జరుగుతుంది' అని మంత్రి సత్యకుమార్ చెప్పారు.

# పుష్కర సరస్వతికి ప్రణామం



ప్రతి నదికి ఏడాదికి ఒక్కసారి పుష్కరాలు జరుగుతాయి. బృహస్పతిలో ఆయా రాశులు ప్రవేశించడంతో ఆ నదికి పుష్కరాలు జరుగుతాయి. ఈనెల 15న గురువారం బృహస్పతి మిథున రాశిలోకి ప్రవేశించడంతో ఉదయం 5.44 గంటలకు సరస్వతినదికి పుష్కరాలు ఆరంభం అయ్యాయి. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం... సరస్వతీ నది పుష్కరాలు ఉత్తరాదిలో నాలుగుచోట్ల, దక్షిణాది లో తెలంగాణలోని కాళేశ్వరంలో మాత్రమే జరుగుతున్నాయి. నది పుట్టినచోటుగా గుర్తించిన ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్, ఉత్తర్‌ప్రదేశ్‌లోని గంగా, యమున, సరస్వతి (అంతర్వాహిని)నదులుగా భావించే ప్రయాగ్‌రాజ్, గుజరాత్‌లోని సోమనాథ్, రాజస్థాన్‌లోని పుష్కర్ వద్ద సరస్వతీనదికి పుష్కరాలు జరుగుతున్నాయి.

పుష్కర స్నానం..పుణ్యఫలం..

పుష్కర స్నానం... ఎంతో పుణ్య ఫలం. నది స్నానాలు చేస్తే మానవ జీవన గమనంలో తెలిసో, తెలియకో చేసిన పాపాలు తొలగుతాయని పురాణాల్లో పేర్కొన్నారు..

తర్పణలు, పిండప్రదానాలు..

సాధారణంగా నదీస్నానాల్లో తర్పణం, పిండ ప్రదానం, శ్రాద్ధకర్మ పిండప్రదాన కర్మలు చేసి పితృదేవతలను తృప్తిపరిచి వారి ఆశీస్సులు అందుకోవడం శుభప్రదమని విశ్వసిస్తారు. మొదటిరోజు హిరణ్య శ్రాద్ధం తొమ్మిదోరోజు అన్నశ్రాద్ధం. పన్నెండో రోజు ఆమ శ్రాద్ధం చేయడం మంచిదని పురాణాల్లో పేర్కొన్నారు.

పుష్కరకాల స్నానం..

నీరు నారాయణ స్వరూపం. అందుకే ఆయన స్పర్శతో పాపాలు తొలగిపోతాయని విశ్వాసం. తీర్థ, నదీస్నానాలు ఉత్తమం. దానికన్నా పుష్కరస్నానం ఉత్తమోత్తమం. ఆ సమయంలో దేవతలంతా పుష్కరుడితో నదిలో ప్రవేశిస్తారని విశ్వాసం. పుష్కరకాలంలో స్నానమాచరిస్తే 12 సంవత్సరాల కాలం 12 నదుల్లో స్నానాలు చేసినంత పుణ్యం లభిస్తుందని పురాణాల్లో లిఖించబడింది.

నదికి వాయినాలు..

సుమంగళిగా జీవితాంతం ఉండాలని కోరుకుంటూ ఆడపడచులు పుష్కరాల సందర్భంగా నదీమతల్లికి వాయనాలు సమర్పిస్తారు. ఇలా చేస్తే విఘ్నాలు తొలగి శుభాలు కలుగుతాయని విశ్వాసం, చీర, రవిక, గాజులు, పసుపు, కుంకుమ, పుస్తె, మెట్టెలను పూజించి నదిలోకి జారవిడుస్తారు. ముత్తైదువులకు వాయినాలు ఇచ్చి ఆశీస్సులు అందుకుంటారు.

12 రోజులు హెూమాలు..

మే 15 గురువారం శ్రీ దత్తా త్రేయ, శ్రీ కార్తవీర్యార్జున హెూమం, 16న శుక్రవారం సంకష్ట హర గణపతి హెూమం, 17న శనివారం శ్రీ హయగ్రీవ, శ్రీ స్వయంవర పార్వతి హెూమం, 18న ఆదివారం శ్రీ పుత్ర కామేష్టి హెూమం జరిగాయి. నేడు మేధా దక్షిణామూర్తి మహా అమృత మృత్యుంజయ హెూమం, మంగళవారం కాలభైరవ హెూమం, బుధవారం సుదర్శన హెూమం, గురువారం శ్రీ సూక్త హెూమం, శుక్ర వారం పురుష సూక్త హెూమం, శనివారం నవగ్రహ, శ్రీ మత్స్య హెూమం, ఆదివారం శ్రీ రుద్రహెూమం, 26, సోమవారం చండి హెూమాలు నిర్వహించనున్నట్లు ఈఓ పేర్కొన్నారు.

12 రోజులు హారతి..

12 రోజులపాటు సరస్వతిఘాట్ వద్ద కాశీకి చెందిన ఏడుగురు పండితులచే తొమ్మిది నవ రత్నమాలిక హారతులను ఇస్తున్నారు. హారతి వీక్షణకు భక్తులు భారీగా తరలివస్తున్నారు. హారతి ఇవ్వడానికి ఏడు గద్దెలు ఏర్పాటు చేసి ఏడు జీవనదులు గంగా, యమున, గోదావరి, నర్మద, సింధు, సరస్వతి, కావేరి పేర్లు ఏర్పాటు చేశారు.

పీఠాధిపతుల పుష్కర స్నానాలు..

పుష్కరాల సందర్భంగా ప్రతిరోజూ ఒక పీఠాధిపతి పుష్కర స్నానం చేస్తున్నారు. పుష్కర ప్రారంభం మే 15న మొదటి రోజు శ్రీ గురుమద నానంద సరస్వతి పీఠం, రంగంపేట, మెదక్‌కు చెందిన మాధవానంద సరస్వతి స్వామి పాల్గొని సరస్వతి పుష్కరాలను ప్రారంభించారు. మూడవ రోజు మే 17న తుని తపోవనం పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామి, మే 18న పుష్పగిరి పీఠాధిపతి అభినవోద్దండ విద్యా శంకరభారతీ మహాస్వామి, నేడు నాసిక్ త్రయంబకేశ్వర్ మహామండలేశ్వర్ ఆచార్య సంవిదానంద సరస్వతి మహారాజ్, మే 23న హంపి విరుపాక్ష పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామివార్లు పుష్కర స్నానం ఆచరిస్తారు.

17 అడుగుల ఏకశిల


సరస్వతిమాత విగ్రహంసరస్వతి ఘాటులో 17 అడుగుల ఏకశిలా విగ్రహాన్ని తమిళనాడులోని మహాబలిపురంలో శిల్పులు ప్రత్యేకంగా రూపు దిద్దారు. ఆ విగ్రహం చుట్టూరా నాలుగు వేదమూర్తులయిన రుగ్వేదం, సామవేదం, యజుర్వేదం, అధర్వవేదం విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఆ విగ్రహాన్ని సరస్వతినది పుష్కరాల సందర్భంగా 15న సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు.

# సముద్రగర్భంలో పెను విస్ఫోటం!

## బద్దలయ్యేందుకు సిద్ధంగా ఉన్న అగ్నిపర్వతం

## పసిఫిక్‌లో అత్యంత క్రియాశీలకంగా 'సీమౌంట్'

## గతంలో పేలినప్పుడు ఏకంగా 10,000 భూకంపాలు



అగ్నిపర్వతం బద్దలైనప్పుడు నిప్పులు చిమ్ముతూ లావా నింగిలోకి ఎగసిపడటం, విపరీతంగా ధూళి సమీప గ్రామాలపై దుమ్ము దుప్పటి కప్పేయడం టీవీల్లో చూసే ఉంటారు. వీటికి పూర్తిభిన్నమైన అగ్నిపర్వతం అతి త్వరలో బద్దలుకానుందని ఖగోళ శాస్త్రవేత్తలు ప్రకటించారు. అమెరికాలోని ఒరెగాన్ రాష్ట్రంలోని ఆస్టోరియా నగర తీరానికి 300 మైళ్ల దూరంలో పసిఫిక్ మహాసముద్రం లోపల ఈ అగ్నిపర్వతం దాగి ఉంది. దీని పేరు యాక్సియల్ సీమౌంట్. భూ ఉపరితలం మీద కాకుండా పసిఫిక్ మహాసముద్రం ఉపరితలానికి 1.4 కిలోమీటర్ల లోతులో ఉండటమే ఈ అగ్నిపర్వతం ప్రత్యేకత.

### ఎందుకంత ప్రత్యేకత?

ఈ అగ్నిపర్వతం రెండు భూ పలకలు ఢీకొనే చోట ఏర్పడింది. పసిఫిక్ భూ పలక, జువాన్ డీ ఫ్యూకా భూ పలకలు తరచూ అత్యంత స్వల్పంగా కదులుతుంటాయి. ఈ క్రమంలో ఇవి పరస్పరం తగులుతూ భూమి ఉపరితల పొరల కదలికలకు కారణం అవుతున్నాయి. వీటి సమీపంలో ఉన్న ఈ అగ్నిపర్వతం త్వరలో బద్దలయ్యే అవకాశం ఉందని శాస్త్రవేత్తల తాజా అధ్యయనంలో తేలింది. ఒరెగాన్ స్టేట్ యూనివర్సిటీలోని హ్యాట్‌ఫీల్డ్ మెరైన్ సైన్స్ సెంటర్‌లో పరిశోధకుడైన బిల్ చాడ్విక్ ఈ వివరాలను వెల్లడించారు. "భూకేంద్రంలో ద్రవరూపంలోని శిలలు అగ్నిపర్వతం ద్వారా బయటకు వస్తాయి. ఈ శిలాద్రవం (మాగ్మా) వెంటనే సముద్ర జలాలకు తగిలి చల్లబడుతుంది. ఈ క్రమంలో అక్కడి సముద్ర జలాలు వేడెక్కుతాయి" అని చాడ్విక్ చెప్పారు. వేల కొద్దీ భూకంపాలు! "అగ్నిపర్వతం ఎత్తు కేవలం 3,300 అడుగులు. కానీ అత్యంత క్రియాశీలంగా తయారైంది. ఇటీవలికాలంలో శిలాద్రవం బయటికొచ్చే అవకాశాలు ఎక్కువయ్యాయి. భూమి కంపిస్తోంది. అగ్నిపర్వతం తాజా స్థితిని తెల్సుకునేందుకు మేం సమీప ప్రాంతం దాకా కేబుల్ వ్యవస్థ ద్వారా భూకంప తీవ్రతలను కనిపెట్టే ఏర్పాట్లుచేశాం" అని ఆయన చెప్పారు. " అగ్నిపర్వతం బద్దలయ్యే ముందు భూమి వందల సార్లు కంపిస్తుంది. ఇక అగ్నిపర్వతం బద్దలైన సందర్భాల్లో వేల సార్లు కంపిస్తుంది. 2015 ఏప్రిల్‌లో చివరిసారిగా అగ్నిపర్వతం బద్దలైంది. అప్పుడు విపరీతంగా శిలాద్రవం బయటకు ఎగజిమ్మింది. అప్పుడు 24 గంటల వ్యవధిలో ఈ ప్రాంతంలో 10,000 చిన్నపాటి భూకంపాలు వచ్చాయి. ఈసారి కూడా అదే స్థాయిలో భూమి కంపించే వీలుంది" అని 'యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్ స్కూల్ ఆఫ్ ఓషనోగ్రఫీ'లో మెరైన్ జియోఫిజిసిస్ట్, ప్రొఫెసర్ విలియం విల్‌కుక్ స్పష్టంచేశారు. జీవవైవిధ్యానికి బాసట అగ్నిపర్వతం బద్దలైనప్పుడు భారీ స్థాయిలో శిలాద్రవం మహాసముద్రజలాల్లో కలిసిపోతుంది. ఈ శిలాద్రవంలో ఎన్నో రకాల మూలకాలు ద్రవరూపంలో ఉంటాయి. ఇవన్నీ సముద్రజలాల్లో సమ్మిళితమై అక్కడి సూక్ష్మజీవులకు ఆహారంగా మారతాయి. ఈ సూక్ష్మజీవులపై ఆధారపడిన చిన్న జలచరాలు, వాటిని ఆహారం తీసుకునే చేపలు.. ఇలా ఆహార చక్రం సదా సవ్యంగా కొనసాగేందుకు అగ్నిపర్వతం పరోక్షంగా సాయపడుతోంది. అత్యంత వేడితో సెగలు కక్కే మాగ్మా సముద్ర ఉపరితలానికి ఎగసిపడగానే అక్కడ జీవులు కొన్ని చనిపోయినా తర్వాత మాత్రం అక్కడ జీవరాశి పెరుగుదలకు దోహదపడుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సముద్రంలో జీవం మనుగడకు అగ్నిపర్వతాలు సైతం తమ వంతు సాయం చేస్తున్నాయని యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్‌లో మెరైన్ జియోలజీ, జియోఫిజిక్స్ విభాగ ప్రొఫెసర్ డెబీ కెల్లీ వ్యాఖ్యానించారు.

# విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లకు కారణాలు ఇవే..


**పాత వైరింగ్.. సామర్థ్యానికి మించి ఎలక్ట్రిక్ పరికరాలు**

**ఒకే సాకెట్ నుంచి రెండు మూడు ఏసీలకు కనెక్షన్లు**

**ఓవర్ లోడు కారణంగా తలెత్తుతున్న షార్ట్ సర్క్యూట్‌లు**

**మొన్న అఫ్జల్‌గంజ్‌లోని మూడంతస్తుల రెసిడెన్షియల్ బిల్డింగ్‌లో..**

**గుల్జార్‌హౌస్, మైలార్‌దేవ్‌పల్లి నివాస భవనాల్లో అగ్ని ప్రమాదాలు**



నిర్దేశిత లోడు కంటే ఎక్కువ కరెంట్‌ను వినియోగించడం.. ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన అంతర్గత కేబుళ్లను ఇప్పటికీ మార్చక పోవడం.. కేబుల్ సామర్థ్యానికి మించి ఎలక్ట్రికల్ పరికరాలు వాడటం.. వైర్ల మధ్య జాయింట్లు ఎక్కువగా ఉండటం.. సరఫరాలో హెచ్చుతగ్గుల సమస్య తలెత్తుతుండటం.. ఏసీలు, కూలర్లు, రిఫ్రిజిరేటర్లు, గీజర్లు, వాషింగ్ మెషీన్లు, మిక్సీలు, ఒవెన్‌లు, ఐరన్ బాక్సులు, కంప్యూటర్లు, టీవీలు, ఫ్యాన్లు, లైట్లు రోజంతా ఆన్‌లోనే ఉంచడం.. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లు సంభవించడానికి ఇవే కారణాలు. వీటివల్లనే కేబుళ్లు హీటెక్కి, మీటర్, జాయింట్ల వద్ద నిప్పు రవ్వలు (స్పార్క్‌లు) చెలరేగుతున్నాయి. ఇలా విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌ల ఫలితంగా మాల్స్, దుకాణాలు, ఇళ్లలో అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి. పెద్దయెత్తున ఆస్తి నష్టం జరుగుతోంది. కొన్ని ఘటనల్లో అగ్నికీలల్లో చిక్కు కోవడం, పొగతో ఊపిరాడకపోవడం లాంటి కారణాలతో పలువురు ప్రాణాలు సైతం కోల్పోతున్నారు. హైదరాబాద్‌లో తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎప్పటికప్పుడు లైన్లు, వైర్లు, ప్లగ్ లు, ఎంసీబీలు, ఎర్త్‌రాడ్‌ల పని తీరును పరిశీలించి, దెబ్బతిన్న కేబుళ్లను గుర్తించి, వాటి స్థానంలో కొత్తవి అమర్చుకోవాల్సి ఉన్నా వాణిజ్య, గృహ వినియోగదా రులు పట్టించుకోవడం లేదు. పాతబస్తీలోని పురాతన భవనాల్లోనే కాకుండా, కొత్తగా సీఈఐజీ అనుమతి పొందిన హైరైజ్ భవనాల్లోనూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లు జరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

### పాతబస్తీ అయినా.. కొత్త హైరైజ్‌లైనా

పాతబస్తీలో ఏళ్ల క్రితం నిర్మించిన భవనాల్లోనే కాదు గచ్చిబౌలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కోకాపేట్, నార్సింగి, మణికొండ, నానక్‌రాంగూడల్లో కొత్తగా నిర్మించే హైరైజ్ బిల్డింగ్స్‌లోనూ విద్యుత్ లైన్లు సరిగా ఉండటం లేదు. భవిష్యత్తు అవసరాల మేరకు లోడు ఎంపిక మొదలు..లైన్ల ఏర్పాటు వరకు అన్నీ లోపభూయిష్టంగానే ఉంటున్నాయి. భవన నిర్మాణ సమయంలో ఉన్న ఆలోచనకు, అవసరాలకు భిన్నంగా ఆ తర్వాత ఇంట్లోకి అనేక విద్యుత్ పరికరాలు వచ్చి చేరుతున్నాయి. వాణిజ్య భవనాల్లో తక్కువ సామర్థ్యంతో లైన్లు, కేబుళ్లు వేయడం జరుగుతోంది. నిర్మాణ ఖర్చులు తగ్గించుకునే క్రమంలో కనీస అనుభవం, అర్హత లేని ప్రైవేటు విద్యుత్ కాంట్రాక్టర్లతో విద్యుత్ పనులు చేయిస్తున్నారు. వీరు భవిష్యత్తు అవసరాలను పరిగణనలోకి తీసుకోకుండా కేవలం తాత్కాలిక అవసరం కోసం లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. నాసిరకం కేబుళ్లు, ఏబీ స్విచ్‌లు, ఎంసీబీలు వాడుతున్నారు. కంటికి కన్పించే ప్లగ్‌లు, స్విచ్ బోర్డులు, లైట్లు మినహా గోడలు, స్లాబులో వాడే వైర్లు నాసిరకంగా ఉంటున్నాయి. సరైన ఎర్తింగ్ ఉండటం లేదు. మరోవైపు ఒకే ప్లగ్/ వైరు నుంచి మల్టిపుల్ కనెక్షన్లు ఇస్తున్నారు. ఒకే సాకెట్ నుంచి ఒకటికి మించిన ఏసీ కనెక్షన్లు ఉంటున్నాయి. ఇలా సామర్థ్యానికి మించి ఏసీలు, వాషింగ్ మెషీన్లు, గీజర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు విద్యుత్ ఎక్కువగా వినియోగించడం వల్ల బలహీనంగా ఉన్న కేబుళ్లు తట్టుకోలేకపోతున్నాయి. కేబుళ్ల జాయింట్ల వద్ద స్పార్క్‌లు చెలరేగుతున్నాయి.

### పేలుతున్న ఏసీ కంప్రెషర్లు

ఒకప్పుడు ధనవంతుల ఇళ్లల్లో మాత్రమే కన్పించే ఏసీలు, కూలర్లు, వాషింగ్ మెషీన్లు, గీజర్లు.. ప్రస్తుతం సాధారణ మధ్య తరగతి ప్రజల ఇళ్లలోనూ దర్శనమిస్తున్నాయి. మారుతున్న జీవనశైలి ఇందుకు దోహదపడుతోంది. ప్రతిఒక్కరూ సౌకర్యాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. అందుకు తగినట్టుగా తయారీ కంపెనీలతో పాటు పలు బ్యాంకులు జీరో వడ్డీ రుణాలు ఇస్తున్నాయి. వాయిదా పద్ధతుల్లో చెల్లించే అవకాశం కల్పిస్తున్నాయి. దీంతో సాధారణ ప్రజలు కూడా విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలను కొనుగోలు చేస్తున్నారు. హైదరాబాద్‌లోని చాలాచోట్ల 60 నుంచి 100 గజాల స్థలంలోనూ ఐదారు అంతస్తుల్లో భవనాలు నిర్మిస్తున్నారు. కొందరు కింద షాపులను ఏర్పాటు చేసి, పైన నివాసానికి వీలుగా చిన్న చిన్న గదులను నిర్మిస్తున్నారు. నివాసితులు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలతో పాటు ఏసీలూ వినియోగిస్తున్నారు. ఒక ఇంట్లోనే రెండు, మూడు ఏసీలు ఉంటున్నాయి. అయితే ఇరుకు గదుల్లో గాలి, వెలుతురు కూడా సరిగా ఉండటం లేదు. వైరింగ్ సరిగా లేకపోవడం, సామర్థ్యానికి మించి కరెంటు వాడటం, మండే ఎండల్లో రోజంతా ఏసీలు ఆన్‌లో ఉంటుండటం వల్ల కంప్రెషర్లు పేలిపోతున్నాయి.

### బయటకు రాలేక, మంటల్లో చిక్కుకుని..

కిటికీ, డోర్ కర్టెన్లు, పరుపులు, దుస్తువులకు నిప్పు అంటుకుని వేగంగా మంటలు వ్యాపిస్తున్నాయి. ఆ సమయంలో బయటికి వెళ్లేందుకు ఇరుకైన దారి ఉండటం, తలుపులకు తాళాలు వేసి ఉండటం, ఇతరత్రా కారణాలతో బయటకు వెళ్లలేక కొన్ని సందర్భాల్లో ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోంది. మొన్న అఫ్జల్‌గంజ్‌లోని మూడంతస్తుల భవనం, తాజాగా చార్మినార్ సమీపంలోని గుల్జార్‌హౌస్, మైలార్‌దేవ్‌పల్లిలో జరిగిన అగ్ని ప్రమాదాలకు ఇలాంటి పరిస్థితులే కారణమని స్పష్టమవుతోంది.

### ఇలా చేస్తే సేఫ్...

బీఐఎస్ ప్రమాణాలతో తయారు చేసిన ఎలక్ట్రిక్ ఉపకరణాలనే భవనాల్లో ఉపయోగించాలి. విద్యుత్ మరమ్మతులు క్వాలిఫైడ్ ఎలక్ట్రీషియన్‌తో మాత్రమే చేయించాలి. అతుకుల తీగలు, లూజ్ వైరింగ్ ప్రమాదకరం. విద్యుత్ ద్వారా నడిచే రిఫ్రిజిరేటర్, ఓవెన్లను గాలి, వెలుతురు బాగా వచ్చే చోట ఉంచాలి. అధిక ఓల్టేజీ ఉన్న ఉపకరణాలకు ఎర్తింగ్ ఉన్న 3 పిన్ సాకెట్లను వాడాలి. ల్యాప్‌టాప్, మొబైల్ చార్జింగ్ బెడ్ దగ్గర పెట్టకూడదు. విద్యుత్ పరికరాలకు నిప్పు అంటుకుంటే నీళ్లతో ఆర్పవద్దు. దీని వల్ల కరెంట్ షాక్ తగిలి ప్రాణాపాయం కలగొచ్చు. వెంటనే విద్యుత్‌ను ఆఫ్‌చేసి, పొడి ఇసుకతో లేదా కార్బన్ డయాక్సైడ్ ఎక్స్టింగ్విషర్‌తో మంటలను ఆర్పాలి.

సాయి సూర్య తెలుగు దిన పత్రిక
www.saisuryaa.com


సంపాదకీయం

# ముక్కలు కానున్న పాకిస్థాన్!

## (విశ్లేషణ)

భారతదేశం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో బెంబేలెత్తిపోతున్న పాకిస్తాన్‌కు నైరుతి ప్రాంతంలో బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ(బిఎల్ఎ) నుంచి కొత్త చిక్కులు వచ్చిపడుతున్నాయి. గత కొన్నేళ్లుగా స్వయంపాలన కోసం పోరాడుతున్న బలూచిస్థాన్ తిరుగుబాటుదారులు అదను చూసి మరీ పాక్ సైన్యంపై దాడులను ఉధృతం చేస్తున్నారు. తాడోపేడో తేల్చుకోవడానికి ఇదే తగిన సమయమని భావించినవారు మరో అడుగు ముందుకువేసి తమ ప్రాంతాన్ని బలూచిస్థాన్ రిపబ్లిక్‌గా ప్రకటించుకున్నారు. పోరాటయోధుడు మిర్ యార్ బలూచ్ నేతృత్వంలో బలూచిస్థాన్ నేతలు ఈ నెల 9న పాకిస్తాన్ నుంచి స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నారు. అంతేకాకుండా పాక్‌పై భారత్ చేస్తున్న దాడులకు సంపూర్ణ మద్దతు ప్రకటించడంతో పాటుగా ఆ పోరాటానికి అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. మరో వైపు బలూచిస్థాన్ రిపబ్లిక్‌ను స్వతంత్ర దేశంగా గుర్తించాలని, తమ దేశాల్లో బలూచిస్థాన్ దౌత్య కార్యాలయాలను ఏర్పాటు చేసుకోవడానికి అనుమతించాలని ఐక్యరాజ్యసమితితో పాటుగా అన్ని ప్రపంచ దేశాలకు వారు విజ్ఞప్తి చేశారు కూడా. చూడడానికి ఇది ఓ మామూలు ప్రకటనగా కనిపిస్తున్నప్పటికీ దీని ప్రభావం పాకిస్తాన్ సుస్థిరతపైనా, అలాగే దక్షిణాసియా భౌగోళిక పరిస్థితులపైనా తీవ్ర ప్రభావం చూపించనుంది. ఎందుకంటే భౌగోళికంగా పాకిస్తాన్‌లో అతిపెద్ద ప్రావియన్స్ అయిన బలూచిస్థాన్ గత కొన్ని దశాబ్దాలుగా అశాంతికి నిలయంగా కొనసాగుతోంది. పాకిస్తాన్ ఫెడరల్ ప్రభుత్వం తమ వనరులను దోచుకుంటూ తమ ప్రాంత అభివృద్ధిని పట్టించుకోవడం లేదని, ఇక్కడి ప్రజలను నిరుపేదలుగా మారుస్తోందని స్థానికులు చాలా కాలంగా ఆరోపిస్తున్నారు. అందుకే తమకు స్వయం పాలనాధికారం కావాలంటూ అక్కడి వారు పోరాటం చేస్తున్నారు. అంతేకాదు ఆ ప్రాంతంలో బలవంతపు కిడ్నాప్‌లు, చట్ట వ్యతిరేక హత్యలు లాంటివి ఇటీవలి కాలంలో ఈ ప్రాంతంలో పెచ్చుమీరిపోయాయని అంతర్జాతీయ మానవ హక్కుల సంఘాల నివేదికలు చెబుతున్నాయి. వీటన్నిటినీ భరించలేని తిరుగుబాటుదారులు బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బిఎల్ఎ) పేరిట గత కొంత కాలంగా పాకిస్తాన్ సైన్యమే లక్షంగా దాడులు కొనసాగిస్తున్నారు. వీలు చిక్కినప్పుడల్లా పెద్ద సంఖ్యలో పాక్ సైనికులను మట్టుబెడుతూ పాక్ ఫెడరల్ ప్రభుత్వానికి పక్కలో బల్లెంలా తయారయ్యారు. గత మార్చిలో క్వెట్టానుంచి పెషావర్‌కు 400 మంది ప్రయాణికులతో వెళ్తున్న రైలును బిఎల్ఎ తిరుగుబాటుదారులు హైజాక్ చేయడం వారి ఉద్యమంలో ఓ మైలురాయిగా నిలిచిపోయింది. ప్రయాణికులను విడిపించడానికి పాక్ సైన్యం బ్రహ్మప్రయత్నమే చేయాల్సి వచ్చింది. పాక్ ప్రభుత్వం నిషేధిత ఉగ్రవాద సంస్థగా ముద్రవేసిన బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ పాకిస్తాన్‌లోని బలూచీ గిరిజన జాతుల విమోచన కోసం పోరాడుతోంది. పాకిస్తాన్‌లోని సింధీలు, పంజాబీలు నివసించే ప్రాంతాలు కొంత మేరకు అభివృద్ధి చెందినప్పటికీ వైశాల్యపరంగా దేశంలోనే అతిపెద్ద రాష్ట్రమైన బలూచీస్థాన్ మాత్రం ఇప్పటికీ అత్యంత వెనుకబడిన ప్రాంతంగానే ఉంది. రాష్ట్రంలో అపారంగాఉన్న అరుదైన ఖనిజాలు, చమురు, సహజ వాయు నిక్షేపాలు లాంటి వాటిని తరలించుకుపోతున్న ఇస్లామాబాద్ ప్రభుత్వం ఈ ప్రాంత అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోవడం లేదనే అసంతృప్తి స్థానిక ప్రజల్లో చాలా కాలంగా గూడుకట్టుకుని ఉంది. దీంతో ఈ ప్రాంతంలో చాలా కాలంగా తిరుగుబాటు ఉద్యమాలు బలపడ్డాయి. 2007లో బాలాచ్ మర్రి నాయకత్వంలో ఏర్పడిన బలూచీస్థాన్ లిబరేషన్ ఆర్మీ ఇటీవలి కాలంలో బలమైన సంస్థగా ఎదిగింది. ఇటీవలి కాలంలో బిఎల్ఎ 70కి పైగా ప్రధాన దాడులు జరిపినట్లు అంచనా. తాజాగా ఓ వైపు ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత్ పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు కొనసాగిస్తున్న తరుణంలో పలు తిరుగుబాటు గ్రూపులు మూకుమ్మడిగా పాక్ సైన్యంపై పెద్ద ఎత్తున దాడి చేసి 16 మంది సైనికులను హతమార్చాయి. బలూచిస్థాన్‌లోని ప్రధాన నగరమైన క్వెట్టా ఇప్పుడు తిరుగుబాటుదారుల అధీనంలో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే బిఎల్ఎ పాకిస్థాన్ నుంచి విడిపోయి కొత్త దేశాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు చేసిన ప్రకటన సంచలనం సృష్టిస్తోంది. తమకు మద్దతు ఇవ్వాల్సిందిగా ఆ సంస్థ కోరడం భారత ప్రభుత్వానికి కొంత సంకట పరిస్థితిని తెచ్చిపెట్టిందనే చెప్పాలి. ప్రత్యేక బలూచిస్థాన్ ఏర్పాటు డిమాండ్‌ను సమర్థించినట్లయితే దౌత్యపరంగా అది పాక్‌ను మరింతగా బలహీనపరిచినట్లవుతుంది. కానీ ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగిపోవడానికి కారణమవుతుంది. అందుకే ఈ విషయంలో భారత్ మౌనంగా ఉండడం మంచి వ్యూహమేనని చెప్పాలి. మరో వైపు చైనా వేల కోట్ల డాలర్ల పెట్టుబడులు పెడుతున్న గ్వాడార్ పోర్టు, చైనాపాక్ ఆర్థిక కారిడార్ (సిపిఇసి) బలూచిస్థాన్ ప్రాంతంలోనే ఉన్నాయి. అయితే స్వతంత్ర బలూచిస్థాన్‌ను ఏర్పాటు చేసుకుంటున్నట్లుగా తిరుగుబాటుదారులు చేసిన ప్రకటనకు ప్రపంచ దేశాల నుంచి ప్రస్తుతానికి ఎలాంటి మద్దతూ లభించకపోయినప్పటికీ తమ ఉద్యమం ఆగిపోదని, మరింత బలపడుతుందనే సందేశాన్ని మాత్రం అది ఇచ్చింది. ఒకవేళ భారతదేశం డిమాండ్ చేస్తున్నట్లుగా పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను తిరిగి అప్పగించడంతోపాటుగా అటు బలూచిస్థాన్‌ను కూడా కోల్పోవలసి వచ్చినట్లయితే పాక్ ముక్కలయినట్లేనని చెప్పాలి. తమ హక్కులకోసం బలూచీలు చేస్తున్న పోరాటం న్యాయమైనదే అయినప్పటికీ వారు ఎంచుకున్న మార్గం అంత సులువైనది, ఇప్పటికిప్పుడు నెరవేరేది మాత్రం కాదనేది రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం. ఒకవేళ తిరుగుబాటుదారులు తమ పోరాటంలో విజయం సాధించడమే జరిగితే దక్షిణాసియా భౌగోళిక స్వరూపమే మారిపోవడం ఖాయం.

# ఫలిస్తున్న మోదీ ప్రభుత్వ ప్రయత్నాలు..
# ప్రపంచంలో 4వ అతిపెద్ద దేశంగా భారత్!



భారత ప్రభుత్వం అనేక రంగాలపై ఏకకాలంలో పనిచేస్తోంది. దేశ ఆర్థిక వ్యవస్థను పెంచడానికి తయారీ రంగానికి ప్రాధాన్యత ఉన్న చోట ప్రోత్సహిస్తోంది. మరోవైపు, ఎగుమతులను పెంచడంపై ప్రభుత్వం వేగంగా కృషి చేస్తోంది. అటువంటి పరిస్థితిలో, ప్రభుత్వం పడిన కష్టానికి ఇప్పుడు ఫలితం దక్కుతున్నట్లు కనిపిస్తోంది. ఇప్పుడు, ఎగుమతులకు సంబంధించి భారతదేశానికి వచ్చిన వార్తలను బట్టి, ప్రపంచ స్థాయిలో భారతదేశం తన బలాన్ని అమాంతం పెంచుకుంటోంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, భారతదేశం ఇప్పుడు సముద్ర ఉత్పత్తుల ఎగుమతి పరంగా ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద దేశంగా అవతరించింది. భారతదేశం ఇప్పుడు సముద్ర ఉత్పత్తుల ఎగుమతిదారులలో నాల్గవ అతిపెద్దదిగా అవతరించింది. 2014-15లో 105 దేశాలు భారతీయ సముద్ర ఉత్పత్తులను దిగుమతి చేసుకోగా, 2025 ఆర్థిక సంవత్సరంలో 130 దేశాలు పెరిగాయని వాణిజ్యం, పరిశ్రమల మంత్రిత్వ శాఖ తెలిపింది. 2024-25లో, భారతదేశం 16.85 లక్షల మెట్రిక్ టన్నుల సముద్ర ఉత్పత్తులను ఎగుమతి చేయగా, 2014-15లో ఇది 10.51 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉంది. ఆక్వాకల్చర్ పద్ధతుల్లో పురోగతి, మెరుగైన కోల్డ్ చైన్ మౌలిక సదుపాయాలు, అంతర్జాతీయ నాణ్యత నిబంధనలకు కట్టుబడి ఉంది. దీంతో దేశ సముద్ర ఎగుమతులు 2015 ఆర్థిక సంవత్సరంలో %వి%5.4 బిలియన్ల నుండి 2024-25 నాటికి %వి%7.2 బిలియన్లకు పెరుగుతాయని భావిస్తున్నారు. ఈ విస్తరణ భారతీయ సముద్ర ఉత్పత్తులకు పెరుగుతున్న ప్రపంచవ్యాప్తంగా డిమాండ్‌ను, అధిక విలువ కలిగిన మార్కెట్లలోకి ప్రవేశించడానికి ఎగుమతిదారులు చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలను ఇస్తున్నాయని ఒక అధికారి తెలిపారు. ఎగుమతి గమ్యస్థానాలు ఈ వైవిధ్యీకరణ మార్కెట్ నష్టాలను తగ్గిస్తుంది. దీర్ఘకాలిక వృద్ధికి అవకాశాలను తెరుస్తుందని ఆయన అన్నారు. సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో భారతదేశం ర్యాంకింగ్ 2014-15లో ఎనిమిదవ స్థానం నుండి నాలుగు స్థానాలు మెరుగుపడింది. ఇది ప్రపంచ మార్కెట్‌లో దాని పెరుగుతున్న పోటీతత్వాన్ని, విశ్వసనీయతను సూచిస్తుంది. గత దశాబ్దంలో భారతదేశ సముద్ర ఎగుమతులు పరిమాణం, విలువ పరంగా బలమైన వృద్ధిని కనబరిచాయని, ప్రపంచ సముద్ర ఆహార వాణిజ్యంలో దేశాన్ని ప్రధాన పాత్రధారిగా నిలబెట్టాయని అధికారి తెలిపారు. ఈ కాలంలో 3.15 శాతం సమ్మేళన వార్షిక వృద్ధి రేటుతో, భారతదేశం ప్రపంచ సగటు వృద్ధి రేటు 2.7 శాతం కంటే ముందుంది, అంతర్జాతీయ మత్స్య రంగంలో దాని వృద్ధి స్థానాన్ని మరింత బలోపేతం చేసింది.

# డోనాల్డ్ ట్రంప్ సర్కార్ మరో సంచలన నిర్ణయం..
# సామాన్య భారతీయుల జేబుకు చిల్లు!





మీరు అమెరికాలో నివసిస్తూ భారతదేశంలోని మీ కుటుంబానికి డబ్బు పంపుతుంటే, ఈ వార్త మిమ్మల్ని దిగ్భ్రాంతికి గురిచేయవచ్చు! NRIలకు అమెరికా మరో బిగ్ షాక్ ఇవ్వబోతుంది. అమెరికా పార్లమెంటులో కొత్త బిల్లు ప్రవేశపెట్టేందుకు సన్నద్ధమవుతోంది డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం. రిపబ్లిక్ పార్టీ కొత్తగా ఒక పన్ను చట్టాన్ని తీసుకురావాలని చూస్తోంది. ఇదే జరిగితే అమెరికాలోని లక్షలాది మంది భారతీయులకు పెద్ద ఎదురుదెబ్బ. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'ది వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్' పేరుతో కొత్త పన్ను చట్టాన్ని తీసుకురావాలని భావిస్తున్నారు. అమెరికాలో ఉన్న విదేశీయులు, ముఖ్యంగా భారతీయులు పంపే నగదు బదిలీలపై 5 శాతం పన్ను విధించాలని ఆయన సూచించారు. ఈ కొత్త రెమిటెన్స్ పన్ను ప్రతిపాదన ప్రస్తుతం అమెరికా ప్రతినిధుల సభలో బిల్లుగా ప్రవేశపెడతారు. ఇది అమల్లోకి వస్తే, అమెరికాలో పనిచేస్తున్న %ఎ%-1బీ వీసాదారులు, గ్రీన్ కార్డు కలిగినవారు, NRI లు తాము పంపే డబ్బుపై 5 శాతం అదనపు భారం మోపాల్సి వస్తుంది. రియల్ ఎస్టేట్, విద్య, వైద్య ఖర్చుల కోసం తమ దేశానికి డబ్బు పంపే NRI లపై భారీగా భారం పడనుంది. అమెరికాలో ఉన్న భారతీయులు.. స్వదేశంలో ఉన్న తమ వారికి 11వందల 60 డాలర్లు అనగా దాదాపు రూ.లక్ష పంపిస్తే, అందులో ఐదు శాతం.. రూ.5వేలను పన్నుగా చెల్లించాలి. హెచ్-1బీ, ఎఫ్-1 లేదా జే-1 వీసాదారులు, గ్రీన్ కార్డుదారులు, తగిన గుర్తింపు పత్రాలు లేనివారు నగదు బదిలీలు చేసినప్పుడు ఈ పన్ను చెల్లించాల్సిందే..! అమెరికా పార్లమెంటులో సమర్పించబోయే ఈ కొత్త బిల్లు 389 పేజీల పొడవు ఉంది. పేజీ నంబర్ 327లో ఒక లైన్ రాసి ఉంది. అమెరికా పౌరుడు కాకపోతే, %ఖూ% వెలుపలకు పంపిన డబ్బుపై 5 శాతం పన్ను విధించడం జరుగుతుంది. ప్రపంచ బ్యాంకు తాజా నివేదిక ప్రకారం, రెమిటెన్స్ రూపంలో అత్యధికంగా ఆదాయం పొందే దేశంగా భారత్ 2008 నుంచి మొదటిస్థానంలో కొనసాగుతోంది. ప్రస్తుత ఏడాది ప్రపంచ మొత్తం రెమిటెన్స్‌లలో 14 శాతం భారత్‌కు వచ్చిందని అంచనా. అమెరికా ప్రభుత్వ నిర్ణయం, లక్షలాది మంది భారతీయ ప్రవాసులకు ఆర్థికంగా కొత్త భారంగా మారే అవకాశముంది. ఇది %చీ=×%లపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుంది. అమెరికాలో దాదాపు 45 లక్షల మంది భారతీయులు నివసిస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది %ఎ-1దీ% లేదా %ూ%-1 వీసాపై, గ్రీన్ కార్డ్ హోల్డర్లు ఉన్నారు. ఈ వ్యక్తులు ప్రతి నెలా ఇంటికి డబ్బు పంపుతారు. కొన్నిసార్లు వారి తల్లిదండ్రుల మందుల కోసం, కొన్నిసార్లు వారి సోదరి, సోదరుల చదువు కోసం, కొన్నిసార్లు ఎవరికైనా వివాహానికి సహాయం చేయడానికి.. ఇలా పంపించే వాటన్నింటిపై ట్రంప్ ప్రభుత్వం పన్ను విధించబోతోంది. 2023-24 సంవత్సరంలో, భారతదేశం అమెరికా నుండి 32 బిలియన్ డాలర్ల రెమిటెన్స్‌ను అందుకుంది. దీనిపై మనం 5% పన్ను విధిస్తే, భారతీయులు ఏటా దాదాపు 1.6 బిలియన్ డాలర్ల అదనపు భారాన్ని మోయవలసి ఉంటుంది. అతి ముఖ్యమైన విషయం ఏమిటంటే, మీరు రూ. 5,000 లేదా రూ. 5 లక్షలు పంపినా, ప్రతి బదిలీపై ఈ పన్ను విధించడం జరుగుతుంది. మే 26 నాటికి అమెరికా ప్రతినిధుల సభలో బిల్లు ఆమోదం పొందేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. జూలై 4 (అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం) నాటికి దీనిని చట్టంగా మార్చడానికి ప్రయత్నాలు జరుగుతాయి. అంటే, అది ఆమోదం పొందితే, జూలై నుండే డబ్బు పంపడంపై 5% పన్ను ప్రారంభమవుతుంది.

# భారత్-పాక్ వివాదంలో దూరాలని
# చూస్తున్న ట్రంప్‌నకు ఇజ్రాయెల్ స్ట్రాంగ్ వార్నింగ్!





మొన్నటిదాకా భారత్-పాక్ గొడవతో తమకేమీ సంబంధం లేదన్న అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్, కాల్పుల విరమణ కాగానే, మాటమార్చారు. ఇదంతా తనవల్లే అంటున్నారు. ట్రంప్ వ్యాఖ్యలను భారత్ ఖండించినా, ఆయన వైఖరిలో మాత్రం మార్పు రాలేదు. క్రెడిట్ కోసం తెగ ఆరాటపడుతున్నారు. ఇటీవల సౌదీలోని రియాద్‌లో జరిగిన ఇన్వెస్ట్‌మెంట్ ఫోరమ్‌లోనూ ట్రంప్ ఇలాగే మాట్లాడారు. భారత్-పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణ తర్వాత, ట్రంప్ ప్రతిచోటా దాని క్రెడిట్ తీసుకుంటున్నారు. తన సౌదీ పర్యటన సమయంలో తన ప్రసంగంలో తనను తాను ప్రశంసించుకున్నాడు. భారత్-పాకిస్తాన్ శాంతికి ఘనతను తీసుకున్నాడు. అంతే కాదు, కాశ్మీర్ సమస్యను పరిష్కరిస్తానని కూడా ట్రంప్ అన్నారు. ఆ తరువాత అతనికి భారత ప్రభుత్వం నుండి తగిన సమాధానం వచ్చింది. అయితే తాజాగా ట్రంప్ తీరుపై అమెరికాకు అత్యంత సన్నిహిత మిత్రుడు ఇజ్రాయెల్ తిరస్కరిస్తోంది. ట్రంప్ శాంతికర్తగా ఉండటానికి ఆసక్తిగా ఉన్నారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధం, హౌతీలు-సిరియా, భారత్-పాకిస్తాన్‌లో శాంతి కోసం అనేక ఒప్పందాలు, చర్చలు జరుగుతున్నాయి. హమాస్-ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ తీసుకురావడానికి ఆయన హమాస్‌తో ప్రత్యక్ష చర్చలు కూడా ప్రారంభించారు. ఈ నేపథ్యంలోనే ట్రంప్ తీరుపై ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి నెతన్యాహు ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికాకు స్పష్టమైన సందేశం ఇచ్చారు. కాల్పుల విరమణకు మధ్యవర్తిత్వం వహించడానికి అమెరికా నిరంతర ప్రయత్నాల తర్వాత, ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు గాజాలో ఇజ్రాయెల్ తన యుద్ధాన్ని ఆపడానికి "ఎటువంటి మార్గం" లేదని అన్నారు. బందీలను విడుదల చేయడానికి ఒప్పందం కుదిరినప్పటికీ, హమాస్ అంతమయ్యే వరకు తన ప్రచారం కొనసాగుతుందని ఆయన అన్నారు. ట్రంప్ మధ్యప్రాచ్యానికి వచ్చిన రోజున గాజాలోని రెండు ఆసుపత్రులపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేసింది. ఇందులో కనీసం ఎనిమిది మంది మరణించారు. డజన్ల కొద్దీ గాయపడ్డారు. నెతన్యాహు వ్యాఖ్యలు కాల్పుల విరమణ చర్చలను క్లిష్టతరం చేసే అవకాశం ఉంది. సోమవారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు హమాస్ చేసిన సంజ్ఞ ద్వారా ఈ చర్చలు పునరుద్ధరించారు. హమాస్ అమెరికన్ బందీలను విడుదల చేసినప్పుడు మాత్రమే ముందడుగు పడనుంది. ట్రంప్ ప్రస్తుతం మధ్యప్రాచ్య పర్యటనలో ఉన్నారు. తన పేరుకు మరో కాల్పుల విరమణను క్రెడిట్ తీసుకోవాలని ఆశిస్తున్నారు. అదే సమయంలో, నెతన్యాహు వైఖరి ఆయనకు, ట్రంప్ కు మధ్య పెరుగుతున్న అంతరాన్ని సూచిస్తుంది. ఈ పరిణామాలను చూస్తుంటే, అమెరికా-ఇజ్రాయెల్‌కు ఈ విధంగా సహాయం చేస్తూనే ఉంటుందా లేదా దానిలో కోత విధిస్తుందా అనేది ఆసక్తికరంగా మారింది.


# సినిమా చిత్రం

## 'మరణమాస్' టాక్: ఓటీటీ రెస్పాన్స్ ఎలా ఉంది?




ట్రైలర్ తోనే పాజిటివ్ బజ్ క్రియేట్ చేసిన మలయాళ సినిమా 'మరణమాస్'. ఇటీవల **OTT** సోనీ లివ్ లో స్ట్రీమింగ్ కు వచ్చేసింది. శివ ప్రసాద్ డైరెక్షన్‌లో రూపొందిన ఈ డార్క్ కామెడీ, కేరళలో ఒక నైట్ బస్సులో జరిగే అనూహ్య సంఘటనల చుట్టూ తిరుగుతుంది. బనానా కిల్లర్‌గా పిలిచే ఓ సీరియల్ కిల్లర్, స్థానిక ట్రబుల్‌మేకర్ లూక్ (బాసిల్ జోసెఫ్), అతని గర్ల్‌ఫ్రెండ్ జెస్సీ (అనిష్మ అనిల్‌కుమార్)తో సహా పలు పాత్రలు ఈ బస్సు ప్రయాణంలో చిక్కుకుంటాయి. సినిమా కథలో లూక్, ఓ వృద్ధుడి మరణంతో బస్సులో చిక్కుకుని, అనుమానిత కిల్లర్‌తో కలిసి ఈ రాత్రిని ఎలా గడుపుతాడనేది ఆసక్తికరంగా సాగుతుంది. బాసిల్ జోసెఫ్ తన డిఫరెంట్ పాత్రలో అద్భుతంగా నటించాడని, అతని కామెడీ టైమింగ్ సినిమాకు ప్లస్ అయ్యిందని ప్రేక్షకులు చెబుతున్నారు. అనిష్మ అనిల్‌కుమార్ కూడా జెస్సీగా తన వైబ్రంట్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకుంది. సిజు సన్నీ, రాజేష్ మాధవన్ పాత్రలు కూడా బాగున్నా యని, కానీ బాబు ఆంటోనీ పాత్రను మరింత బాగా ఉపయోగిం చుకోవచ్చని కొందరు అభిప్రాయ పడ్డారు. ట్రైలర్ లోనే హైలైట్ అయిన డార్క్ హ్యూమర్, సినిమా లో కూడా ప్రేక్షకులను నవ్విం చింది. ఈ సినిమా సీరియస్‌గా కనిపించే అంశా లను కూడా కామికల్‌గా చూపించడం బాగుంది, ముఖ్యంగా బస్సు జర్నీలో మధ్య భాగం ఆసక్తి కరంగా సాగింది అని నెటిజన్లు అంటున్నారు. నీరజ్ రెవి వైబ్రంట్ విజువల్స్, జెకె సంగీతం సినిమా క్విర్కీ టోన్‌కు సరిపోయాయని, కానీ సంగీతం లాంగ్ లాస్టింగ్ ఇంప్రెషన్ ఇవ్వలేదని కొందరు అభిప్రాయపడ్డారు. స్క్రీన్‌ప్లే కొన్ని చోట్ల నీరసంగా, డైలాగ్స్ సాగదీతగా ఉన్నాయని కొంతమంది విమర్శిం. సినిచారుమా మొదటి గంట కాస్త నెమ్మదిగా సాగినప్పటికీ, బస్సు జర్నీ మొదలైన తర్వాత కథలో వేగం, ఆసక్తి పెరిగాయని అంటున్నారు. లూక్-జెస్సీల రిలేషన షిప్‌ను ఒకే రాత్రిలో సరిచేయడం కొంత ఒప్పించ లేదని, ఎమోషనల్ డెప్త్ లోపించిందని కొందరు అభిప్రాయపడ్డారు. అయితే, సీరియల్ కిల్లర్ ఎస్కే, కండక్టర్ కథ, స్మశానంలో జరిగే సన్నివేశాలు ఆకర్షణీయంగా ఉన్నాయని ప్రేక్షకులు చెప్పారు. మొత్తంగా, 'మరణమాస్' ఒక టైమ్‌పాస్ డార్క్ కామెడీగా అందరినీ ఆకట్టుకుంది. మొదటి భాగం నెమ్మదిగా ఉన్నప్పటికీ, మధ్యలో డార్క్ హ్యూమర్, టెన్షన్‌తో సినిమా ఆసక్తికరంగా సాగుతుందని, అల్లరిగా సాగే డార్క్ కథలు ఇష్టపడే వారికి ఈ సినిమా నచ్చుతుందని పబ్లిక్ టాక్ నడుస్తోంది.

## ఒక్క లిప్‌లాక్‌తో హీట్ పుట్టించిన కమల్



సీరియల్ కిస్సర్ గా ఇమ్రాన్ హష్మి ఒక బ్రాండ్ వేస్తే, అంతకుముందే కమల్ హాసన్, అమీర్ ఖాన్ లాంటి సీనియర్లు ఇలాంటి విద్యల్లో ఆరితేరి ఉన్నారు. ముఖ్యంగా సౌత్ నుంచి వెళ్లి బాలీవుడ్ కూడా లిప్ లాక్ వేయడం ఎలానో నేర్పిన ఘనుడు కమల్ హాసన్. నిజానికి నేటి బాలీవుడ్ సూపర్ స్టార్లు అందరూ కమల్ హాసన్ ముందు ఒకప్పుడు అరదండం వేసిన వాళ్లే. ఒక సౌత్ స్టార్ నార్త్ లో ఎదగడం ఇష్టం లేని కొందరు చేసిన కుట్రల కారణంగా కమల్ హాసన్ చివరికి సౌత్ కి వచ్చేయాల్సి వచ్చింది కానీ.... అసలు సిసలు కిస్సుల కిక్కు ఎలా ఉంటుందో హిందీ చిత్రసీమకు బాగా నేర్పించగలిగే ఘనుడిగా కమల్ పేరు చిరస్థాయిగా నిలిచేది. ఇప్పుడు మరోసారి లిప్ కిస్ కారణంగా కమల్ హాసన్ పేరు మార్మోగుతోంది. 60 ప్లస్ ఏజ్ లోను కమల్ ఘాటైన అదరచుంబనంతో అదరగొట్టేసాడు. మణిరత్నం - థగ్ లైఫ్ - లో చాలా అంశాలు చర్చగా మారగా, ఇందులో ప్రధానంగా కమల్ హాసన్ లిప్ లాక్ కూడా హైలైట్ అయింది. అసలు కమల్ లిప్ లాక్ వేసింది ఎవరితో? అంటూ ఆరాలు తీసారు. త్రిష లాంటి క్యూట్ గాళ్ తో అదిరిపోయే రొమాన్స్ చేస్తున్న కమల్, సీనియర్ నటి అభిరామితో ఘాటైన అదరచుంబనం లాగించేయడం ట్రైలర్ లో సెకను పాటు మెరిసే గ్లింప్స్ లా కనిపిస్తుంది. అయినా చాలా మంది దీనిని జూమ్ చేసి చూడటానికి కారణం కమల్ లిప్ లాక్ వేసింది త్రిషతో కాదు కదా! అని సందేహించడమే. త్రిషతో కమల్ సర్ ఘాటైన సన్నివేశాలకు కొదవేమీ లేదు. కానీ, దానిని కూడా కేవలం అరసెకను గ్లింప్స్ లా ట్రైలర్ లో పరిచయం చేసి వదిలేసారు మణి సర్. థగ్ లైఫ్ తో మరోసారి పాత ఫర్ములానే తిరిగి వాడేస్తున్న మణిరత్నం తండ్రి కొడుకుల వైరం నేపథ్యంలో రక్తి కట్టించే కథనే అల్లారు. థగ్స్ సామ్రాజ్యంలో ఆస్తులు, అంతస్తులు, అధికారానికి సంబంధించిన గొడవలను తెరపై రక్తి కట్టించేలా తెరకెక్కించారని అర్థమవుతోంది. ఇంతకుముందు - నవాబ్ - చిత్రంలో ఆస్తులు, అంతస్తుల కోసం అన్నదమ్ములు కొట్టుకుని చస్తారు. ఇప్పుడు ఏకంగా తండ్రి కొడుకులే తన్నుకు చస్తారు. మొత్తానికి రక్తి కట్టించే థగ్స్ కథలో కూడా తండ్రి కొడుకు సెంటిమెంటును జోడించి మణిరత్నం థియేటర్లలో హీట్ పుట్టించబోతున్నారు. ఈ చిత్రంలో మరోసారి కమల్ హాసన్, శింబు లాంటి స్టార్ల నుంచి అవార్డ్ విన్నింగ్ పెర్ఫామెన్స్ చూడటం ఖాయమని ట్రైలర్ చెబుతోంది. మోస్ట్ అవైటెడ్ థగ్ లైఫ్ జూన్ 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ట్రైలర్ సినిమాకి మంచి హైప్‌ను సృష్టించింది.

ఈ చిత్రాన్ని నితిన్ తండ్రి సుధాకర్ రెడ్డి శ్రేష్ఠ్ మూవీస్ ద్వారా తెలుగులో విడుదల చేస్తున్నారు. విక్రమ్ లాంటి హై ఇంటెన్స్ మూవీ తర్వాత కమల్ దానిని మరో స్థాయికి తీసుకెళతారా లేదా? అన్నది వేచి చూడాలి.

## ప్రభాస్ తో చేసినా లక్ కలిసి రాలేదు..!



మోడల్ గా రాణించి ఆ తర్వాత హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చి కెరీర్ మొదట్లో అవమానాలు ఎదుర్కొని ఆ తర్వాత వరుస విజయాలతో అదరగొట్టింది అందాల భామ కృతి సనన్. మోడలింగ్ లో ఆమె రేంజ్ వేరు అనిపించుకున్న తర్వాత తెలుగులో సూపర్ స్టార్ మహేష్ తో 1 నేనొక్కడినే సినిమాతో ఆమె సిల్వర్ స్క్రీన్ ఎంట్రీ ఇచ్చింది. ఐతే ఆ సినిమా కమర్షియల్ గా పెద్దగా వర్క్ అవుట్ కాలేదు ఆ తర్వాత తెలుగులోనే నాగ చైతన్యతో దోచెయ్ సినిమా చేసింది కృతి సనన్. ఐతే అలా చిన్నగా బాలీవుడ్ షిఫ్ట్ అయ్యి అక్కడ వరుస ఛాన్స్ లు అందుకుంది. సినిమాలు వెబ్ సీరీస్ లు ఇలా హిందీ ఆడియన్స్ ని మెప్పిస్తూ వచ్చింది. ఐతే ఏమైందో ఏమో కానీ సడెన్ గా అమ్మడి కెరీర్ గ్రాఫ్ పడిపోయింది. బాలీవుడ్ లో ఆమెకు ఉన్న క్రేజ్ ని చూసే రెబల్ స్టార్ చేసిన ఆదిపురుష్ సినిమాలో ఛాన్స్ ఇచ్చారు. అందులో సీత పాత్రలో కృతి సనన్ ఇంప్రెస్ చేసింది. ఐతే ఆ సినిమా కూడా డిజాస్టర్ అవ్వడం వల్ల కృతి సనన్ మరింత ఇబ్బందుల్లో పడింది.

ఆదిపురుష్ తర్వాత మరో రెండు సినిమాలు చేసినా లాభం లేకుండా పోయింది ఐతే లాస్ట్ ఇయర్ వచ్చిన క్రూ సినిమాతో కాస్త బెటర్ అనిపించుకుంది కృతి సనన్. ప్రస్తుతం అమ్మడు తెరె ఇష్క్ మైన్ సినిమాలో నటిస్తుంది. ధనుష్ హీరోగా తెరకెక్కుతున్న ఈ సినిమాతో మరోసారి బాలీవుడ్ లో తన స్టామినా ప్రూవ్ చేసుకోవాలని చూస్తుంది కృతి సనన్. ఈ సినిమా టీజర్ తోనే ఆడియన్స్ కి షాక్ ఇచ్చేలా చేశారు మేకర్స్. కృతి సనన్ తో పాటు ఈ సినిమా ధనుష్ కి కూడా సంథింగ్ స్పెషల్ గా ఉంటుం దని అనిపిస్తుంది. కృతి సనన్ మాత్రం ఈ సినిమా మీద చాలా హోప్స్ పెట్టుకుంది.

తప్పకుండా అమ్మడు తన మార్క్ నటనతో ఆకట్టుకుంటుందని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. ఐతే ప్రభాస్ కృతి సనన్ జోడీ బాగుంది వాళ్లు చేసిన ఆదిపురుష్ ని పక్కన పెట్టి మళ్లీ ప్రభాస్ తో ఒక యాక్షన్ సినిమాలో కృతి సనన్ ని హీరోయిన్ గా ఫిక్స్ చేస్తే బాగుంటుందని ఆడియన్స్ అంటున్నారు. అలా జరిగితే మళ్లీ సౌత్ లో అదే ముఖ్యంగా తెలుగులో కృతి సనన్ కి మళ్లీ మంచి క్రేజ్ కొనసాగే ఛాన్స్ ఉంటుందని చెప్పొచ్చు.

## సల్మాన్, అక్షయ్‌లని వెనక్కి నెట్టిన దళపతి!





పదేళ్ల క్రితం ఓ హీరో వంద కోట్ల క్లబ్‌లో చేరడం అంటే మామూలు విషయం కాదు. ఆ నెంబర్ గురించి ఆలోచించే వారే కాదు. కానీ -బాహుబలి- తరువాత సినిమాల బిజినెస్‌కు సంబంధించిన గేమ్ మొత్తం మారిపోయింది. బిజినెస్‌ని కొత్త కోణంలో చూడటం మొదలు పెట్టారు. లెక్కలూ మారిపోయాయి. ఇప్పుడు టాప్ స్టార్ల సినిమా హిట్ అంటే రూ.500 కోట్లు లేదా రూ.కోట్లు అనే ట్రెండ్ మొదలైంది. దీంతో స్టార్ హీరో సినిమా వంద కోట్లు రాబట్టడం అన్నది చాలా సర్వసాధరణగా మారింది. ఇప్పుడు రూ.200 కోట్లు రాబడితేనే గొప్పగా భావిస్తున్నారు. గత పదేళ్లలో %-%బాహుబలి%-%ని మిన హాయించి రూ.200 కోట్లు రాబట్టిన సినిమాలు తక్కువే. చాలా వరకు స్టార్లు ఈ మొత్తాన్ని దక్కించు కోవాలని ప్రయత్నించి విఫలమయ్యారు కూడా. కానీ తమిళ స్టార్ హీరో దళపతి విజయ్ మాత్రం ఎనిమిది సార్లు ఈ ఫీట్‌ని సాధించిన హీరోగా నిలిచి ఆశ్చర్యపరిచాడు. బాలీవుడ్ హీరోలు సల్మాన్‌ఖాన్, అక్షయ్ కుమార్‌లకు సాధ్యం కానీ ఫీట్‌ని దక్కించుకుని వారిని రేసులో వెనక్కి నెట్టడం విశేషం. 2017లో విజయ్, అట్లీల కాంబినేషన్‌లో వచ్చిన - మెర్సల్ - మూవీ రూ. 200 కోట్ల మార్కుని దాటి వసూళ్లని రాబట్టింది. అదే తరహాలో సర్కార్, బిగిల్, మాస్టర్, బీస్ట్, వారీసు, లియో చిత్రాలు కూడా 200 కోట్లకు మించి వసూళ్లని దక్కించుకని విజయ్ సత్తా ఏంటో నిరూపించాయి. లోకేష్ కనగరాజ్ డైరెక్షన్‌లో లోకేష్ సినిమాఇక్ యూనివర్స్‌లో భాగంగా తెరకెక్కిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద వరల్డ్ వైడ్‌గా రూ.600 కోట్లకు మించి వసూళ్లని సొంతం చేసుకుంది. ఇక వెంకట్ ప్రభుతో చేసిన - ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ - రూ.400 కోట్లకు పైనే రాబట్టింది. ప్రస్తుతం విజయ్ నటిస్తున్నభారీ పాన్ ఇండియా మూవీ - జన నాయగన్ - . హెచ్ వినోద్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీతో విజయ్ సినిమాలకు గుడ్‌బై చెప్పబోతున్నాడు. ఈ సినిమా తరువాత రాజకీయాలకే పరిమితం కాబోతున్నాడు. రాజకీయపార్టీని ఇటీవలే ప్రకటించి వచ్చే తమిళనాడు ఎన్నికల కోసం సిద్ధం అఉవతున్నాడు. దీంతో - జన నాయగన్ - పై సర్వత్రా భారీ అంచనాలు ఏర్పడ్డాయి. పూజా హెగ్డే, శృతిహాసన్, ప్రియమణి, బాబీ డియోల్, - ప్రేమలు - ఫేమ్ మమితా బైజు, వరలక్ష్మీ శరత్‌కుమార్, నరేన్, ప్రకాష్ రాజ్, గౌతమ్ మీనన్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ మూవీపై ఉన్న క్రేజ్‌తో నాన్ థియేట్రికల్ హక్కులు భారీ మొత్తానికి అమ్ముడు పోయాయి. ఓటీటీ స్ట్రీమింగ్ హక్కుల్ని తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ భాషలకు గానూ అమెజాన్ ప్రైమ్ రూ.121 కోట్లకు దక్కించుకోగా, శాటిలైట్ హక్కుల్ని సన్ టీవీ రూ.68 కోట్లకు సొంతం చేసుకుంది. అంటే థియేట్రికల్ బిజినెస్‌కు ముందే - జన నాయగన్ - రూ189 కోట్లని దక్కించుకోవడం విశేషం.


## కన్నడ స్టార్ ఇక్కడ అక్కడ బిజీ బిజీ..!

కన్నడ స్టార్ హీరో ఉపేంద్ర ఈమధ్య మళ్లీ తన దూకుడు పెంచారని చెప్పొచ్చు. UI సినిమాతో పాన్ ఇండియా అటెంప్ట్ చేసిన ఉపేంద్ర త్వరలో మరో రెండు క్రేజీ ప్రాజెక్ట్స్ తో రాబోతున్నారు. ఓ పక్క హీరోగా చేస్తూ మరోపక్క సపోర్టింగ్ రోల్ అది కూడా సినిమాలో ఇంపార్టెంట్ అనుకుంటే ఎలాంటి మొహమాటాలు లేకుండా చేస్తారు ఉపేంద్ర. ఈ క్రమంలో ఉపేంద్ర ప్రస్తుతం అటు తమిళ్ ఇటు తెలుగు రెండు క్రెజీ సినిమాల్లో వెరైటీ రోల్స్ చేస్తున్నారు. తెలుగులో రామ్ హీరోగా చేస్తున్న ఆంధ్రా కింగ్ తాలూకా సినిమాలో ఉపేంద్ర కటౌట్ కనిపించింది. అంటే సినిమాలో ఆయన రోల్ కూడా ఉంటుందనే టాక్ వినిపిస్తుంది. ఆంధ్రా కింగ్ తాలూకా లో ఉపేంద్ర ఉన్నాడా లేడా అన్నది త్వరలో తెలుస్తుంది. ఈ సినిమాతో రామ్ ఎలాగైనా హిట్ కొట్టాలని చూస్తున్నాడు. ఇదిలా ఉంటే మరోపక్క ఉపేంద్ర అటు తమిళ్ లో సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా చేస్తున్న కూలీ సినిమాలో కూడా ఒక సర్ ప్రైజ్ రోల్ లో కనిపించనున్నారు . లోకేష్ సినిమాటిక్ యూనివర్స్ లో భాగంగా వస్తున్న కూలీ సినిమాలో ఉపేంద్ర రోల్ అదిరిపోతుందని అంటున్నారు. సో కన్నడలో సోలో సినిమాలు చేస్తూనే మరోపక్క తెలుగు, తమిళ్ లో తన దాకా వచ్చిన సపోర్టింగ్ రోల్స్ లో మెప్పించాలని చూస్తున్నాడు ఉపేంద్ర.


తెలుగులో అయితే ఉపేంద్ర త్రివిక్రమ్ డైరెక్షన్ లో తెరకెక్కిన సన్నాఫ్ సత్యమూర్తి సినిమాలో నటించారు. ఆ సినిమాలో ఆ రోల్ కి ఆయనే పర్ఫెక్ట్ అనేలా చేశారు . ఇక ఇప్పుడు రామ్ తో ఆంధ్రా కింగ్ తాలూకాతో పాటు అటు రజినీ కూలీలో స్క్రీన్ షేర్ చేసుకుంటున్నారు . ఈ సినిమాలతో మరోసారి సౌత్ ఆడియన్స్ ని ఆకట్టుకోనున్నారు ఉపేంద్ర. ఇక కన్నడలో ఆల్రెడీ ఆయన చేస్తున్న బుద్ధివంత, త్రిశూలం తో పాటు 45వ సినిమా కూడా సెట్స్ మీద ఉన్నాయి. ఈ సినిమాల తో మరో సారి ఉపేంద్ర తన వర్సటాలిటీ చూపించాలని చూస్తు న్నారు.

సౌత్ లో ఉన్న డ్యాషింగ్ యాక్టర్స్ లో ఉపేంద్ర ఒకరు. ఆయనకు తగిన పాత్ర పడితే మాత్రం రఫ్ఫాడిం చేస్తాడు.

సోలో గానే కాదు చిన్న రోల్ చేసినా దానికి పర్ఫెక్ట్ ఇంపాక్ట్ కలిగేలా చేస్తాడు ఉపేంద్ర. మరి రాబోతున్న ఈ సినిమాలతో ఉపేంద్ర ఎలా ప్రేక్షకులను ఆకట్టుకుంటారన్నది చూడాలి.



## వారికి చుక్కలు చూపిస్తున్న డిజిటల్ ప్లాట్‌ఫామ్స్!



కరోనా మహమ్మారి కారణంగా ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లకు మంచి క్రేజ్ ఏర్పడింది. నచ్చిన సినిమాలు, సిరీస్‌లు థియేటర్‌కు వెళ్లకుండా ఇంట్లోనే ఉండి చూసే ఫెసిలీటీ ఉండటంతో చాలా వరకు ప్రేక్షకులు ఓటీటీలకు ఎడిక్ట్ కావడం మొదలైంది. దీంతో సినిమాలు, సిరీస్‌లని భారీ స్థాయిలో కొనడం ప్రారంభించిన ఓటీటీ ప్లాట్ ఫామ్‌లు వాటి ప్రవాహం భారీగా పెరగడంతో క్రమ క్రమంగా సినిమాలు, సిరీస్‌లని కొనడం తగ్గించి మేకర్స్‌కు షాక్ ఇవ్వడం మొదలు పెట్టాయి. కేవలం స్టార్ హీరోలు, స్టార్ ప్రొడక్షన్ కంపనీలు నిర్మించిన సిరీస్‌లు, సినిమాలకు మాత్రమే ప్రాధాన్యతనిస్తూ కొత్త మేకర్స్‌ని పక్కన పెడుతుండటంతో చాలా వరకు మేకర్స్ తీవ్ర ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నారు. అంతకు ముందు డిజిటల్ రైట్స్ కోసం భారీ మొత్తాన్ని అందించి చాలా వరకు నిర్మాతలకు లాభాల్ని అందించి సిరీస్‌లు, ఓటీటీ మూవీస్‌కు ఊతం ఇచ్చిన ఓటీటీలు ఇప్పుడు కేవలం సెలక్టీవ్‌గా సినిమాలు, సిరీస్‌లని మాత్రమే కొంటూ మిగతావారికి చుక్కలు చూపిస్తున్నాయి. తక్కువ బడ్జెట్‌లో ఓ మోస్తారు పేరున్న నటీనటులతో నిర్మించిన వాటికి పెద్దగా ఇంపార్టెన్స్ ఇవ్వడం లేదు. దీంతో చిన్న సినిమాలు, సిరీస్‌లు నిర్మిస్తున్న మేకర్స్ ఇబ్బందులకు గురవుతున్నారు. అంతే కాకుండా ఈ మధ్య డిజిటల్ ప్లాట్ పామ్స్ కొత్త పద్దతిని కూడా అనుసరిస్తున్నాయి. చాలా మంది సినిమాలు తీసివాటిని థియేటర్లలో రిలీజ్ చేసుకునే వీలు, డబ్బులు లేకపోవడంతో ఓటీటీలని ఆశ్రయిస్తున్నారు. అలా తీసుకొచ్చిన సినిమాలని పే పర్ వ్యూ పద్ధతిలో తీసుకుంటూ కొత్త తరహాలో ఇబ్బందులకు గురి చేస్తున్నారని పలువురు మేకర్స్ వాపోతున్నారు. చిన్న బడ్జెట్ సినిమాల నిర్మాతలకు తమ చిత్రాలని థియేటర్లలో రిలీజ్ చేయడానికి సరిపడా డబ్బులు ఉండటం లేదు. అంతే కాకుండాకాకుం పబ్లిసిటీకి బడ్జెట్ కేటాయించలేకపోతున్నారు. దీంతో ఓటీటీలు కూడా ఈ సినిమాలని తీసుకోవడానికి ముందుకు రావడం లేదు. దీంతో దాదాపు 300 సినిమాలు ప్రస్తుతం రిలీజ్‌కు నోచుకోక పీకల్లోతు కష్టాల్ని ఎదుర్కొంటున్నాయని ఇన్ సైడ్ టాక్. శాటిలైట్ మార్కెట్ కూడా వీరికి డోర్లు క్లోజ్ చేయడంతో చిన్న సినిమాలు నిర్మించిన నిర్మాతలంతా ఇప్పుడు తలలు పట్టుకుంటున్నారట. ఇది ఇప్పుడు టాలీవుడ్‌లో ప్రధాన సమస్యగా మారిందని ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## గ్యాడ్జెట్స్?:

## ఫుట్ మసాజర్.. దీంతో కండరాలు.. మెడ నొప్పులు ఇట్టే తగ్గుతాయి..




రెగ్యులర్?గా వాకింగ్? చేసేవాళ్లకు అప్పుడప్పుడు పాదాల్లో నొప్పి వస్తుంటుంది. అలాంటప్పుడు దీనిపై కాసేపు నిలబడితే చాలు.. నిమిషాల్లో ఉపశమనం కలుగుతుంది. మిక్సెన్? అనే కంపెనీ ఈ ఆటోమెటిక్? ఎలక్ట్రిక్ ఫుట్ మసాజర్?ని మార్కెట్?లోకి తీసుకొచ్చింది. ఇది వైబ్రేట్అవుతూ పాదాలకు వేడిని ఇస్తుంది. దానివల్ల నొప్పి తగ్గడంతోపాటు రక్త ప్రసరణ కూడా పెరుగుతుంది. వైబ్రేషన్? లెవల్?ని అడ్జస్ట్ చేసుకోవచ్చు. పాదాలు చిన్నగా ఉన్నా, పెద్దగా ఉన్నా సౌకర్యవంతంగానే ఉంటుంది. ఈ మసాజర్?లో ఈఎంఎస్? టెక్నాలజీ వాడారు. అది కండరాల నొప్పి తగ్గించడంలో సాయపడుతుంది. ఇది పోర్టబుల్? సైజులో ఉండడమే కాకుండా ఫోల్డబుల్? డిజైన్?తో వస్తుంది. మడతపెట్టుకుని ఎక్కడికైనా తీసుకెళ్లొచ్చు. ధర : రూ. 1,999

### మెడ నొప్పికి..

ఈ మధ్య కాలంలో డెస్క్ జాబ్? చేసే చాలామంది నడుము, వెన్ను నొప్పితో బాధపడుతున్నారు. గంటల తరబడి ఆఫీసుల్లో కూర్చోవడం వల్ల మెడ నొప్పి కూడా కామన్? అయిపోయింది. అలాంటి వాళ్లు ఈ మసాజర్?ని వాడితే నొప్పి నుంచి కాస్త ఉపశమనం పొందొచ్చు. ఫ్లిక్స్పై అనే కంపెనీ ఈ మసాజర్?ని తీసుకొచ్చింది. దీంతో నడుము, భుజాలు, మెడ భాగంలో మసాజ్? చేసుకోవచ్చు. దీనికి ఆరు మసాజ్ హెడ్స్? ఉంటాయి.

మసాజ్? చేసుకునే పార్ట్ని బట్టి మోడ్స్? మార్చుకోవాలి. మెడ నొప్పిని తగ్గించేందుకు ప్రత్యేకంగా రూపొందించిన ప్రొఫెషనల్ మసాజర్ ఇది. ఇందులో హీట్ ఫంక్షన్ కూడా ఉంది. రెండు హీట్ కంప్రెస్ సెట్టింగ్స్? ఉన్నాయి. దీన్ని ఆన్? చేసిన 10 నిమిషాల్లో మసాజ్? పూర్తి చేసి ఆటోమెటిక్?గా ఆఫ్? అవుతుంది. ఇది రీచార్జబుల్ లిథియం-అయాన్ బ్యాటరీతో పనిచేస్తుంది. కాబట్టి ఉపయోగించిన ప్రతిసారి కరెంట్కి ప్లగ్ చేయాల్సిన అవసరం లేదు. ఒకే చార్జ్పై 70-80 నిమిషాల వరకు మసాజ్ చేస్తుంది. ధర : రూ. 1,499



## చిట్టి పొట్టి స్వీట్స్.. పిల్లలైనా.. పెద్దలైనా సరదాగా హ్యాపీగా తినేవి ఇవే..

సమ్మర్? హాలిడేస్? కొనసాగు తున్నాయి. అమ్మా.. ఏదన్నా తింటానికి పెట్టు.. అంటూ పిల్లలు మారాం చేస్తుంటారు. కొందరైతే బయట పదార్థాలు తీసుకొచ్చి పెడతారు. అవి ఆరోగ్యానికి అంత మంచిది కాదని తెలిసినా .. పిల్లల గోల భరించలేక బయట దొరికే చిరుతిండ్లు తప్పడం లేదు. అలా కాకుండా ఇంట్లోనే వెరైటీగా చాక్లెట్లు, లాలీపాప్, క్యాండీలను తయారు చేసుకోవచ్చు. ఇప్పుడు ఎలా తయారు చేయాలో తెలుసుకుందాం .. . ఎంత వద్దన్నా... చాక్లెట్లు, లాలీపాప్, క్యాండీలను పిల్లలు తినకమానరు. మరి అలాంటప్పుడు, బయట మార్కెట్లో దొరికే వాటికన్నా, ఇంట్లో తయారు చేసినవి మేలు కదా. అలా ఇంట్లోనే తయారు చేస్తే పిల్లలకే కాదు... తల్లులకు కూడా థ్రిల్? గా ఉంటుంది. చేయాలని ఉన్నా... ఎలా చేయాలో తెలియకే చాలామంది ఆగిపోతారు. అలాంటివాళ్ల కోసమే ఈ రెసిపీలు. మరింకెందుకు ఆలస్యం... వెంటనే ట్రై చేయండి.

### చాకొలెట్? తయారీకి కావాల్సినవి

కొకొవా పొడి : రెండు కప్పులు
మైదా పిండి : పావుటీ స్పూన్
బట్టర్ (వెన్న) : ముప్పావు కప్పు
నీళ్లు : ఒక కప్పు
పాలు : ముప్పావు కప్పు
చక్కెర పొడి: పావు కప్పు

తయారీ విధానం: కొకొవా పొడిని బట్టర్ తో కలిపి మిక్సీలో గ్రైండ్ చేయాలి స్టవ్ వెలిగించి పెద్ద గిన్నెలో నీళ్లు వేడి చేయాలి. అందులో మరో చిన్నగిన్నె పెట్టి కొకోవా మిశ్రమాన్ని వేయాలి. రెండు, మూడు నిమిషాల వరకు కలుపుతూనే ఉండాలి. అందులో గోరువెచ్చని పాలు, చక్కెర పొడి, పిండి వేసి ఉండలు లేకుండా కలపాలి. మిశ్రమం మృదువుగా అయ్యాక చాకొలెట్ మౌల్ట్స్? లేదా ఫ్రిజ్ ఐస్? ట్రేలో వేయాలి. రెండు గంటల తర్వాత



చాకొలెట్లను బయటికి తీసి, పిల్లలకు ఇవ్వండి సంతోషంగా తింటారు.

### గమ్మీ క్యాండీ తయారీకి కావాల్సినవి

జిలటిన్? షీట్స్? (మార్కెట్లో దొరుకుతాయి): ఆరు
నీళ్లు : అర కప్పు
చక్కెర : అర కప్పు
తా జా నిమ్మరసం : ఒక టేబుల్ స్పూన్
పండ్ల రసం (ఇష్టాన్ని బట్టి పండును ఎంచుకోవచ్చు): అరకప్పు

తయారీ విధానం: జెలటిన్ షీట్లను ఐదు నిమిషాల పాటు చల్లటి నీళ్లలో నానబెట్టాలి మరోవైపు స్టవ్ వెలిగించి పాన్ పెట్టాలి. అందులో మీకు నచ్చిన పండ్ల రసం... నీళ్లు, నిమ్మరసం వేసి కలపాలి. చక్కెర కూడా వేసి మరిగించాలి. మంటను తగ్గించి, చల్లటి నీళ్లల్లోంచి.. జిలటిన్ షీట్లను తీసి అందులో వేయాలి. రెండు నిమిషాల తర్వాత స్టవ్ మీద నుంచి దింపేయాలి. మిశ్రమాన్ని ఏదైనా గిన్నెలోకి తీసుకుని ఐదారు గంటల పాటు ఫ్రిజ్ లో పెట్టాలి. ఆ పెద్దసైజు క్యాండీని నచ్చిన ఆకారం, సైజులో కట్? చేసుకోవాలి. కావాలనుకుంటే వాటిపై పల్చగా నూనె రాసి చక్కెర పొడి దొర్లించవచ్చు.

### టూటీ ఫ్రూటీ తయారీకి కావాల్సినవి

పచ్చి బొప్పాయి: అర కిలో
నీళ్లు :ఏడు కప్పులు
చక్కెర: రెండు కప్పులు
వెనిల్లా ఎసెన్స్ : ఒక టీ స్పూన్
ఫుడ్ కలర్ (ఎరుపు, ఆరు పచ్చ, పసుపు రంగు): ఒక్కోటి నాలుగు చుక్కలు

తయారీ తయారీ విధానం: పచ్చి బొప్పాయి తొక్క తీసి ముక్కలుగా తరుగాలి. తరిగిన ముక్కల్ని నాలుగు కప్పుల నీళ్లలో అయిదు నిమిషాల పాటు ఉడికించాలి. బొప్పాయి ముక్కలు మెత్తగా కాకుండా కొద్దిగా ఉడికితే చాలు ... స్టవ్ వెలిగించి పాన్? పెట్టి మిగిలిన మూడు కప్పుల నీళ్లు పోయాలి. అందులో చక్కెర వేసి కలపాలి. లేత పాకం అయ్యేవరకు... అంటే దాదాపు పదిహేను నిమిషాల వరకు కలుపుతూనే ఉండాలి. తర్వాత దాంట్లో వెనిల్లా ఎసెన్స్, సగం ఉడికిన బొప్పాయి ముక్కలు వేయాలి. కొద్ది సేప య్యాక ముక్కలను మూడు విడివిడి గిన్నెలో తీసుకొని, ఒక్కోదాంట్లో ఒక్కో ఫుడ్ కలర్ వేయాలి. వాటిని పన్నెండు గంటలు అరబెట్టాలి. పిల్లలు, పెద్దలు.. ఎంతగానో ఇష్టపడే టూటీ ఫ్రేట్? రెడీ...




### లాలీపాప్? తయారీకి కావాల్సినవి

చక్కెర :ఒక కప్పు
కార్న్ సిరప్? (మార్కెట్లో దొరుకుతుంది) -:అర కప్పు,
నీళ్లు :పావు కప్పు
వెనిల్లా వెసెన్స్ : ఒకటీ స్పూన్
ఫుడ్ కలర్ (నచ్చినది) : తగినంత
పుల్లలు: సరిపడ

తయారీ విధానం: ఒక గిన్నెలో చక్కెర, కార్న్ సిరప్? నీళ్లు పోసి కలపాలి. స్టవ్ వెలిగించి ఆ గిన్నెను సన్నని మంటపై పెట్టాలి. మిశ్రమం చిక్కగయ్యే వరకు కలుపుతూనే ఉండాలి. అది మరుగుతున్నప్పుడు వెనిల్లా ఎసెన్స్, ఫుడ్ కలర్ వేసి బాగా కలిపి దింపేయాలి. ఆ మిశ్రమాన్ని లాలీపాప్ మౌల్ట్స్?, లేదా కాటన్ క్లాత్ మీద వేసి, పుల్లను మధ్యలో పెట్టి కొద్దిసేపు ఫ్రిజ్? లో పెట్టాలి. నోరూరించే రంగురంగుల లాలీపాప్ ను ఎవరైనా ఇష్టపడతారు.

## గెలాక్సీ ఎస్-25 ఎడ్జ్ ప్రీ-ఆర్డర్లను ప్రారంభించిన సామ్సంగ్




భారతదేశంలో అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ అయిన సామ్సంగ్, ఈరోజు తమ విభాగాన్ని -నిర్వచించే గెలాక్సీ ఎస్ 25 ఎడ్జ్, సన్నని గెలాక్సీ ఎస్ సిరీస్ స్మార్ట్ఫోన్ కోసం ప్రీ-ఆర్డర్లను ప్రారంభించింది. శైలి మరియు బలాన్ని దృష్టిలో ఉంచుకుని రూపొందించబడిన గెలాక్సీ ఎస్ 25 ఎడ్జ్, స్థిరమైన టైటానియం బాడీలో ప్రీమియం, ప్రో-లెవల్ పనితీరు యొక్క కొత్త సమతుల్యతను తాకుతుంది. గెలాక్సీ ఎస్ 25 ఎడ్జ్ ఎస్ సిరీస్ వారసత్వాన్ని అందిస్తుంది, ఐకానిక్ గెలాక్సీ ఏఐ -ఆధారిత కెమెరాను ఏకీకృతం చేస్తుంది, సౌకర్యవంతంగా పోర్టబుల్ పరికరంలో సృజనాత్మకత యొక్క కొత్త రంగాన్ని ఆవిష్కరిస్తుంది.

అసాధారణమైన రీతిలో సొగసైన మరియు బలమైన డిజైన్

సన్నని 5.8ఎంఎం చాసిస్తో, స్మార్ట్ఫోన్ డిజైన్లోని దాదాపు ప్రతి అంశాన్ని పునరావిష్కరించే ఇంజనీరింగ్ యొక్క అద్భుతమైన ప్రదర్శన , గెలాక్సీ ఎస్ 25 ఎడ్జ్ . దీని మెరుగైన ఫ్రేమ్ బ్రిడ్జెస్ కేవలం 163 గ్రాముల వద్ద రూపుదిద్దుకోవటంతో పాటుగా పనిచేస్తాయి, గెలాక్సీ ఎస్ సిరీస్ యొక్క ఏకీకృత డిజైన్కు అనుగుణంగా ఉంటూనే సన్నటి స్మార్ట్ఫోన్లను తదుపరి స్థాయికి తీసుకువెళతాయి. దాని స్ట్రీమ్లైన్డ్ సిల్హౌట్, అసాధారణమైన స్థిరత్వం వస్తుంది. మెరుగ్గా వంగిన అంచులు మరియు దృఢమైన టైటానియం ఫ్రేమ్ రోజువారీ ఉపయోగం కోసం శాశ్వత రక్షణను అందిస్తాయి. ఇంజనీరింగ్ స్థిరత్వంను అందించే కొత్త గ్లాస్ సిరామిక్ ఆఫరింగ్ అయిన తాజా కార్నింగ్ గొరిల్లా గ్లాస్ సిరామిక్ 2, గెలాక్సీ ఎస్ 25 ఎడ్జ్ లో ముందు డిస్ప్లే కోసం ఉపయోగించబడుతుంది.

### పాకెట్ చేయగల 200ఎంపి కెమెరాతో శక్తివంతమైన సృజనాత్మకత

గెలాక్సీ ఎస్ 25 ఎడ్జ్ యొక్క సన్నటి మరియు తేలికపాటి డిజైన్ వినియోగదారులు ఎప్పుడైనా, ఎక్కడైనా చిరస్మరణీయ క్షణాలను ఒడిసిపట్టటానికి మరియు తమ సృజనాత్మకతను వ్యక్తీకరించడానికి సహాయపడుతుంది. 200ఎంపి వైడ్ లెన్స్ గెలాక్సీ ఎస్ సిరీస్ యొక్క ఐకానిక్ కెమెరా అనుభవాన్ని మెరుగు పరుస్తుంది, నైటోగ్రఫీని కొత్త స్థాయికి తీసుకువెళుతుంది. దాని అల్ట్రా-హై రిజల్యూషన్ దీనికి తోడ్పడుతుంది, వినియోగదారులు పెద్ద పిక్సెల్ పరిమాణంతో స్పష్టమైన షాట్లను తీయగలుగుతూనే చక్కటి ఫోటోలను పొందుతారు. తక్కువ-కాంతి వాతావరణంలో 40% కంటే ఎక్కువ మెరుగైన ప్రకాశంతో చిత్రాలను ఇది సంగ్రహిస్తుంది. 12ఎంపి అల్ట్రా-వైడ్ సెన్సార్ ఆటోఫోకస్ను కలిగి ఉంది, ఇది మరింత సృజనాత్మక సౌలభ్యం కోసం స్ఫుటమైన, వివరణాత్మక మాక్రో ఫోటోగ్రఫీకి శక్తినిస్తుంది. దుస్తులు లేదా మొక్కల కోసం పదునైన



వివరాలను నిర్ధారించడం మరియు పోర్ట్రెయిట్లలో సహజమైన, నిజమైన స్కిన్ టోన్ వంటి ప్రో-గ్రేడ్ మెరుగుదలలతో గెలాక్సీ ఎస్ 25 కోసం మెరుగుపరచబడిన అదే ప్రోవిజువల్ ఇంజిన్ నుండి గెలాక్సీ ఎస్ 25 ఎడ్జ్ ప్రయోజనం పొందుతుంది. ఆడియో ఎరేజర్ మరియు డ్రాయింగ్ అసిస్ట్ వంటి అభిమానుల-ఇష్టమైన వాటితో సహా గెలాక్సీ ఏఐ -ఆధారిత ఎడిటింగ్ ఫీచర్లు అన్నీ గెలాక్సీ ఎస్ 25 సిరీస్ నుండి తీసుకురాబడ్డాయి.

### అల్ట్రా-స్లిమ్ స్మార్ట్ ఫోన్ లో గరిష్ట పనితీరు నైపుణ్యంగా అందుబాటులోకి తీసుకురావటం జరిగింది

గెలాక్సీ ఎస్ 25 ఎడ్జ్ అనేది గెలాక్సీ కోసం స్నాప్ డ్రాగన్ 8 ఎలైట్ మొబైల్ ప్లాట్ఫామ్తో ప్రారంభించి ప్రీమియం పనితీరును అందించడానికి నిర్మించబడింది. క్వాల్ కామ్ టెక్నాలజీస్ , ఇంక్. ద్వారా అనుకూలీకరించబడిన, చిప్సెట్ గెలాక్సీ ఎస్ 25 ఎడ్జ్ యొక్క ఆన్-డివైస్ ఏఐ ప్రాసెసింగ్ సామర్థ్యాలకు శక్తినిస్తుంది మరియు రోజంతా విశ్వసనీయంగా వేగవంతమైన పనితీరును అందిస్తుంది. గెలాక్సీ ఎస్ 25 ఎడ్జ్ నిరంతర ఉపయోగంలో కూడా చల్లగా ఉంటుంది, ఎందుకంటే ఇది ఇప్పుడు రి కాన్ఫిగర్ చేయబడిన వాపర్ ఛాంబర్ కలిగి ఉంటుంది, అయితే స్థిరమైన రీతిలో వేడి వెదజల్లడానికి వెడల్పుగా ఉంటుంది. గెలాక్సీ ఎస్ సిరీస్ యొక్క పనితీరు ప్రమాణాలకు అనుగుణంగా, గెలాక్సీ ఎస్ 25 ఎడ్జ్ ప్రోస్కేలర్తో అధునాతనమైన మరియు సమర్థవంతమైన ఏఐ ఇమేజ్ ప్రాసెసింగ్ను కలిగి ఉంది, ఇది డిస్ప్లే ఇమేజ్ స్కేలింగ్ నాణ్యతలో 40% మెరుగుదలను అందిస్తుంది, అదే సమయంలో సామ్సంగ్ యొక్క అనుకూలీకరించిన మొబైల్ డిజిటల్ నేచురల్ ఇమేజ్ ఇంజిన్ ను కలుపుతుంది.

### గెలాక్సీ ఏఐతో విశ్వసనీయ సహచరుడు

దాదాపు ప్రతి టచ్పాయింట్లో గెలాక్సీ ఎస్ 25 ఎడ్జ్ మా అత్యంత సహజమైన మరియు సందర్భోచిత మొబైల్ ఏఐ అనుభవాలను అందిస్తుంది. వినియోగదారులు తమ వ్యక్తిగత డేటా ఎల్లప్పుడూ సురక్షితంగా ఉంటుందని మనశ్శాంతితో వ్యక్తిగతీకరించిన, మల్టీమోడల్ ఏఐ సామర్థ్యాలను పొందుతారు.

విస్తృత గెలాక్సీ ఎస్25 సిరీస్ను ప్రతిబింబిస్తూ, గెలాక్సీ ఎస్ 25 ఎడ్జ్ బహుళ యాప్లలో సజావుగా పనిచేసే ఏఐ ఏజెంట్లను ఏకీకృతం చేస్తుంది, పనులను మరింత సులభంగా పూర్తి చేయడానికి నిజమైన ఏఐ సహచరుడిగా సహాయపడుతుంది. గెలాక్సీ ఏఐ రోజువారీ దినచర్యలతో అను సంధానించడంలో కూడా మెరుగ్గా ఉంటుంది.

నౌ బ్రీఫ్ మరియు నౌ బార్ లో ఎక్కువ సౌలభ్యం కోసం , రోజువారీ ప్రయాణం, భోజనం మరియు మరిన్నింటి సమయంలో సహాయకరమైన రిమైండర్ల కోసం మూడవ పక్ష యాప్ ఇంటిగ్రేషన్లు ఉన్నాయి. గూగుల్తో గెలాక్సీ యొక్క లోతైన అనుసంధానం కారణంగా, గెలాక్సీ ఎస్ 25 ఎడ్జ్ జెమిని యొక్క తాజా పురోగతులను మరింత మంది వినియోగదారులకు తీసుకువస్తుంది. ఉదాహరణకు, జెమిని లైవ్ యొక్క కొత్త కెమెరా , స్క్రీన్ షేరింగ్ సామర్థ్యాలతో, వినియోగదారులు తమ స్క్రీన్పై లేదా తమ చుట్టూ ఉన్న ప్రపంచంలో చూసే వాటిని జెమిని లైవ్కు చూపించవచ్చు, అదే సమయంలో లైవ్ సంభాషణలో దానితో సంభాషించవచ్చు.

గెలాక్సీ ఎస్ 25 ఎడ్జ్ లో గెలాక్సీ ఏఐ ద్వారా అందించబడే అనుభవాలు కేవలం అనుకూలమైనవి మాత్రమే కాదు, అవి గోప్యతతో రూపొందించబడ్డాయి.

పరికరంలోని ఏఐ ప్రాసెసింగ్ సామ్సంగ్ నాక్స్ ద్వారా డేటాను సురక్షితంగా ఉంచుతుందని నిర్ధారిస్తుంది, హైపర్-వ్యక్తిగతీకరించిన మొబైల్ అనుభవాలు గోప్యతను ఎప్పుడూ త్యాగం చేయవని నిర్ధారించుకోవడానికి సామ్సంగ్ యొక్క అచంచలమైన నిబద్ధతను కొనసాగిస్తుంది.

### ధర, లభ్యత మరియు ప్రీ-ఆర్డర్ ఆఫర్లు

అన్ని ప్రముఖ ఆన్లైన్ మరియు ఆఫ్లైన్ రిటైల్ స్టోర్లలో నేటి నుండి గెలాక్సీ ఎస్ 25 ఎడ్జ్ ప్రీ-ఆర్డర్ల కోసం సిద్ధంగా ఉంది. గెలాక్సీ ఎస్ 25 ఎడ్జ్ ను ప్రీ-ఆర్డర్ చేసే కస్టమర్లు రూ. 12,000 విలువైన ఉచిత స్టోరేజ్ అప్గ్రేడ్ను అందుకుంటారు. కస్టమర్లు పరికరంపై 9 నెలల వరకు నో-కాస్ట్ ఈఎంఐ ని కూడా పొందవచ్చు. గెలాక్సీ ఎస్ 25 ఎడ్జ్ రెండు ఆకర్షణీయమైన రంగులలో అందుబాటులో ఉంటుంది - టైటానియం సిల్వర్ మరియు టైటానియం జెట్బ్లాక్. గెలాక్సీ ఎస్ 25 ఎడ్జ్ మరియు గెలాక్సీ ఎస్25 సిరీస్ గురించి మరింత సమాచారం కోసం ,దయచేసి Samsung.comని సందర్శించండి.

## ఈ పండు మార్కెట్లో కనిపిస్తే వెంటనే కొనుగోలు చేయండి.. ఎందుకంటే?



: శరీరానికి అదనపు శక్తి ఇచ్చేందుకు రోజు తినే ఆహారం కాకుండా ఇతర ఆహార పదార్థాలు కూడా తీసుకోవాల్సి ఉంటుంది. వీటిలో పండ్లు అయితే శరీరానికి ఆరోగ్యాన్ని కలిగిస్తాయి. సాధారణంగా పండ్లు తినడానికి చాలామంది ఇష్టపడరు. కానీ పండ్లలో కార్బోహైడ్రేట్లూ.. విటమిన్లు.. ఖనిజాలు అధికంగా ఉంటాయి. ఇవి తినడం వల్ల తక్షణమే శక్తి వస్తుంది. అయితే అన్ని రకాల పనులలో కాకుండా కొన్ని రకాల్లో అధికమైన పోషకాలు ఉంటాయి. వాటిలో డ్రాగన్ ఫ్రూట్ ఒకటి. డ్రాగన్ ఫ్రూట్ చూడడానికి బాగో లేకపోయినా.. ఇందులో పోషకాలు మెండు అని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఇంతకీ డ్రాగన్ ఫ్రూట్లో ఎలాంటి పోషకాలు ఉన్నాయో చూద్దాం.. ఇటీవల మార్కెట్లో





డ్రాగన్ ఫ్రూట్స్ ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఏదైనా అనారోగ్యానికి గురైతే డ్రాగన్ ఫ్రూట్ తినాలని వైద్యుల సైతం సూచిస్తున్నారు. డ్రాగన్ ఫ్రూట్లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. అందువల్ల అనారోగ్యానికి గురైనప్పుడు డ్రాగన్ ఫ్రూట్ తినడం వల్ల తక్షణ ఎనర్జీ వస్తుంది. అంతేకాకుండా ఇందులో కెరోటిన్ అనే పదార్థం ఉంటుంది. ఇది డెంగ్యూ, వైరల్ ఫీవర్ వంటి వ్యాధుల నుంచి శుభవార్తలు ఉపశమనం చేసేలా సహాయపడుతుంది. డ్రాగన్ ఫ్రూట్స్ తినడం వల్ల షుగర్ లెవెల్స్ ను కంట్రోల్ లో వస్తాయి. దీనిని రెగ్యులర్గా తీసుకోవడం వ్ల గుండె కూడా మెరుగ్గా పనిచేస్తుంది. ఏదైనా అనారోగ్యానికి గురైనప్పుడు మాత్రమే కాకుండా సాధారణ సమయంలో డ్రాగన్ ఫ్రూట్ తినడం వల్ల నిత్యం ఆరోగ్యంగా ఉండగలుగుతారు. ఇందులో ప్రోబయోటిక్స్ ఉండడం వల్ల జీర్ణ క్రియను పెంపొందిస్తుంది. అలాగే మలబద్ధకం సమస్య ఉన్నవారు డ్రాగన్ ఫ్రూట్ తినడం వల్ల ఉపశమనం పొందవచ్చు. అంతేకాకుండా ఫ్రీ రాడికల్స్ ను పెరగనియ్యకుండా చేసి క్యాన్సర్ రాకుండా కాపాడుతుంది. ఇందులో ఫైబర్ అధికంగా ఉంటుంది. దీంతో శరీరానికి ఎలాంటి అదనపు కొవ్వు చేరకుండా ఆరోగ్యంగా ఉండగలు గుతారు. డ్రాగన్ ఫ్రూట్స్ లో మెగ్నీషియం, ఐరన్ వంటి ఖనిజాలు ఉంటాయి. ఇవి పిల్లలతో పాటు మహిళలు ఎక్కువగా తీసుకోవడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. రక్తహీనతతో బాధపడేవారు డ్రాగన్ ఫ్రూట్ ను రెగ్యులర్ గా తీసుకోవాలి. ఎముకలు బలంగా ఉండాలంటే డ్రాగన్ ఫ్రూట్ ను క్రమం తప్పకుండా తీసుకోవాలి. ప్రస్తుత కాలంలో కాలంతో సమయం లేకుండా అన్ని సమయాల్లో డ్రాగన్ ఫ్రూట్ అందుబాటులో ఉంటుంది. అయితే వీటిని కొనుగోలు చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి. నాణ్యమైన డ్రాగన్ ఫ్రూట్ మాత్రమే తీసుకోవాలి. కల్తీగా మారిన డ్రాగన్ ఫ్రూట్ తీసుకోవడం వల్ల అనేక సమస్యలు వస్తాయి. అంతేకాకుండా వీటిని కొనుగోలు చేసే సమయంలో పాడైపోయినవి ఉన్నాయా లేవా అనేది చూడాలి. కడుపు సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్న డ్రాగన్ ఫ్రూట్ తో పరిష్కారం చేసుకోవచ్చు. అందువల్ల ఇది మార్కెట్లో కనిపిస్తే వెంటనే కొనుగోలు చేయండి.



## రెండు పెగ్గులూ మంచిది కాదు.. క్యాన్సర్ వచ్చే అవకాశం..



: మద్యపానం హానికరం అని ఎన్నో రకాలుగా బోర్డులు కనిపించిన చాలామంది మద్యం తాగడం మారడం లేదు. ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు.. రిలాక్స్ కావడానికి మద్యం తాగుతున్నామని చాలామంది చెబుతున్నప్పటికీ ఇది తాత్కాలికంగానే ఉపశమనం ఇస్తుందని.. దీర్ఘకాలికంగా అనేక వ్యాధులకు దారితీస్తుందని ఇప్పటికే ఎంతోమంది వైద్యులు హెచ్చరిస్తున్నారు. అయితే కొంతమంది గుండె సమస్యలు లేకుండా ఉండడానికి రోజుకు రెండు పెగ్గులు వేయడం నష్టం కాదని చెప్పినా.. మరి కొందరు మాత్రం రెండు పెగ్గులు కూడా ఇబ్బందికరమే అని.. మద్యం మొత్తం మానివేయడమే చాలా బెటర్ అని చెబుతున్నారు. అయితే తాజాగా నిర్వహించిన ఓ సర్వే ప్రకారం మద్యం తాగడం వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఆ వివరాలు లోకి వెళ్తే.. 2025 జనవరి లో అమెరికన్ సర్జన్ జనరల్ ప్రకారం.. లక్ష వరకు గుర్తించిన క్యాన్సర్ కేసుల్లో 20000 కేసులు మద్యం ద్వారా వచ్చిన వే అని గుర్తించారు. అలాగే అంతకుముందు 2023 సంవత్సరంలో ప్రచురించిన కొన్ని అధ్యయనాల ప్రకారం 70 శాతం మంది ఆల్కహాల్ బారినపడి ఆ తరువాత క్యాన్సర్ ముప్పునకు గురైనట్లు తేలింది. తాజాగా నిర్వహించిన ఓ సర్వేలో ప్రతి ఏడాది 7.5 లక్షల మంది మద్యం తాగిన వారు క్యాన్సర్కు గురైనట్లు తేలింది. ఇందులో భారత్లో 62,000, చైనాలో 2.8 లక్షల మంది క్యాన్సర్ బారిన పడుతున్నట్లు తేలింది. మద్యం తాగడం వల్ల ఎక్కువగా రొమ్ము క్యాన్సర్, పేగు క్యాన్సర్, అన్నవాహిక సమస్యలు, కాలేయ సమస్యలు, నోటి క్యాన్సర్ వంటివి గుర్తించినట్లు కొందరు పరిశోధకులు తేల్చారు. అందువల్ల మద్యలో ఎంతో కొంత అని అనకుండా మొత్తంగా మానివేయడమే మంచిది అని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుత కాలంలో మద్యలో అనేక రకాల పదార్థాలు కలుస్తున్నాయని.. ఇవి ఒక్కోసారి విషయంగా మారే ప్రమాదం ఉందని చెబుతున్నారు. అంతేకాకుండా కల్తీ మద్యం సేవించడం వల్ల ప్రాణాలకే ప్రమాదం ఉందని తెలుపుతున్నారు. మొన్నటి వరకు బ్రాండెడ్ మద్యం మంచిదనే భావన ఉండేది. కానీ ఇప్పుడు మద్యం ఏదైనా శరీరానికి హానికారమే అని తెలుపుతున్నారు. చాలామంది మానసికంగా ప్రశాంతతకు అలాగే ఒత్తిడి నుంచి దూరం కావడానికి మద్యం సేవిస్తూ ఉంటారు. అయితే మద్యానికి బదులు ప్రత్యామ్నాయంగా ఇతర అలవాట్లు చేసుకోవాలని.. అవి ఆరోగ్యకరమైనవి ఉండాలని చెబుతున్నారు. మద్యం వల్ల ఎలాంటి ఉపయోగం లేదని అందువల్ల దీనికి దూరంగా ఉండటమే మంచిది అని చెబుతున్నారు. అయితే కొన్ని దేశాల్లో మహిళలు కూడా ఎక్కువగా మద్యం సేవిస్తున్నట్లు గుర్తించారు. ఇలా ఎక్కువగా మహిళలు మద్యం తాగిన వారిలో అధికంగా క్యాన్సర్ బారిన పడిన విషయాలు బయటకు వస్తున్నాయి. అంతేకాకుండా కొందరు సరదాగా వీకెండ్ లో తీసుకోవాలని అనుకున్న అది ముప్పుగానే పరిగణించాలని చెబుతున్నారు. అయితే ఇప్పటికే మద్యం అలవాటు ఉన్నవారు మానుకోవాలంటే మెల్లిగా దూరం కావాలని.. ఒకేసారి మద్యం మానివేయడం కూడా మంచిది కాదని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు.


Printed Published and owned by Polagoni Rajesh, Printed at Smilys Online, Ranga Reddy (Dist), Telangana 501510. at H.No 4-136/12, Journalist colony, Turkayamjal, Ranga Reddy District, Telangana-501510 Editor: Polagoni Rajesh, epaper. www.saisuryaa.com.saisuryaadaily @gmail.com